మీడియాకు సంబంధించిన అన్ని విషయాల కోసం 9246213493
సహాయ
మీడియా సర్వీసు రి.
3-7-255,మన్సూరాబాద్,ఎల్బీనగర్,హైదరాబాద్-68

www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

అనుక్షణం
# నవభూమి
ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక




Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily fallows..
హైదరాబాద్ | 22 ఆదివారం | డిసెంబర్ 2024 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 97

# రాజీనామా?



- రాజీనామాకు సిద్ధమైన కేటీఆర్..!!
- ఈడీ విచారణకు నిష్పక్షపాతంగా సహకరించాలనే
- వర్కింగ్ ప్రెసిడెంట్ పదవికి రాజీనామా యోచన
- వారించిన బీఆర్ఎస్ శ్రేణులు

2

హైదరాబాద్-నవభూమిబ్యూరో
కేటీఆర్‌పై ఏసీబీ కేసు సంచలనంగా మారింది. ఫార్ములా ఈ రేసు కేసులో కేటీఆర్ అరెస్ట్ ఖాయం అనే ప్రచారం జరిగింది. ఎఫ్ఐఆర్ లో కేటీఆర్‌ను ఏ-1గా పేర్కొన్నారు. దీంతో, కేటీఆర్ హైకోర్టులో క్వాష్ పిటీషన్ దాఖలు చేసారు. సుదీర్ఘ వాదనల తరువాత కేటీఆర్ ను ఈ నెల 30వ తేదీ వరకు అరెస్ట్ చేయవద్దని హైకోర్టు ఆదేశించింది. దీంతో, ఈ రోజు అసెం బ్లీకి హాజరైన కేటీఆర్ ఆసక్తి కర వ్యాఖ్యలు చేసారు. కేటీఆర్

# మందుబాబులు ఖుష్!

- మద్యం ధరలను తగ్గించిన మద్యం సరఫరా కంపెనీలు
- లిక్కర్ ధరలను తగ్గించిన 11 మద్యం కంపెనీలు
- ఒక్కో క్వార్టర్ లిక్కర్‌పై రూ.30 వరకు తగ్గింపు
- మద్యం ధరల తగ్గింపుతో ఎక్సైజ్ ఆదాయం పెరుగుదల

2



అమరావతి-నవభూమిబ్యూరో
మందుబాబులకు గుడ్ న్యూస్... మద్యం ధరలు తగ్గించిన కంపెనీలు! వైసీపీ హయాంలో బేసిక్ ప్రైస్‌ను భారీగా పెంచేసిన మద్యం సరఫరా కంపెనీల్లో కొన్ని కీలక నిర్ణయం తీసుకున్నాయని అంటున్నారు.ఏపీలో గత ప్రభుత్వ హయాంలోని లిక్కర్ పాలసీపై తీవ్ర విమర్శలు వచ్చాయని.. 2024 ఎన్నికల ఫలితాల్లో దాని ప్రభావం కూడా స్పష్టంగా కనిపించిందనే కామెంట్లు వినిపించిన సంగతి తెలిసిందే. దీనికి తోడు ప్రధానంగా మద్యం బేసిక్ ప్రైస్ భారీగా పెరిగిన పరిస్థితి. ఈ నేపథ్యంలో మందుబాబులకు మద్యం కంపెనీలు ఓ గుడ్ న్యూస్ చెప్పినట్లు తెలుస్తోంది. అవును.. వైసీపీ హయాంలో బేసిక్ ప్రైస్‌ను భారీగా పెంచేసిన మద్యం సరఫరా కంపెనీల్లో కొన్ని కీలక నిర్ణయం తీసుకున్నాయని అంటున్నారు. ఇందులో భాగంగా... కొన్ని కంపెనీలు మద్యం ధరలను వాటంతట అవే తగ్గించుకున్నాయని తెలుస్తోంది. ఈ జాబితాలో సుమారు 11 కంపెనీలు ఉన్నాయని.. ఇవన్నీ బేసిక్ ప్రైస్ తగ్గించుకుంటున్నాయని చెబుతున్నారు. వాస్తవానికి గతంలో వైసీపీ ప్రభుత్వ పెద్దలు ఆయా కంపెనీల నుంచి కమిషన్లు తీసుకునేందుకు వీలుగా అన్నట్లుగా

# టాలీవుడ్‌కు సర్కార్ షాక్!

- ఇకపై ఎలాంటి బెనిఫిట్ షోలకు అనుమతి నో
- బెనిఫిట్/ప్రీమియర్‌షోను ప్రదర్శించడానికి అనుమతులుండవ్
- పుష్ప-2 బెనిఫిట్ షో సందర్భంగా తొక్కిసలాట
- మహిళ మృతి ఘటనపై సర్కార్ కీలక నిర్ణయం
- అసెంబ్లీలో మంత్రి కోమటిరెడ్డి సంచలన ప్రకటన
- త్వరలో ఉత్తర్వులు జారీ చేస్తామన్న మంత్రి

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయాన్ని తీసుకుంది. తెలుగు చలన చిత్ర పరిశ్రమలకు బిగ్ షాక్ ఇచ్చింది. ఇకపై ఎలాంటి బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వకూడదని నిర్ణయించింది. ఏ సినిమాకైనా సరే రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ కూడా ఒక్క బెనిఫిట్/ప్రీమియర్‌షోను ప్రదర్శించడానికి ఎలాంటి అనుమతులను మంజూరు చేయకూడదని తీర్మానించింది.
ఈ విషయాన్ని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. ఈ మేరకు అసెంబ్లీ శీతాకాల సమావేశాల సందర్భంగా సభలో ఓ ప్రకటన చేశారు. పుష్ప 2 ది రూల్ బెనిఫిట్ షో సందర్భంగా చోటు చేసుకున్న తొక్కిసలాటలో ఓ మహిళ దుర్మరణం పాలు కావడం, ఓ బాలుడు తీవ్రంగా గాయపడిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు.


**"అల్లుఅర్జున్ కు ఊహించని షాక్!"**

పుష్ప 2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన రేవతి అనే మహిళ మృతి చెందారు. తొమ్మిది సంవత్సరాల వయస్సున్న ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడ్డాడు. సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో బ్రెయిన్ డ్యామేజ్ అయిన స్థితిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై ఇప్పటికే పోలీసులు కేసు నమోదు చేశారు. హీరో అల్లు అర్జున్, చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్‌పై ఎఫ్ఐఆర్ పెట్టారు. అల్లు అర్జున్ అరెస్ట్ కూడా అయ్యారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర బెయిల్‌పై ఉన్నారు. అల్లు అర్జున్‌కు అభిమాని కావడం వల్ల తన కుమారుడి కోసమే కుటుంబంతో కలిసి సినిమాకు వచ్చినట్లుగా రేవతి భర్త ఆవేదన వ్యక్తం చేశారు.
ఈ తొక్కిసలాట ఘటన పట్ల తెలంగాణ

# మగాళ్ళకు డ్వాక్రా సంఘాలు

- శుభవార్త చెప్పిన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు..
- మగవారికి కూడా డ్వాక్రా సంఘాల ఏర్పాటు
- పురుషులతో గ్రూపులు ఏర్పాటు చేసి రుణాలు
- పురుషులకు స్వయం ఉపాధి కల్పించే ప్రయత్నం
- అనకాపల్లి జిల్లాలో ప్రయోగాత్మకంగా 28 గ్రూపులు
- ఇప్పటికే 20 గ్రూపుల తయారీ..తక్కువ వడ్డీకి రుణాలు

2



అమరావతి-నవభూమిబ్యూరో
టిడిపి హయాంలో మహిళలను గ్రూపులుగా చేసి డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి వారిలో పొదుపు నేర్పించి మహిళా సాధికారత కోసం చంద్రబాబు సర్కార్ కృషి చేసిన విషయం తెలిసిందే. ఇక తాజాగా మరోమారు పురుషుల పైన కూడా ఈ ఫార్ములాను వర్తింపజేయాలని కూటమి ప్రభుత్వం వినూత్నంగా ఆలోచించింది. దాదాపు 30 సంవత్సరాలుగా విజయవంతమైన డ్వాక్రా సంఘాలను పురుషుల విషయంలో కూడా ఏర్పాటు చేసే ప్లాన్ లో ఉంది. పురుషులతోనూ డ్వాక్రా తరహా గ్రూపులు పురుషులతో గ్రూపులు ఏర్పాటు చేసి, వారికి లోన్లు ఇవ్వటం ప్రారంభిస్తే వారికి సైతం స్వయం ఉపాధిని కల్పించినట్టు అవుతుందని భావిస్తోంది. ఈ క్రమంలోనే అనకాపల్లి జిల్లాలో 28 గ్రూపులను ఏర్పాటు చేయాలనేది లక్ష్యంగా పెట్టుకున్న కూటమి సర్కార్ ఇప్పటికీ 20 గ్రూపులను ఏర్పాటు చేసింది. గ్రూపులను కామన్ ఇంట్రెస్ట్ గ్రూప్‌గా పిలుస్తున్నారు. ఇక డ్వాక్రా సంఘాలు అంటే మహిళలు మాత్రమే కాదు ఇకపై పురుషులు కూడా.. తక్కువ వడ్డీకి పురుషులకు లోన్లు పురుషులు ఆర్థిక స్వావలంబన సాధించడానికి పనికి వస్తాయని కామన్ ఇంట్రెస్ట్ గ్రూపులుగా వీటిని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధమైంది. అనకాపల్లిలో ప్రయోగాత్మకంగా 20 కామన్ ఇంట్రెస్ట్ గ్రూపులను ఏర్పాటు చేసి వారికి తక్కువ వడ్డీకి బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. ఐదుగురు సభ్యులతో కామన్ ఇంట్రెస్ట్ గ్రూప్ ఇక రుణాలు సక్రమంగా చెల్లిస్తే డ్వాక్రా

# జగన్ హయాంలో ఆర్జీవీకి రూ.కోటి లబ్ధి

- వర్మకు షాకిచ్చిన ఏపీ ఫైబర్ నెట్!
- వ్యూహం సినిమాకు వర్మతో 2.15కోట్లకు ఫైబర్ నెట్ ఒప్పందం
- వ్యూస్ ప్రకారం డబ్బులు చెల్లించేందుకు ఒప్పందం
- ఒక వ్యూస్‌కు వందరూపాయలు చెల్లించాల్సి ఉండగా ఒక్కో వ్యూకు 11 వేల రూపాయల చొప్పున చెల్లింపు
- దాదాపు కోటీ 15లక్షల రూపాయలు అప్పనంగా చెల్లింపు
- వ్యూస్ లేకపోయినా ఆర్జీవీ ఖాతాలోకి కోటిరూపాయలు
- ఆర్జీవీతో పాటు లబ్ధి పొందిన వారికి నోటీసులు

2



అమరావతి-నవభూమిబ్యూరో
వివాదాస్పద దర్శకుడు రాంగోపాల్ వర్మకు ఊహించని షాక్ తగిలింది. ఏపీ ఫైబర్ నెట్ రాంగోపాల్ వర్మకు భారీ షాక్ ఇచ్చింది. రాం గోపాల్ వర్మ దర్శకత్వం వహించిన వ్యూహం సినిమాకు ఏపీ ఫైబర్ నెట్ 2.15కోట్లకు ఒప్పందం చేసుకొని 1.15కోట్ల రూపాయలను ఇచ్చిందని, అయితే వ్యూస్ ప్రకారం డబ్బులు చెల్లించాల్సి ఉందని ఆ ఒప్పందాన్ని తుంగలో తొక్కి రాంగోపాల్ వర్మకు అనుచిత లాభాన్ని చేకూర్చారని ఏపీ ఫైబర్ నెట్ వెల్లడించింది. వ్యూహం సినిమాకు అక్రమ లబ్ధి చేకూర్చిన ఏపీ ఫైబర్ నెట్ ఈ క్రమంలో దీనిపై వివరణ కోరుతూ ఏపీ ఫైబర్ నెట్ లీగల్ నోటీసులు జారీ చేసింది.రామ్ గోపాల్ వర్మ వ్యూహం సినిమాకు ఏపీ ఫైబర్ నెట్‌తో చేసుకున్న ఒప్పందం ప్రకారం కేవలం 1863వ్యూస్ మాత్రమే ఉన్నాయని, ఒక్కొక్క వ్యూకు ఒక వంద రూపాయలు చెల్లించవలసిన చోట ఒక్కొక్క వ్యూకు 11వేల రూపాయలు చొప్పున చెల్లించి రాంగోపాల్ వర్మకు లబ్ధి చేకూర్చినట్టు తాజాగా ఏపీ ఫైబర్ నెట్ పేర్కొంది. ఆర్జీవీకి కోటి 15 లక్షల రూపాయలు అనుచిత లబ్ధి వ్యూహం సినిమాకు వ్యూస్ లేకపోయినా

# నేను చూస్తూ ఊరుకోను

- సినీ ఇండస్ట్రీకి రేవంత్ హెచ్చరిక
- మహిళ మృతికి కారణమైన అల్లు అర్జున్‌ను అంతగా ఎందుకు పరామర్శిస్తున్నారు..
- బాధితులను ఆదుకోవడానికి సినీప్రముఖులు ఎందుకు ఆసక్తి చూపడటం లేదు
- అల్లు అర్జున్ రోడ్ షో నిర్వహించడం వల్లే దుర్ఘటన
- పరిస్థితి కంట్రోల్ తప్పుతుందని చెప్పిన తర్వాతే కారు టాప్ నుంచి చేతులూపుకుంటూ వెళ్లారు..

2






**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** ముఖ్యమంత్రి రేవంత్ అసెంబ్లీ వేదికగా సినీ ప్రముఖులకు చురకలు అంటించారు. మహిళ మరణానికి కారణమైన అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేస్తే ఎందుకు అంతగా పరామర్శిస్తున్నారని ప్రశ్నించారు. బాధితులను ఆదుకోవడానికి సినీ ప్రముఖులు ఎవరూ ఆసక్తి చూపించలేదని వ్యాఖ్యానించారు. సంధ్యా థియేటర్‌లో తొక్కిసలాట గురించి చెప్పినా అల్లు అర్జున్ సినిమా చూసిన తరువాతనే వెళ్తానని చెప్పారని రేవంత్ వెల్లడించారు. సినీ పరిశ్రమకు ప్రోత్సాహకం ఇస్తామని.. కానీ, స్పెషల్ ప్రివిలేజ్ తాను సీట్లు ఉండగా సాధ్యం కాదని తేల్చి చెప్పారు. రేవంత్ వ్యాఖ్యలతో అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ కీలక ప్రకటన చేసారు. తెలంగాణలో ఇక ఏ సినిమాకు ప్రీమియర్ షో కు అవకాశం ఉండదని స్పష్టం చేసారు. సినిమా థియేటర్ లో తొక్కిసలాట గురించి చెప్పి .. సినిమా చూస్తున్నఅల్లు అర్జున్‌ను వెళ్లాలని చెప్పినా.. సినిమా అయ్యే వరకు వెళ్లనని అల్లు అర్జున్ చెప్పారని సభలో రేవంత్ వివరించారు. ఆ తరువాత చర్యలు తీసుకోవాల్సి వస్తుందని.. పరిస్థితి కంట్రోల్ తప్పుతుందని చెప్పిన

# వైసీపీలో చేరనున్న మాజీ మంత్రి?

- సీన్ రివర్స్..ఖాళీ అవుతున్న వైసీపీలో బిగ్ జంప్
- మాజీ మంత్రి,మాజీ ఏపీసీసీ అధ్యక్షులు శైలజనాథ్
- వైసీపీ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం
- ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్
- కర్నూలులో ఓ వివాహ వేడుకల్లో వైసీపీ అధినేత
- జగన్ కలుసుకొన్న శైలజనాథ్ చర్చలు
- కాంగ్రెస్‌లో షర్మిల ప్రాధాన్యత ఇవ్వడంలేదన్న భావన

2



అమరావతి-నవభూమిబ్యూరో
వైసీపీ పార్టీ స్థాపించిన నాటి నుంచి కూడా ప్రజల్లో ఉన్న జగన్, గత ఎన్నికల్లో దారుణ ఓటమిని మూటగట్టుకున్నారు. 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో 15 స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో 12 గెలుపుకుని చరిత్ర సృష్టించారు. 2019లో జరిగిన ఎన్నికల్లో 151 సీట్లలో ఘన విజయం సాధించారు. కట్ చేస్తే ఇటీవల జరిగిన ఎన్నికల్లో కేవలం 11 స్థానాల్లో మాత్రమే గెలిచి ప్రతిపక్ష హోదా కూడా సాధించలేకపోయింది. పార్టీ ఓడిపోయిన తర్వాత చాలామంది వైసీపీ నేతలు పార్టీకి రాజీనామా చేశారు.మాజీ మంత్రులు సైతం పార్టీకి గుడ్ బై చెప్పేశారు. వైసీపీ నుంచి వెళ్లే నేతలే కనిపిస్తున్నారు తప్పిస్తే.. వైసీపీలోకి వచ్చే నేతలు ఎవరూ కూడా కనిపించడం లేదు. ఇలాంటి తరుణంలో ఓ సీనియర్ నేత వైసీపీ వైపు చూస్తున్నారనే వార్త ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఆ నేత మరెవ్వరో కాదు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శైలజానాథ్. తాజాగా ఆయన కర్నూల్‌లో జరిగిన ఓ వివాహ కార్యక్రమంలో జగన్‌ను కలిశారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సైతం బయటకు రావడం జరిగింది. దీంతో ఆయన వైసీపీ తీర్థం పుచ్చుకోవడం ఖాయమనే మాటలు

# రైతు బంధు ఇచ్చి తీరుతాం



- రైతు బంధుపై రేవంత్ రెడ్డి ప్రకటన..
- గత ప్రభుత్వం గొప్పలకు పోయి, నిర్లక్ష్యంగా, బాధ్యతారహితంగా వ్యవహరించింది.రూ.22,606 కోట్లు ఆయాచితంగా నష్టం
- సాగులో లేని భూములు, రాళ్లు, రప్పలు, గుట్టలు, రోడ్లు, పరిశ్రమలుగా రూపాంతరం చెందిన వాటికి, లై అవుట్లు వేసిన వాళ్లకు రైతు బంధు

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** అసెంబ్లీలో రైతు బంధుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. వ్యవసాయం చేసుకునే వారికి పెట్టుబడి సహాయం కింద కొంత నగదు మొత్తాన్ని అమలు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి

# రేవతి కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థికసాయం

- ప్రకటించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా చూస్తామన్న మంత్రి

హైదరాబాద్-నవభూమిబ్యూరో
పుష్ప-2 ప్రీమియర్స్ సందర్భంగా హైదరాబాద్ సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ (9) ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో, తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పెద్ద మనసుతో స్పందించారు. సంధ్య థియేటర్ ఘటనలో చనిపోయిన రేవతి కుటుంబానికి కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ తరపున రూ. 25 లక్షల ఆర్థికసాయం అందిస్తున్నా అని నేడు అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. పరిహారం ఇస్తామని చెప్పిన అల్లు అర్జున్ మాట నిలబెట్టుకోలేకపోయాడని విమర్శించారు.
ఇక, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్ పూర్తిగా కోలుకునేంత వరకు అన్ని వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి బాలుడి ఆరోగ్య వ్యవహారాలను పర్యవేక్షిస్తారని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చూస్తామని అన్నారు.





2

- మోడీ, ఈడీలకే కాదు..
- ఎన్ని కేసులు పెట్టినా తగ్గేది లేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడిన కేటీఆర్



# ఆర్థిక ఉగ్రవాదులను ఎంతకాలం భరించాలి: బీఆర్ఎస్ నేతలపై సీఎం ఫైర్

హైదరాబాద్-నవభూమి: తెలంగాణ అసెంబ్లీలో రైతు భరోసాపై స్వల్పకాలిక చర్చలో భాగంగా బీఆర్ఎస్ నేతలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ నేతలు దొంగలకు సంచులు మోసేవాళ్లే అంటూ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణను అభివృద్ధి చేసుకోవాలా? వద్దా?.. ఆర్థిక ఉగ్రవాదులను ఇంకెంతకాలం భరించాలి అని అన్నారు. బీఆర్ఎస్‌లో వెనుక కూర్చున్న కొందరు నేతలు తనకు కావాల్సిన వాళ్లే అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. పదేళ్లుగా ఎస్ఎల్‌బీసీ పూర్తి చేయకుండా నల్గొండకు ద్రోహం చేశారని.. బీఆర్ఎస్ నేతలు నల్గొండ జిల్లాకు వస్తారా అని ప్రశ్నించారు.
పదేళ్ల ప్రభుత్వం నడిపిన వారు ఎంత బాధ్యతగా ఉండాలి... అలాంటిది ఏడాది కాకుండానే తమపై విమర్శలు చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రూర మృగాలనైనా బంధించే శక్తి తమ సభ్యులకు ఉందన్నారు. బీఆర్ఎస్ సభ్యులు విధ్వంసకారులుగా తయారయ్యారంటూ విరుచుకుపడ్డారు. మూసీ ప్రక్షాళన చేయాలా వద్దా?.. మూసీపై నల్గొండ జిల్లా ప్రజలను అడుగుదాం అని సభలో ముఖ్యమంత్రి అన్నారు. కూళేశ్వరం కట్టారు...గత ప్రభుత్వం 11.5 శాతం వడ్డీతో అప్పులు తెచ్చిందని.. బీఆర్ఎస్ తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టడం వల్ల సంక్షేమానికి ఎక్కువ ఖర్చు చేయలేకపోతున్నామన్నారు. కొన్ని ముఖ్య ప్రాజెక్టులకు వరల్డ్ బ్యాంక్ రెండు శాతం వడ్డీకే రుణాలు ఇస్తుందన్నారు. 11.5 శాతం వడ్డీకి అప్పు తెచ్చిన వారిని ఏం చేయాలని అడిగారు. ఇలాంటి తప్పు చేస్తే వేరే దేశంలో ఉరి వేసేవారని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రం సర్వ నాశనమైందని చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో రూ.7 లక్షల కోట్ల అప్పులు చేశారన్నారు. కేసీఆర్ పదేళ్ల కష్టపడి కూళేశ్వరం కట్టారని దుయ్యబట్టారు.



## అన్నదాతకు గుడ్‌న్యూస్.. ఎకరానికి రూ.15 వేలు, అసెంబ్లీలో మంత్రి కీలక ప్రకటన



హైదరాబాద్-నవభూమి: తెలంగాణ రైతులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గుడ్‌న్యూస్ చెప్పారు. రైతుభరోసా అమలుపై కీలక అప్డేట్ ఇచ్చారు. సంక్రాంతి నుంచి రైతుభరోసా పంట పెట్టుబడి సాయం అందిస్తామన్నారు. ఈ మేరకు అసెంబ్లీలో వెల్లడించారు. సాగులో ఉన్న భూములకు మాత్రమే పంట పెట్టుబడి సాయం అందించనున్నట్లు తెలిపారు.రైతు భరోసా పంట పెట్టుబడి సాయం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పేరుతో ఎకరాకు రూ.10 వేలు ( రెండు విడతల్లో ఖరీఫ్, రబీ సీజన్లలో) పంట పెట్టబడి సాయం అమలు చేయగా.. కాంగ్రెస్ ఎకరాకు రూ. 15 వేలు (రెండు విడతల్లో) అమలు చేస్తామని హామీ ఇచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇప్పటి వరకు రైతుభరోసా పెట్టుబడి సాయం అందించలేదు.రైతుబంధు పథకం ద్వారా అనర్హులకు ఆర్థిక సహాయం అందిందని.. ప్రభుత్వ నిధులు దుర్వినియోగమవుతుందన్న విమర్శల నేపథ్యంలో పథకం అమలులో మార్పులు చేయాలని కాంగ్రెస్ సర్కార్ భావించింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో కేబినెట్ సబ్ కమిటీని సైతం నియమించి.. ఉమ్మడి జిల్లాల వారీగా పథకం అమలుపై ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియ నిర్వహించింది.రైతు భరోసా అంశంపై అసెంబ్లీలో నేడు చర్చ పెట్టారు. ఈ అంశంపై మాట్లాడిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కీలక ప్రకటన చేశారు. రైతులకు గుడ్‌న్యూస్ చెప్పారు. రైతుభరోసా పథకం అమలుకు ముహూర్తం ఫిక్స్ చేసారు. సంక్రాంతి నుంచి రైతుభరోసా అమలు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. విధివిధానాలు ఖరారు చేసి రైతుల అకౌంటల్లో డబ్బులు జమ చేస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సాగులో లేని భూములకు సైతం రైతుబంధు నిధులు జమ చేసినట్లు చెప్పారు. తమ ప్రభుత్వంలో మాత్రం కేవలం సాగులో ఉన్న భూములకు మాత్రమే పంట పెట్టుబడి సాయం అందజేస్తామన్నారు.'గతంలో ధరణి పోర్టల్‌లోని భూమి హక్కుల రికార్డుల ఆధారంగా రైతుబంధు ఇచ్చారు. భూమి ఉన్నవారు సాగు చేసినా.. చేయకపోయినా రైతుబంధుకు అర్హులయ్యారు. సీసీఎల్ఏ నుంచి అందిన భూవిస్తీర్ణంలో మార్పులు చేయడానికి అనుమతి లేదు. పట్టాదారుల బ్యాంకు ఖాతాలను సేకరించి రైతుబంధు పోర్టల్‌ను అప్‌డేట్ చేస్తున్నాం. 12 సీజన్లలో రూ.80,453.41 కోట్లు రైతు బంధు విడుదల చేశారు. 2023-24లో రూ.7625.14 కోట్లు కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించింది.' అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.

## తెలంగాణ సర్పంచ్,ఎంపీటీసీ ఎన్నికలు.. 'ఇద్దరు పిల్లల' నిబంధనపై సర్కార్ కీలక నిర్ణయం



హైదరాబాద్-నవభూమి:స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధనపై రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిబంధనను మర్చాలని పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయపార్టీలు, ఎన్నికల్లో పోటీ చేసే ఆశావాహుల నుంచి విజ్ఞప్తులు రాగా.. వాటిని తిరస్కరించింది. ఇద్దరు పిల్లల నిబంధనను కొనసాగించాలని డిసైడ్ అయింది. ఈ నిబంధన ప్రకారం.. 1994 తర్వాత ఇద్దరి కంటే ఎక్కువ సంతానం కలిగి ఉన్నవారు ఎన్నికల్లో పోటీ చేయటానికి అనర్హులు.
తెలంగాణలో త్వరలో మరో ఎన్నికల నగరా మోగనుంది. స్థానిక సంస్థల ఎన్నికలకు సర్కార్ సిద్ధమవుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో సర్పంచ్, జూన్‌లో ఎంపీటీసీలు, జడ్పీటీసీల పదవీ కాలం ముగిసింది. ప్రస్తుతం గ్రామ పంచాయితీల్లో ప్రత్యేక అధికారులు పాలన సాగిస్తున్నారు. అయితే సర్పంచ్‌గా పోటీ చేసే ఆశావాహులు ఇప్పటికే గ్రామాల్లో పాగా వేసారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. మంచీ చెడులకు హాజరై.. స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తమవుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధనపై రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇద్దరు పిల్లలకు మించి ఉన్న వారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులనే నిబంధనను కొనసాగించాలని డిసైడ్ అయింది. ఈ నిబంధనను మార్చాలని వచ్చిన ప్రతిపాదనలను తెలంగాణ కేబినెట్ తిరస్కరించింది. పాత నిబంధననే కొనసాగించాలని తాజాగా పంచాయతీరాజ్ శాఖను ఆదేశించింది. ఈ మేరకు గురువారం (డిసెంబర్ 19) అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బిల్లులో దీనిపై స్పష్టత వచ్చింది. ఇతర అంశాలతో పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టగా.. సభ ఆమోదం తెలిపింది. ఆ బిల్లులో ఇద్దరు పిల్లల నిబంధనపై ఎటువంటి సవరణ చేయలేదు.
కుటుంబ నియంత్రణ చర్యల్లో భాగంగా 1994లో ఉమ్మడి ఏపీలో ఈ నిబంధనను అమల్లోకి తీసుకొచ్చారు. ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్న వ్యక్తులు స్థానిక సంస్థలు ( సర్పంచ్, ఎంటీటీసీ, జడ్పీటీసీ, పురపాలక) ఎన్నికల్లో పోటీకి అనర్హులని అప్పటి ప్రభుత్వం చట్టం చేసింది. గత 30 ఏళ్లుగా ఈ నిబంధన కొనసాగుతూనే ఉంది. అయితే ప్రస్తుతం కుటుంబ నియంత్రణపై ప్రజల్లో అవగాహన పెరిగినందున పాత నిబంధనను మార్చాలని పలు రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు. ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్న వారికి సైతం స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.ఈ అంశంపై కొందరు మంత్రులు హామీ కూడా ఇచ్చారు. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ ఇద్దరు పిల్లల నిబంధనను చట్టసవరణ ప్రతిపాదనల్లో మంత్రిమండలి ఆమోదానికి పెట్టింది. అయితే ఈ ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం లభించలేదు. నిబంధన మార్పును కొన్ని వర్గాలు వ్యతిరేకిస్తాయనే కారణంతో ప్రతిపాదనను ప్రభుత్వం నిరాకరించినట్లు తెలుస్తోంది. ఈ ఒక్కటి మినహా మిగిలిన అన్ని ప్రతిపాదనలను తాజాగా మంత్రిమండలి ఆమోదించింది. దీనికి అనుగుణంగా చట్టసవరణ బిల్లును రూపొందించారు. అనంతరం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. కాగా, జనవరి చివరి వారం లేదా ఫిబ్రవరిలో స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడుతుందనే లీకులు వినిపిస్తున్నాయి.

## భద్రాద్రి రామయ్య వెండి ఇటుక మిస్సింగ్.. వారి వద్ద నుంచి డబ్బులు రికవరీ..?



హైదరాబాద్-నవభూమి:దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి రామయ్య ఆలయంలో వెండి ఇటుక మాయమైన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన తనిఖీల్లో ఇటుక కనిపించకుండా పోయింది. తాజాగా.. ఆ ఇటుకకు సంబంధించిన సొత్తును ఆలయ అధికారులు రికవరీ చేసినట్లు తెలిసింది. సిబ్బంది నుంచే ఆ సొత్తు రికవరీ చేసినట్లు సమాచారం.తెలంగాణలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం ఒకటి. యాదాద్రి తర్వాత ఎక్కువ మంది భక్తులు రామయ్యను దర్శించుకుంటారు. దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాద్రి రామయ్యను ఇతర ఇతర రాష్ట్రాల భక్తులు వేల సంఖ్యలో దర్శించుకుంటారు. ఈ సందర్భంగా భక్తులు రామయ్యకు విలువైన కానుకలు అందిస్తుంటారు. అందులో నగదుతో పాటుగా.. బంగారం, వెండి కానుకలు ఉంటాయి. ఈ కానుకలను కొంత మేర ఆలయంలో మిగతాది బ్యాంకు లాకర్లలో భద్ర పరుస్తుంటారు. అయితే ఈ ఏడాది ప్రారంభంలో రామయ్య వెండి ఇటుక మాయమైన ఘటన కలకలం రేపింది. ఆరు కిలోల బరువున్న వెండి ఇటుక కనిపించకుండా పోయింది. జ్యువెలరీ వెరిఫికేషన్ అధికారి తనిఖీల్లో ఈ వ్యవహారం బయటపడింది.భక్తులు భద్రాద్రి రామయ్యకు మొక్కుల్లో భాగంగా వెండిని సమర్పిస్తుంటారు. ఇలా వచ్చిన వెండిలో కొంత మొత్తాన్ని పదేళ్ల కిందట 7 ఇటుకలుగా తయారుచేయించారు. ఒక్కో ఇటుక సుమారు 5-6 కేజీల బరువు ఉంటుంది. ఈ ఏడాది ప్రారంభంలో తూకం వేస్తుండగా ఇందులో ఓ ఇటుక మిస్సింగ్ అయినట్లు అధికారులు గుర్తించారు. బ్యాంకు లాకర్లతో పాటు ఆలయంలోని వెండిని దాచే విభాగాన్ని పరిశీలించినా ఇటుక జాడ మాత్రం లభించలేదు. తాజాగా.. దేవస్థానంలో కనిపించకుండా పోయిన వెండి ఇటుకకు సంబంధించిన డబ్బును ఇటీవల రికవరీ చేసినట్లు తెలిసింది. ఆ సమాచారాన్ని దేవాదాయ శాఖకు సైతం పంపినట్లు ఆలస్యంగా వెలుగుచూసింది.
స్వామివారి వెండి వస్తువులు, కానుకలు పర్యవేక్షణ బాధ్యతలను నిర్వర్తించే సిబ్బంది నుంచి దాదాపు రూ.8 లక్షలను రికవరీ చేసి ఆలయ ఖాతాకు జమ చేసినట్లు తెలిసింది. వీరి హయాంలోనే ఇటుక కనిపించలేదన్న కారణంతో వారి వద్ద నుంచే డబ్బును రికవరీ చేసినట్లు సమాచారం. వారి అలసత్వమో, ఇతర కారణమేదైనా ఆ మొత్తాన్ని సిబ్బందే చెల్లించినట్లు తెలిసింది. 2017లో సీతమ్మవారి మంగళ సూత్రం, లక్ష్మణస్వామి బంగారు లాకెట్ సైతం కొద్ది రోజుల పాటు కనిపించకుండా పోయాయి. ఆ తర్వాత ఇదే ఆలయంలోని బీరువాలో ఆ ఆభరణాలు లభించాయి. బంగారం, వెండి నిల్వల తాజా వివరాలను ఇప్పటికీ వెల్లడించకపోవటంతోనే ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటున్నట్లు భక్తులు చెబుతున్నారు. రామయ్య సొత్తుకే రక్షణ లేకుంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా కానుకల నిర్వహణను పకడ్బందీగా నిర్వహించాలని సూచిస్తున్నారు.

## ట్రైన్ ప్రయాణికులకు అలర్ట్.. 25 నుంచి జనవరి 9 వరకు ఈ రైళ్లు రద్దు



హైదరాబాద్-నవభూమి:తెలంగాణ నుంచి ముఖ్యంగా వరంగల్ జిల్లా నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికులకు సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు అలర్ట్ జారీ చేశారు. రైల్వే ట్రాక్ నిర్వహణ పనుల కారణంగా రాష్ట్రంలోని పలు ట్రైన్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈనెల 25 నుంచి జనవరి 9 వరకు పలు ట్రైన్లు పూర్తిగా, మరికొన్ని పాక్షికంగా రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు.తెలంగాణ నుంచి రాకపోకలు సాగించే ట్రైన్ ప్రయాణికులకు సౌత్ సెంట్రల్ రైల్వే అలర్ట్ జారీ చేసింది. ట్రాక్ నిర్వహణ పనుల కారణంగా పలు ట్రైన్లు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. మరికొన్ని ట్రైన్లను పాక్షికంగా రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. కాజీపేట-కొండపల్లి సెక్షన్‌లోని మోటమర్రి రైల్వే స్టేషన్ వద్ద ప్రస్తుతం మూడో రైల్వే లైను నిర్మాణంలో ఉందన్నారు. ఇందులో భాగంగా చేపట్టనున్న నాన్ ఇంటర్ లాకింగ్ పనుల దృష్ట్యా ఉమ్మడి వరంగల్ జిల్లాలో నడిచే పలు ట్రైన్లను రద్దు చేసశారు. ఈ నెల 25 నుంచి జనవరి 9 వరకు పలు ట్రైన్ల రాకపోకలకు అంతరాయం కలగనుందని రైల్వే అధికారులు వెల్లడించారు.
రద్దయిన ట్రైన్ల వివరాలు..
డిసెంబరు 25- జనవరి 9 మధ్య.. డోర్నకల్-కాజీపేట మెమూ(07754), డోర్నకల్-విజయవాడ మెమూ(07755), కాజీపేట-డోర్నకల్ మెమూ(07753), విజయవాడ-భద్రాచలం రోడ్డు మెమూ(07979), భద్రాచలం రోడ్డు-విజయవాడ మెమూ(07278) విజయవాడ-డోర్నకల్ మెమూ(07756) ట్రైన్లు రద్దుచేశారు. డిసెంబరు 28, 29, జనవరి 02, 05, 07, 08, 09 తేదీల్లో.. ట్రైన్ నంబర్ 12705 గుంటూరు-సికింద్రాబాద్ ఇంటర్‌సిటి ఎక్స్‌ప్రెస్, ట్రైన్ నెంబర్ 12706 సికింద్రాబాద్-గుంటూరు ఇంటర్‌సిటి ఎక్స్‌ప్రెస్. డిసెంబరు 27, జనవరి 01, 04, 07, 08, 09 తేదీల్లో.. ట్రైన్ నంబరు 12713 విజయవాడ-సికింద్రాబాద్ శాతవాహన ఎక్స్‌ప్రెస్, ట్రైన్ నెంబర్ 12714 సికింద్రాబాద్-విజయవాడ శాతవాహన ఎక్స్‌ప్రెస్ ట్రైన్లు క్యాన్సిల్ చేశారు.
పాక్షితంగా రద్దయిన ట్రైన్ల వివరాలు..
డిసెంబరు 27- జనవరి 09 మధ్య ట్రైన్ నంబరు 17201 గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ట్రైన్, గుంటూరు-కాజీపేట, ట్రైన్ నెంబర్ 17202 గోల్కొండ ఎక్స్‌ప్రెస్ కాజీపేట-గుంటూరు ట్రైన్‌ను రద్దు చేశారు. దూర ప్రాంతాల మధ్య నడిచే పలు ఎక్స్‌ప్రెస్ ట్రైన్లను డైవర్ట్ చేశారు. డిసెంబరు 27, 28, జనవరి 01, 04, 06, 07, 08 తేదీల్లో ట్రైన్ నెంబర్ 17406 ఆదిలాబాద్-తిరుపతి కృష్ణా ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌ను, జనవరి 07, 08, 09 తేదీల్లో ట్రైన్ నంబరు 20834 విశాఖపట్నం వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌ను రీ-షెడ్యూల్ చేశారు.

## మోడీ, ఈడీలకే కాదు..ఎన్ని కేసులు పెట్టినా తగ్గేది లేదు

### ◆ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్-నవభూమి:తాను ఏ కేసులకూ భయపడేది లేదని తేల్చి చెప్పారు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. శనివారం శాసనసభ సమావేశాల అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కేటీఆర్ మాట్లాడారు. అసెంబ్లీ చరిత్రలో ఎప్పుడు చెప్పని విధంగా అబద్ధాలు చెప్పారని మండిపడ్డారు. రైతుబంధు డబ్బులు ఎగ్గొట్టారన్నారు. రైతుబంధు దుర్వినియోగం అయ్యిందని ప్రభుత్వం పచ్చి అబద్ధాలు చెబుతోందని ధ్వజమెత్తారు. తాము రైతుబంధు అమలు చేసిన తర్వాత రైతు ఆత్మహత్యలు తగ్గాయని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ సర్కారు రెండో విడత రైతుబంధు ఇవ్వడం లేదని అన్నారు. రైతుబంధు ఎగ్గొట్టేందుకే కేబినెట్ సబ్ కమిటీ అని అన్నారు. రైతు రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ సర్కరు డొల్లతనం బయటపడింద న్నారు. సీఎం 100 శాతం రుణమాఫీ అయ్యిందంటే.. వాళ్ల ఎమ్మెల్యేలే 70 శాతం అమలైందని అంటున్నారని కేటీఆర్ చెప్పారు. ' తెలంగాణ రాష్ట్రంలోని ఏ గ్రామంలో కూడా పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదని కేటీఈర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయలేదని.. రైతుబంధు కూడా ఇవ్వలేదని కేటీఆర్ ఆరోపించారు. వీటిపై తాము అడిగితే సీఎం రేవంత్ రెడ్డికి కోపం వస్తుందన్నారు. ప్రభుత్వం చెప్పే కాకి లెక్కలు తాము నమ్మడం లేదన్నారు. రూ. 26,775 కోట్లు రైతు భరోసా రైతులకు ప్రభుత్వం ఇవ్వాలన్నారు. ఇలాంటి ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు కేటీఆర్. మాజీ సీఎం కేసీఆర్‌ను అగౌరవపరుస్తూ మాట్లాడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. కేసీఆర్‌కు గౌరవమిస్తే.. తాము సీఎంకు గౌరవిస్తామన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేయడం లేదని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. తమపై ఎన్ని కేసులు పెట్టినా భయపడమని అన్నారు. ఈడీకి భయడం.. మోడీకి భయపడమంటూ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమకు న్యాయస్థానాల మీద నమ్మకం ఉందని.. ఎన్ని కేసులు పెట్టినా వెనుకడగు వేయమని కేటీఆర్ స్పష్టం చేశారు.

## వైసీపీలో చేరనున్న మాజీ మంత్రి?

(1వపేజీ తరువాయి)వినిపిస్తున్నాయి. 2019 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ బాధ్యతల నుంచి తప్పుకున్న శైలజానాథ్, ఆ తర్వాత పెద్దగా యాక్టివ్ పొలిటిక్స్ చేయడం లేదు. గత ఎన్నికల్లో సైతం ఆయన పోటీకి దూరంగా ఉన్నారు. ఇదే సమయంలో ఆయన షర్మిల తీరుపై కూడా గుర్రుగా ఉన్నారని సమాచారం. దీని కారణంగానే శైలజానాథ్ రాజకీయాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. అయితే ఆయన తిరిగి యాక్టివ్ పొలిటిక్స్ చేయాలని చూస్తున్నారు. దీనిలో భాగంగానే శైలజానాథ్ వైసీపీలో చేరాలని చూస్తున్నారని తెలుస్తోంది. ఆయన వైసీపీలో చేరతారని ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతోంది. ఈక్రమంలోనే కర్నూల్‌లో జగన్‌తో శైలజానాథ్ భేటీ అయినట్టు తెలుస్తోంది. శైలజానాథ్ దివంగత సీఎం వైఎస్ఆర్ హయంలో మంత్రిగా ఓ వెలుగు వెలిగారు. ముఖ్యంగా రాజశేఖరరెడ్డి అనుచరుడుగా ఆయనకు మంచి గుర్తింపు ఉంది. శైలజానాథ్ గతంలో శింగనమల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు.వైసీపీకి సైతం ఇక్కడ పంచి పట్టుంది. 2014,2019 వరుస ఎన్నికల్లో ఇక్కడ వైసీపీ అభ్యర్థి విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో జొన్నలగడ్డ పద్మావతికి టికెట్ ఇస్తే వైసీపీ నుంచి ఆమె ఎమ్మెల్యే అయ్యారు. అయితే 2024లో మాత్రం సిట్టింగ్ ఎమ్మెల్యే పట్ల వ్యతిరేకత ఉందని భావించి జగన్ ఇక్కడ కొత్త ప్రయోగం చేశారు. రాజకీయాలకు కొత్త అయిన టిప్పర్ డ్రైవర్‌కి టికెట్ ఇచ్చి గెలిపిద్దామనుకున్నారు. కానీ కూటమి అభ్యర్థి ఇక్కడ నుంచి విజయం సాధించారు. ఇప్పుడు శైలజానాథ్ వైసీపీలో చేరితే , శింగనమల నియోజకవర్గం బాధ్యతలను ఆయనకు అప్పగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. జనవరి నెలలో శైలజానాథ్ వైసీపీ తీర్థం పుచ్చుకుంటారని తెలుస్తోంది.ఇదే కనుక జరిగితే శింగనమల నియోజకవర్గంలో ఫ్యాన్ జోరు పెరగడం ఖాయంగా కనిపిస్తోంది.

## శ్రీతేజ్ ఆరోగ్యంపై హెల్త్ బులిటెన్ విడుదల

హైదరాబాద్-నవభూమి: పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు శనివారం రాత్రి తాజాగా హెల్త్ బులిటెన్ విడుదల చేశారు. శ్రీతేజ్ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. వెంటిలేటర్ సాయం లేకుండా శ్రీతేజ్ శ్వాస తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అయితే, బాలుడికి అప్పుడప్పుడు జ్వరం వస్తోందని.. శుక్రవారంతో పోల్చితే నేడు శ్రీతేజ్ ఆరోగ్యం మెరుగుపడినట్లు కిమ్స్ వైద్యులు తెలిపారు. ఫీడింగ్ కూడా తీసుకుంటున్నాడని చెప్పారు. కాగా, శ్రీతేజ్ కళ్లు తెరిచాడని.. అయితే ఎవరినీ గుర్తు పట్టడం లేదని శుక్రవారం వైద్యులు తెలిపిన విషయం తెలిసిందే. %గాశ్రీంశీ =ఘుఽ% "అల్లుఅర్జున్ కు ఊహించని షాక్!" మరోవైపు, శ్రీతేజ్ వైద్య ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రకటించారు. అసెంబ్లీలో సంధ్య థియేటర్ ఘటనపై చర్చ జరిగిన అనంతరం మంత్రి కోమటిరెడ్డి అసెంబ్లీ నుంచి నేరుగా కిమ్స్ ఆస్పత్రికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కాగా, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.. వ్యక్తిగతంగా ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా బాధిత కుటుంబానికి రూ. 25 లక్షల సాయం ప్రకటించారు. అల్లు అర్జున్ ప్రెస్‌మీట్ సినీనటుడు అల్లు అర్జుఽ మీడియాతో మాట్లాడారు. పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనపై తెలంగాణ అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి సుదీర్ఘంగా మాట్లాడిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సినీ ప్రముఖులపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలోనే అల్లు అర్జున్ ప్రెస్‌మీట్ పెట్టడంపై ఆసక్తి నెలకొంది. ' అల్లు అర్జున్ తన నివాసంలోనే మీడియాతో మాట్లాడారు. తనపై సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలకు అల్లు అర్జున్ వివరణ ఇచ్చే అవకాశం ఉంది

## రాజీనామా?

(1వపేజీ తరువాయి)వ్యాఖ్యలతో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులతో కేటీఆర్‌కు తాత్కాలికంగా రిలీఫ్ దక్కింది. అయితే, ఈ కేసులో విచారణ కొనసాగించేందుకు ఏసీబీకి కోర్టు అనుమతి ఇచ్చింది. ఎవరినైనా విచారణ చేయవచ్చని పేర్కొంది. దీంతో, ఈ కేసు పైన ఫిర్యాదు చేసిన అధికారి దానకిశోర్ నుంచి సమాచారం సేకరించిన ఏసీబీ తదుపరి విచారణకు సిద్దమైంది. ఇక, కోర్టు ఇచ్చిన రిలీఫ్‌తో కేటీఆర్ శనివారం అసెంబ్లీకి హాజరయ్యారు. రైతు భరోసా పైన చర్చల్లో పాల్గొన్నారు. సంక్రాంతికి రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రభు త్వం ప్రకటించింది. ఇదే సమయంలో ప్రతి పక్షం నుంచి సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరింది. మంత్రుల కౌంటర్ ఇదే అంశం పైన మాట్లాడిన కేటీఆర్ తమ ప్రభుత్వ హయాంలో రైతులకు చేసిన మేలు గురించి వివరించారు. రుణమాఫీ గురించి ప్రస్తావన చేసారు. ఈ రాష్ట్రంలో ఏ ఒక్క ఊరిలోనైనా వంద శాతం రుణమాఫీ జరిగినట్టు నిరూపిస్తే.. స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా వెంటనే ఇచ్చి రాజకీయ సన్యాసం తీసుకుంటానని వెల్లడించారు. చెల్లించాల్సిన రైతు రుణమాఫీ అంశంలో పలు సందర్భాల్లో చెప్పిన మొత్తం రుణ విలువ గురించి వివరించారు. కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు ప్రభుత్వం నుంచి మంత్రులు గట్టి కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో రైతు రుణమాఫీ చేస్తామని చెప్పి..మోసం చేసారని ఆరోపించారు. తాము రెండు లక్షల వరకు ప్రతీ రైతుకు రుణమాఫీ అమలు చేసామని చెప్పుకొచ్చారు.

## టాలీవుడ్‌కు సర్కార్ షాక్!

(1వపేజీ తరువాయి)ప్రభుత్వం స్పందించింది. దీన్ని తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంది. ఇక ముందు బెనిఫిట్ షోలకు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని నిర్ణయించింది. బెనిఫిట్/ ప్రీమియర్ షోలు రద్దు చేసేలా, రెగ్యులర్ షోలు మాత్రమే ప్రదర్శించుకునేలా త్వరలోనే ఉత్తర్వులను జారీ చేస్తామని కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.
మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు. రేవతి మృతిపట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను కలచివేసిందని చెప్పారు. ఇక నుంచి బెనిఫిట్ షోలకి పర్మిషన్ ఇవ్వబోమని స్పష్టం చేశారు. థియేటర్‌లో తొక్కిసలాట చోటు చేసుకుని ఓ నిండు ప్రాణం పోవడం బాధాకరమని అన్నారు.
ఈ ఘటన పట్ల హీరో గానీ, పుష్ప 2 సినిమా యూనిట్ గానీ స్పందించకపోవడాన్ని కోమటిరెడ్డి వెంకటరెడ్డి తప్పుపట్టారు. సినిమా కలెక్షన్ల కోసం ఓ నిండు ప్రాణాన్ని తీస్తారా? అంటూ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. వందలు, వేల కోట్ల రూపాయల మేర కలెక్షన్లు వస్తాయని నిర్మాణ సంస్థ చెబుతోందని, మృతురాలి కుటుంబానికి 25 లక్షల రూపాయల నష్ట పరిహారాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారాయన.

## రైతు బంధు ఇచ్చి తీరుతాం

(1వపేజీ తరువాయి)రేవంత్ రెడ్డి అన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం అనుసరించిన విధానాలను తప్పుపట్టారు. అప్పట్లో చోటు చేసుకున్న లోపాలన్నింటినీ ఆయన అంకెలతో సహా అసెంబ్లీలో వివరించారు. గత ప్రభుత్వం గొప్పలకు పోయి, నిర్లక్ష్యంగా, బాధ్యతారహితంగా వ్యవహరించడం వల్ల సాగులో లేని భూములు, రాళ్లు, రప్పలు, గుట్టలు, రోడ్లు, పరిశ్రమలుగా రూపాంతరం చెందిన వాటికి, లే అవుట్లు వేసిన వాళ్లకు కూడా రైతు బంధు కింద డబ్బులు జమ అయ్యాయని అన్నారు. ఈ విధంగా 22,606 కోట్ల రూపాయలు దుర్వినియోగానికి గురయ్యాయని రేవంత్ రెడ్డి వివరించారు. గత ప్రభుత్వం మొత్తం 72,816 కోట్ల రూపాయలను రైతు బంధు పథకం కింద జమ చేయగా.. ఇందులో 22,606 కోట్ల రూపాయలు అయాచితంగా అనర్హులకు చేరిందని ఆయన సభ దృష్టికి తీసుకొచ్చారు. గత ప్రభుత్వం అనుసరించిన విధంగా రాళ్లు, రప్పలు, గుట్టలకు కూడా రైతు బంధు పథకాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందా? అని ప్రశ్నించారు రేవంత్ రెడ్డి. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిథ్యాన్ని వహిస్తోన్న గజ్వేల్ నియోజకవర్గంలో రాజీవ్ రహదారి, ఆమనగల్‌లో శ్రీశైలం రోడ్ల కింద పోయిన భూములకు కూడా రైతు బంధు పథకం కింద నిధులు అందాయని అన్నారు. కొన్ని చోట్ల క్రషర్లు, మరికొన్ని చోట్ల మైనింగ్ జరుగుతున్న భూములకు కూడా రైతు బంధు అమలు అయిందని, గిరిజనులు, ఆదివాసీల పేర్ల మీద బీఆర్ఎస్ నాయకులు నకిలీ పాస్ పుస్తకాలను సృష్టించి రైతు బంధు కింద లబ్ది పొందారని రేవంత్ రెడ్డి సభకు కూలంకషంగా వివరించారు.

## మందుబాబులు కుష్!


(1వపేజీ తరువాయి)వాటికి చెల్లించే బేసిక్ ప్రైస్‌ని భారీగా పెంచేశారనే ఆరోపణలు బలంగా వినిపించిన సంగతి తెలిసిందే. దీనిపై తీవ్ర విమర్శలు, ఫిర్యాదులూ వచ్చాయని అంటారు. ఈ సమయంలో పలు కంపెనీలు వాటికవే బేసిక్ ప్రైస్ తగ్గించుకున్నాయని అంటున్నారు. ఈ క్రమంలో సుమారు 11 కంపెనీలు వాటి వాటి బేసిక్ ప్రైస్‌ను తగ్గించుకున్నాయని.. వాటికవే ఈ నిర్ణయం తీసుకున్నాయని.. ఫలితంగా... ఆయా కంపెనీల నుంచి రాష్ట్రం కొనే ధర తగ్గిందని అంటున్నారు. ఫలితంగా.. ఆయా బ్రాండ్లను బట్టి ఒక్కో క్వార్టర్ ధర ఎమ్మార్పీపై సుమారు రూ.30 వరకూ తగ్గనుందని చెబుతున్నారు.

## మగాళ్ళకు డ్వాక్రా సంఘాలు

(1వపేజీ తరువాయి)సంఘాల మాదిరిగానే వీరికి రుణ పరిమితిని కూడా బ్యాంకులు పెంచే అవకాశం ఉంది. ఐదుగురు సభ్యులు వస్తే చాలు, ఎన్ని గ్రూపులు అయినా ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఈ గ్రూపులను ఏర్పాటు చేస్తున్న యుసిడి పీడీ వెల్లడించారు. ఈ గ్రూప్స్ లో వీరు చేరొచ్చు.. ఇలా చెయ్యాలి భవన నిర్మాణ కార్మికులు ,వాచ్ మెన్లు, రిక్షా కార్మికులు, ఫుడ్ డెలివరీ బాయ్స్, ప్రైవేట్‌గా పని చేసే వారు ఎవరైనా సరే 18 ఏళ్ల నుండి 60 ఏళ్లలో ఉన్న పురుషులు కామన్ ఇంట్రెస్ట్ గ్రూప్లో చేరవచ్చు. తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డును వారి దరఖాస్తు తో పాటు అందిస్తే గ్రూప్ ను ఏర్పాటు చేస్తారు. ఐదుగురు సభ్యులతో ఒక గ్రూపును సిద్ధం చేస్తారు. ఇక అనకాపల్లిలో ఈ విధానం సక్సెస్ అయితే రాష్ట్రవ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేసే అవకాశం ఉంటుంది.

### జగన్ హయాంలో ఆర్జీవీకి రూ.కోటి లబ్ధి

(1వపేజీ తరువాయి)రాంగోపాల్ వర్మకు ఒక కోటి 15 లక్షల రూపాయలను అనుచితంగా లబ్ధిని చేకూర్చారని ఏపీ ఫైబర్ నెట్ సంచలన విషయాలను వెల్లడించింది. ఈ క్రమంలోనే రామ్ గోపాల్ వర్మతో పాటు పలువురికి లీగల్ నోటీసులను జారీ చేసినట్టు ఒక ప్రకటనలో పేర్కొంది. వర్మతో పాటు వారికి కూడా లీగల్ నోటీసులు ఈ అక్రమ చెల్లింపులపైన రాంగోపాల్ వర్మతో పాటు ఎండి మద్దిరాల మధుసూదన్ రెడ్డి, ఉయ్యూరు గుణ శశాంక్ రెడ్డి, ఆర్జీవి ఆర్.వీ గ్రూప్ భాగస్వామి గొట్టిముక్కల రవిశంకర్ వర్మ, ఆర్జీవి ఆర్వీ గ్రూప్ ఎండి తదితరులకు లీగల్ నోటీసులను పంపింది. ఈ చెల్లింపులకు సమాధానం చెప్పాలని లీగల్ నోటీసులలో పేర్కొంది. వడ్డీతో సహా తిరిగి చెల్లించాలని నోటీసులు నిబంధనలకు విరుద్ధంగా లబ్ధి పొందిన కారణంగా 15 రోజులలోపు వడ్డీతో సహా మొత్తం కట్టాలని లీగల్ నోటీసులలో వెల్లడించింది ఫైబర్ నెట్ చైర్మన్ జీవి రెడ్డి ఆదేశాలతో ఈ లీగల్ నోటీసులను పంపించారు.



## కోర్టు బయట వ్యక్తిని నరికి చంపిన గ్యాంగ్

**తిరువనంతపురం-నవభూమి:** ఒక వ్యక్తిపై గ్యాంగ్ దాడి చేసింది. ఆ గ్యాంగ్ సభ్యులు కొడవళ్లతో ఆ వ్యక్తి వెంటపడ్డారు. కోర్టు బయట నరికి చంపారు. గ్యాంగ్‌కు చెందిన ఒక వ్యక్తిని పోలీసులు, లాయర్లు పట్టుకున్నారు. కారును వెంబడించిన పోలీసులు పారిపోతున్న ఆ గ్యాంగ్‌కు చెందిన మిగతా వ్యక్తులను కూడా అరెస్ట్ చేశారు. తమిళనాడులోని తిరునెల్వేలి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మహిళ హత్య కేసులో నిందితుడైన 25 ఏళ్ల మాయండి శుక్రవారం కేసు విచారణ కోసం కోర్టు వద్దకు చేరుకున్నాడు. కోర్టు కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న రెస్టారెంట్ వద్ద అతడు ఉండగా ఒక గ్యాంగ్ దాడి చేసింది. దీంతో తప్పించుకునేందుకు మాయండి కోర్టు వైపు పరుగెత్తాడు. వెంబడించిన ఆ గ్యాంగ్ సభ్యులు కోర్టు బయట కోడవళ్లతో నరికి అతడ్ని హత్య చేశారు.



కాగా, ఈ సంఘటన చూసి కోర్టు కాంప్లెక్స్ వద్ద ఉన్న వారు షాక్ అయ్యారు. అప్రమత్తమైన పోలీసులు, లాయర్లు ఆ గ్యాంగ్‌కు చెందిన ఒక వ్యక్తిని పట్టుకున్నారు. మిగతా గ్యాంగ్ సభ్యులు కారులో పారిపోతుండగా పోలీసులు వెంబడించి అడ్డుకున్నారు. మరో నలుగురిని అరెస్ట్ చేశారు. మరోవైపు 2023 ఆగస్ట్‌లో ఎస్సీ పంచాయతీ వార్డు సభ్యురాలు ఎన్ రాజమణి హత్యకేసులో మాయండి ఒక నిందితుడని పోలీస్ అధికారి తెలిపారు. దీంతో ఆమె హత్యకు ప్రతీకారంగా ఆ గ్యాంగ్ అతడ్ని హత్య చేసిందని చెప్పారు.

## దుస్తులు కొనలేకపోయానని ఒకరు..

### ఆ వార్త తట్టుకోలేక మరొకరు.. నిమిషాల తేడాతో ప్రాణ స్నేహితురాళ్ల ఆత్మహత్య



**న్యూఢిల్లీ-నవభూమి:** ఆ ఇద్దరు యువతులు ప్రాణ స్నేహితులు. ఒకరిని విడిచి ఒకరు ఉండలేరు. నిత్యం ఒకరినొకరు కలుసుకుంటారు. ఒకరి పేరును మరొకరు చేతులపై పచ్చబొట్లుగా కూడా పొడిపించుకున్నారు. కలిసి స్నేహం చేసిన వాళ్లిద్దరూ చివరికి కలిసే ప్రాణాలు కోల్పోయారు. కొన్ని నిమిషాల వ్యవధిలో ఇద్దరూ ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఉత్తరప్రదేశ్‌లోని బాందా జిల్లాలో శుక్రవారం ఈ విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. బాందా జిల్లా దెహత్ కొత్వాలి ఏరియాలోని జారీ గ్రామానికి చెందిన పుష్పాదేవి ప్రజాపతి (18), గాయత్రి (19) అనే ఇద్దరు యువతులు ప్రాణ స్నేహితులు. శుక్రవారం ఈ ఇద్దరూ ఎవరి ఇళ్లలో వాళ్లు ఆత్మహత్యలు చేసుకున్నారు. చలికాలంలో వెచ్చటి దుస్తులు కొనుగోలు చేయలేకపోయాననే బాధతో గాయత్రి తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని గాయత్రి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలిస్తుండగానే.. ఆమె స్నేహితురాలు పుష్పాదేవి ప్రజాపతి కూడా తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం అందింది. నిమిషా వ్యవధిలో ప్రాణస్నేహితురాల్లిద్దరూ ఆత్మహత్యకు పాల్పడటంతో ఆ గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మహిళతో కలిసి హెూటల్‌లో బస చేసిన నేత.. అనుమానాస్పదంగా మృతి




**కోల్‌కతా-నవభూమి:** అధికార పార్టీకి చెందిన నేత ఒక మహిళతో కలిసి హెూటల్‌లో బస చేశాడు. అయితే సీలింగ్‌కు వేలాడుతున్న ఆయన మృతదేహాన్ని హెూటల్ సిబ్బంది గమనించారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అక్కడి నుంచి మాయమైన మహిళను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని తూర్పు మిడ్నాపూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆ రాష్ట్రంలో అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కు చెందిన 34 ఏళ్ల అబుల్ నాసర్, ఉత్తర 24 పరగణాల జిల్లాలోని అమ్‌దంగా ప్రాంతంలో ప్రభావవంత నేతగా గుర్తింపు పొందాడు. ఆయన ఒక మహిళతో కలిసి మందర్మణి సముద్ర రిసార్ట్‌లోని ఓ హెూటల్‌లో బస చేశాడు.
కాగా, శనివారం ఉదయం హెూటల్ రూమ్‌లో సీలింగ్‌కు వేలాడుతున్న అబుల్ నాసర్ మృతదేహాన్ని సిబ్బంది గమనించారు. ఆయనతో పాటు హెూటల్‌లో బస చేసిన మహిళ కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఆ హెూటల్‌కు చేరుకున్నారు. నాసర్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరోవైపు హెూటల్ నుంచి పారిపోయిన ఆ మహిళను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నాసర్ మృతిపై ప్రశ్నించేందుకు పోలీస్ స్టేషన్‌కు ఆమెను తరలించారు. ఆయనది ఆత్మహత్యా లేక హత్యా అన్నది పోస్ట్‌మార్టం తర్వాత తెలుస్తుందని పోలీస్ అధికారి వెల్లడించారు. అయితే తన భర్తను హత్య చేసినట్లు తృణమూల్ డిప్యూటీ పంచాయితీ చీఫ్ అయిన నాసర్ భార్య ఆరోపించింది.

## కారుపై పడిన కంటెయినర్ ట్రక్కు.. ఆరుగురు దుర్మరణం




**న్యూఢిల్లీ-నవభూమి:** కంటెయినర్ ట్రక్కు కారుపై జారిపడి ఆరుగురు దుర్మరణం పాలయ్యారు. కర్ణాటక రాష్ట్రంలోని నీలమంగళ పట్టణ సమీపంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. మరణించిన ఆరుగురిలో ఇద్దరు చిన్నారులున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నీలమంగళ పట్టణానికి చెందిన ఓ కుటుంబం గత అక్టోబర్‌లో కొత్త కారును కొనుగోలు చేసింది. శనివారం ఉదయం కారులో జాలీగా తిరిగొద్దామని కుటుంబంలోని నలుగురు బయలుదేరారు. వారి కారు జాతీయ రహదారి నాలుగుపై వెళ్తుండగా.. బెంగళూరు నుంచి తుమకూరు వెళ్తున్న కంటెయినర్ ట్రక్కు వారికి సమాంతరంగా వచ్చింది. అదే సమయంలో కంటెయినర్ ట్రక్కు ముందు వెళ్తున్న కర్ణాటక మిల్క్ ఫెడరేషన్‌కు చెందిన పాల ట్రక్కును ఢీకొట్టింది. ఆ వెంటనే అదుపుతప్పి పక్కనే వెళ్తున్న కారు, బైకుపైకి ఒరిగిపోయింది. ఈ ప్రమాదంలో కారులోని నలుగురు, బైకుపై వెళ్తున్న ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారని, ప్రస్తుతం మృతదేహాలు నీలమంగళ ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్నాయని బెంగళూరు రూరల్ ఎస్పీ సీకే బాబా తెలిపారు. నడిరోడ్డుపై ఘోర ప్రమాదం జరగడంతో జాతీయ రహదారిపై మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయిందని ఆయన చెప్పారు. పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేసిన పనిలో ఉన్నారని అన్నారు.

## కదులుతున్న రైలు ఎక్కుతూ పట్టాల వద్ద పడిన వ్యక్తి.. తర్వాత ఏం జరిగిందంటే?

**పాట్నా-నవభూమి:** కదులుతున్న రైలు ఎక్కేందుకు ఒక వ్యక్తి ప్రయత్నించాడు. అయితే పట్టుతప్పిన అతడు ప్లాట్‌ఫారమ్ నుంచి జారి రైలు పట్టాల వద్ద పడ్డాడు. దీంతో రైల్వే స్టేషన్‌లోని ప్రయాణికులు ఆందోళన చెందారు. అయితే రైలు దాటిన తర్వాత ప్లాట్‌ఫారమ్ గోడ, రైలు పట్టాల మధ్య ఉన్న ఆ వ్యక్తి ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. బీహార్‌లోని సమస్తిపూర్‌లో ఈ సంఘటన జరిగింది. సమస్తిపూర్ రైల్వేస్టేషన్ నుంచి కదులుతున్న సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ ఎక్కేందుకు ఒక వ్యక్తి ప్రయత్నించాడు. అయితే తోపులాటకు పట్టుతప్పిన అతడు జారి ట్రాక్‌పై పడిపోయాడు. కాగా, రైలు కదులుతుండటంతో ఇది చూసిన మిగతా ప్రయాణికులు ఆందోళన చెందారు. వారి అరుపులు, కేకలతో అక్కడ గందరగోళ పరిస్థితి నెలకొన్నది. ఈ నేపథ్యంలో రైలు పట్టాల వద్ద పడిన ఆ వ్యక్తిని దాటి స్టేషన్ చివర వరకు వెళ్లిన ఆ రైలు ఆగింది.

# ప్రభుత్వ పథకాల్లో మీ వాటా- మీ కోటా:సీఎం రేవంత్



**హైదరాబాద్-నవభూమి:** క్రైస్తవ సమాజానికి తెలంగాణ ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. కాంగ్రెస్ కమిటీలోలనూ ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు. లాల్ బహదూర్ స్టేడియంలో శనివారం రాత్రి జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిధిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ముందుగా చిన్నారులకు క్రిస్మస్ కానుకలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సమాజంలోని దళిత క్రిస్టియన్ల అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామన్నారు. ఇందిరమ్మ ఇళ్లతో సహ ప్రతి ప్రభుత్వ పథకంలో మీ వాటా-మీ కోటా ఉంటుందని హామీ ఇచ్చారు. పార్టీలో చురుకైన క్రిస్టియన్ కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాలని సభకు హజరైన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కు సూచించారు. విద్యా,వైద్య రంగాల్లో క్రిస్టియన్ సంస్థలు చేస్తున్న సేవలను గుర్తు చేశారు. సంక్రాంతి తర్వాత ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు ప్రక్రియ మొదలవుతుందని, ఇందులో నిరుపేద దళితులు, దళిత క్రిస్టియన్లకు లబ్ధి కలుగుతుందని చెప్పారు. సర్వమతాలు సమానంగా ఉండాలని తాను కోరుకుంటానని, ఏ మతాన్ని ఆచరించినా, విశ్వసించినా పూర్తి రక్షణ కల్పిస్తామని ప్రకటించారు. మతాల మధ్య చిచ్చు రేపితే సహించేది లేదని హెచ్చరించారు. తెలంగాణలోని చారిత్రాత్మక చర్చిల అభివృద్ధి పునర్నిర్మాణానికి తగినంత నిధులు కేటాయిస్తామని అన్నారు. డిసెంబర్ నెల 'మిరాకిల్ మంత్' అని, ఏసు ప్రభువు జన్మించిన మాసం, సోనియా గాంధీ పుట్టిన నెల, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించిన నెల అని వివరించారు.

## ఇంట్రస్టింగ్... ఇవాళ పగలు 8, రాత్రి 16 గంటలు ఉంటుందా?



**న్యూఢిల్లీ-నవభూమి:** ఒక రోజు అంటే సుమారుగా సగం పగలు, సగం రాత్రి ఉంటుంది! అంటే... 24 గంటల్లోనూ 12 గంటలు పగలు, మిగిలిన 12 గంటలు రాత్రి ఉంటుంది సుమారుగా! అయితే.. ఇవాళ (డిసెంబర్ 21) మాత్రం లెక్క మారుతుందని అంటున్నారు. ఇందులో భాగంగా ఈరోజు పగలు కేవలం 8 గంటలే ఉంటుందంటూ గత కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతుంది. సుమారు 12 గంటలు పగలు, 12 గంటలు రాత్రి ఉండాల్సి రోజులో 8 గంటలు మాత్రమే పగలు, 16 గంటలు రాత్రి సమయం ఉండే అవకాశం ఈ రోజు ఉందనే ప్రచారం జరుగుతుంది. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో కథనాలు హల్ చల్ చేస్తున్నయి. ఇదే సమయంలో "లాంగెస్ట్ నైట్" అంటూ సోషల్ మీడియాలోనూ పోస్టులు సందడి చేస్తున్నాయి. సాధారణంగా ప్రతీ ఏటా డిసెంబర్ 19 నుంచి 23 మధ్య ఏదో ఒక రోజు ఇలా జరుగుతుందని.. ఈ రోజు సూర్యుని నుంచి భూమికి దురం ఎక్కువగా ఉంటుందని.. దీన్ని వింటర్ సోల్ స్టీస్ అంటారని చెబుతున్నారు. ఇదే సమయంలో.. భూమిపై చంద్రకాంతి ఎక్కువ సమయం ఉంటుందని.. అందుకే పగలు, రాత్రి గంటల్లో వ్యత్యాసం అని చెబుతున్నారు! అదేవిధంగా... ఈ రోజు భూమి దాని ధృవం వద్ద 23.5 డిగ్రీల వంపులో ఉంటుందని.. ఫలితంగా ఉష్ణోగ్రతల్లో మార్పులు సంభవిస్తాయని.. దీంతో దేశవ్యాప్తంగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంటుందని.. ఈ సహజ మారే సుదీర్ఘమైన రాత్రి, తక్కువ పగలుకు కారణం అని చెబుతున్నారని అంటున్నారు. మరి జరుగుతున్న ప్రచారాన్ని నిజం చేస్తూ నేడు (డిసెంబర్ 21 - శనివారం) మధ్యాహ్నం 2 గంటలకే సూర్యాస్తమయం అవుతుందా..? లేదా..? అనేది వేచి చూడాలి. కాగా... ఈ రోజు ఉదయం కాస్త అటు ఇటుగా ఉదయం 6:41 గంటలకు సూర్యోదయం అయ్యింది! ఈ వింటర్ 'స్టోల్ స్టీస్' అనేది లాటి పదం 'సోల్ స్టిటియం' నుంచి వచ్చింది! ఇందులో 'సోల్' అంటే సూర్యుడు, 'స్టిటియం' అంటే ఆగిపోవడం. ప్రపంచ వ్యాప్తంగా వేడుకలు!: వాస్తవానికి ఈ శీతాకాలంలో ప్రపంచ వ్యాప్తంగా క్రిస్మస్ అనేది అత్యంత పెద్ద పండుగగా జరుపుకుంటారనేది తెలిసిన విషయమే. ఇదే సమయంలో... ఈ స్టోల్ స్టీస్ సమయంలో పలు దేశాల్లో పండుగను జరుపుకుంటారు! ఇందులో భాగంగా.. డోంగ్జి అనే పండుగను చైనీయులు ఈ సమయంలో జరుపుకుంటారు. వింటర్ స్టోల్ స్టీస్ ని వెలుగు, చీకటి మధ్య సమతుల్యంగా జరుపుకుంటారు. ఇదే సమయంలో... కొన్ని అమెరికన్ తెగ మధ్య ఈ వింటర్ స్టోల్ స్టీస్ ను సూర్యుడిని తిరిగి తీసుకురావడం అనే ఆచారంగా జరుపుకుంటారని అంటున్నారు. బోయిన్ వ్యాలీలోని న్యూగ్రాంజ్ వద్ద "బోయ్న్ వ్యాలీ గాదరింగ్" అనే వేడుకను ఈ వింటర్ స్టోల్ స్టీస్ సమయంలో చేసుకుంటారు.

## మూడేళ్లలో 1445 చ. కిమీ పెరిగిన అటవీ విస్తీర్ణం



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలో అటవీ విస్తీర్ణం గడిచిన మూడేళ్లలో సుమారు 1445 చదరపు కిలోమీటర్లు పెరిగినట్లు తాజా రిపోర్టు పేర్కొన్నది. దీంతో దేశంలో మొత్తం గ్రీనరీ ఏరియా 25.17 శాతానికి చేరుకున్నట్లు ప్రభుత్వ డేటా తెలిపింది. ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్ట్(ఐఎస్ఎఫ్ఆర్) ను శనివారం రిలీజ్ చేశారు. కార్బన్ వ్యర్థాలను 2.29 బిలియన్ టన్నులు తగ్గించినట్లు ఐఎస్ఎఫ్ఆర్ రిపోర్టులో పేర్కొన్నారు. అదనంగా మరో మూడు బిలియన్ల టన్నుల కార్బన్‌ను 2030 నాటికి తగ్గించేందుకు ప్లాన్ చేసినట్లు ఆ రిపోర్టులో వెల్లడించారు. 2021లో 7,13,789 చదరపు కిలోమీటర్లు ఉన్న అటవీ విస్తీర్ణం .. 2023లో 7,15,343 చదరపు కిలోమీటర్లు పెరిగిందని నివేదికలో తెలిపారు. చెట్ల విస్తీర్ణం 1289 కిలోమీటర్ల పెరిగినట్లు నివేదికలో చెప్పారు.

## మద్యం పాలసీ కేసులో కీలక పరిణామం.. కేజ్రీవాల్‌ను విచారించేందుకు ఈడీకి ఎల్జీ అనుమతి..!



**న్యూఢిల్లీ-నవభూమి:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. ఢిల్లీ మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ )కు భారీ షాక్ తగిలింది. మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసు లో కేజ్రీని విచారించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ )కు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అనుమతి ఇచ్చినట్లు సమాచారం. ఈ కేసులో డిసెంబర్ 5న మాజీ సీఎంను విచారించేందుకు ఈడీ అనుమతి కోరగా.. అందుకు ఎల్జీ తాజాగా పర్మిషన్ ఇచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ మేరకు ఎల్జీ కార్యాలయం శనివారం ప్రకటన విడుదల చేసినట్లు సదరు వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో మార్చి 21న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఆయనను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం మే 10 నుంచి జూన్ 1 వరకు ఆయనకు తాత్కాలిక బెయిల్ మంజూరైంది. జూన్ 2న ఆయన మళ్లీ జైలులో లొంగిపోగా, జూన్ 20న ట్రయల్ కోర్టులో బెయిల్ దక్కింది. బెయిల్‌ను ఈడీ సవాల్ చేయడంతో జూన్ 25న హైకోర్టు బెయిల్ ఉత్తర్వులపై స్టే ఇచ్చింది. జూన్ 26న ఇదే కేసులో కేజ్రీవాల్‌ను సీబీఐ అరెస్టు చేసింది. జూలై 12న ఈడీ కేసులో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసినప్పటికీ సీబీఐ అప్పటికే అరెస్టు చేయడం వల్ల ఆయన జైలులోనే ఉండాల్సి వచ్చింది. ఇక సెప్టెంబర్ 13న సీబీఐ కేసులోనూ కేజ్రీకి సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ దక్కడంతో ఆరునెలల పాటు జైలుజీవితం గడిపిన ఆయన చివరికి సెప్టెంబర్ 14వ తేదీన తీహార్ జైలు నుంచి విడుదలయ్యారు. ఈ కేసులోనే ఈడీ మరోసారి కేజ్రీవాల్‌ను విచారించేందుకు సిద్ధమవుతోంది.


## అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఢిల్లీలో ఆప్‌కు షాక్..!



**న్యూఢిల్లీ-నవభూమి:** అసెంబ్లీ ఎన్నికలముందు దేశ రాజధాని ఢిల్లీ లో అధికార ఆమ్ ఆద్మీ పార్టీకి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన ఇద్దరు కీలక నేతలు బల్బీర్ సింగ్ సుఖ్‌బీర్ దలాల్ రాజీనామా చేసి బీజేపీ లో చేరారు. ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ , పార్టీ జనరల్ సెక్రెటరీ ఆశీశ్ సూద్ కేంద్ర మంత్రి హర్ష మల్హోత్ర సమక్షంలో ఆ ఇద్దరు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. బల్బీర్ సింగ్ ఏకంగా ఆరు పర్యాయాలు ఢిల్లీ సిక్ గురుద్వారా మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. బీజేపీ ప్రభుత్వం తన సూచనను పరిగణలోకి తీసుకోవడం లేదని, ఢిల్లీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే స్కూళ్లలో పంజాబీ టీచర్‌లను నియమించడం లేదని ఆయన ఆరోపించారు. ఢిల్లీ సర్కారు ఏ పనీ సరిగా చేయడం లేదని సుఖ్‌బీర్ దలాల్ విమర్శించారు. కాగా, ఢిల్లీలో వచ్చే ఫిబ్రవరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీ ఇప్పటికే అన్ని స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. బీజేపీ కూడా త్వరలో తమ జాబితాను వెల్లడించే అవకాశం ఉంది. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్ న్యూఢిల్లీ నుంచి, ముఖ్యమంత్రి అతిషి కల్కాజీ నుంచి, మంత్రులు సౌరభ్ భరద్వాజ్ గ్రేటర్ కైలాస్ నుంచి, గోపాల్ రాయ్ బాబర్‌పూర్ నుంచి బరిలో దిగనున్నారు.

### ఉజ్జయిని మహాకాళేశ్వర ఆలయంలో విషాదం..

## దుపట్టా మెడకు బిగుసుకుని మహిళ మృతి



**న్యూఢిల్లీ-నవభూమి:** మధ్యప్రదేశ్ రాష్ట్రంలో గల ఉజ్జయిని మహాకాళేశ్వర దేవాలయంలో విషాదం చోటు చేసుకుంది. ఆలయంలోని ఫుడ్ సెంటర్ లో గల యంత్రంలో దుపట్టా చిక్కుకుని మహిళ మృతి చెందింది. శనివారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.
రజనీ ఖత్రీ అనే 30 ఏళ్ల మహిళ శనివారం ఉదయం ఆలయంలోని అన్న క్షేత్రంలోగల వంటగదిలో పనిచేస్తోంది. ఆ సమయంలో ఆమె మెడకు ఉన్న దుపట్టా బంగాళాదుంపలు కట్ చేసే యంత్రంలో చిక్కుకుపోయింది. అనంతరం దుపట్టా ఆమె మెడకు బిగుసుకుపోవడంతో ఊపిరాడక ప్రాణాలు కోల్పోయింది. గమనించిన సిబ్బంది రజనీ ఖత్రీని ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆమె చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. నివేదిక తర్వాత ఆమె మృతికి గల కచ్చితమైన కారణాలు వెల్లడవుతాయని అధికారులు పేర్కొన్నారు.

## అరబిక్ భాషలో రామాయణం, మహాభారతం.. కువైట్‌లో బుక్స్ రిలీజ్



**న్యూఢిల్లీ-నవభూమి:** భారతీయ ఇతిహాస గ్రంధాలు రామాయణం , మహాభారతం పుస్తకాలను అరబిష్ భాషలో తర్జుమా చేశారు. ఆ ట్రాన్స్‌లేట్ చేసిన పుస్తకాలను కువైట్‌లో ఇవాళ ప్రచురణకర్తలు ప్రదర్శించారు. ప్రధాని మోదీ కువైట్‌లో పర్యటిస్తున్న నేపథ్యంలో.. ఆ రెండు బుక్స్‌ను పబ్లిషర్స్ మీడియాకు ప్రజెంట్ చేశారు. రామాయణం, మహాభారత గ్రంథాలను అరబిక్ భాషలో రాసేందుకు రెండు ఏళ్లు పట్టినట్లు బుక్ పబ్లిషర్స్ పేర్కొన్నారు. రెండు పుస్తకాల నుంచి భారతీయ సంస్కృతిని అర్థం చేసుకున్నట్లు ట్రాన్స్‌లేటర్ తెలిపారు.

## పసుపు గుమ్మం దగ్గర...త్యాగమూర్తులు ముగ్గురూ !



**న్యూఢిల్లీ-నవభూమి:** తెలుగుదేశం పార్టీ కోసం అన్నీ వదులుకుని త్యాగం చేసిన ముగ్గురు కీలక నేతల పరిస్థితి అయితే ఇపుడు ఎటూ కాకుండా ఉంది అని వారితో పాటు అనుచరులూ మధనపడు తున్నారు. విజయనగరం జిల్లలో ముగ్గురు కీలక నేతలు త్యాగాలు చేసి పార్టీని గెలిపించారు. కానీ గెలిచి ఆరు నెలలు అయినా పార్టీలో తమకు అయితే ఏ రకమైన అవకాశం దక్కలేదని కనీసం తమను పట్టించుకునే వారే లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ముగ్గురిలో ఇద్దరు ఎన్నారైలుగా ఉన్నారు. అమెరికాలో బ్రహ్మాండమైన ఉద్యోగాలు వ్యాపారాలు వ్యవహారాలూ అన్నీ వదులుకుని వచ్చి వాలినందుకు గట్టిగా పనిచేసినందుకు పార్టీ పెద్దల నుంచ్ మహ బాగా మర్యాద లభిస్తోందని వాపోతున్నారు. వారిలో ఒకరు చీపురుపల్లికి చెందిన మాజీ మంత్రి కిమిడి మృణాళిని కుమారుడు యువ నేత కిమిడి నాగార్జున. ఆయనకు ఈసారి పార్టీ టికెట్ ఇవ్వలేదు. ఆయన అయిదేళ్ల పాటు చీపురుపల్లిలో నిలిచి పోరాటం చేశారు. కానీ ఆయన పెదనాన్న మాజీ మంత్రి అయిన కిమిడి కళా వెంకటరావుకు అవకాశం ఇచ్చారు. దాంతో పెదనాన్నని గెలిపించారు. తనకు ఏదైనా నామినేటెడ్ పదవి అయినా దక్కుతుందని ఎదురుచూసిన ఆయనకు ఏమీ దక్కడం లేదు అని అంటున్నారు. మరో నేత ఎన్నారై అయిన గొంప క్రిష్ణ. ఎస్ కోట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టికెట్‌ని ఆశించిన ఈ నాయకుడు చివరికి పార్టీ కోసం తగ్గి పనిచేశారు అని అంటున్నారు. ఈయనకు టీడీపీ అధినాయకత్వం స్థాయిలోనే భారీ హామీ లభించడంతో అన్నీ మానుకుని పార్టీ కోసం కష్టపడ్డారు. అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్సీ పదవి మీకే అని కూడా ఒట్టేసి మరీ చెప్పారట. ఇపుడు చూస్తే మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన చెందుతున్నారు. ఆయనతో పాటు అనుచరులు కూడా నిరాశలో ఉన్నారని అంటున్నారు. ఇక వీరికి తోడు అన్నట్లుగా ఒక అధికారి స్థాయి నేత తన ఉద్యోగానికి రాజీనామా చేసి మరీ టీడీపీలో చేరి శక్తి పెట్టి మరీ పనిచేశారు. ఆయనే కోట్ల సుగుణాకర్. ఆయనకు కూడా పార్టీలో ఏదైనా సముచిత స్థానం లభిస్తుంది అనుకుంటే ఎవరూ ఉలకరూ పలకరూ అని బాధ పడుతున్నారుట. ఇంకా రెండేళ్ళ సర్వీసు ఉంది, బంగారం లాంటి ప్రభుత్వ ఉద్యోగం ఉన్నత స్థాయిలో హెూదా అన్నీ వదిలేసి వచ్చామని అలా ఏదైనా పొరపాటు చేశామా అని ఆయన కూడా కలత చెందుతున్నారుట. ఈ ముగ్గురూ త్యాగమూర్తుగా టీడీపీలో కనిపిస్తున్నారుట. ఇక విజయనగరం జిల్లాకు కొన్ని నామినేటెడ్ పదవులు అయితే దక్కాయి. కానీ ఇంకా చాలా మంది ఆశావహులు ఉన్నారు. ఎందుకో అధినాయకత్వం వీరి వైపు చూడడం లేదు అని అంటున్నారు. అయితే పార్టీలో ఓపిక వహించి చూస్తే ఎప్పటికి అయినా చాన్స్ దక్కుతుందని అంటున్న వారూ ఉన్నారు. అయితే పక్కవారికి విస్తరిలో వడ్డించి ఇవతల వారిని వేచి చూడమని అంటే తట్టుకోవడం బహు కష్టమే అని అంటున్నారు.

## 8 సార్లు పల్టీలు కొట్టిన కారు.. తర్వాత ఏం జరిగిందంటే?

**జైపూర్-నవభూమి:** హైవేపై వేగంగా వెళ్లిన కారు అదుపుతప్పింది. రోడ్డుపై 8 సార్లు పల్టీలు కొట్టింది. అయితే అదృష్టవశాత్తు ఆ కారులో ప్రయాణించిన ఐదుగురు వ్యక్తులకు చిన్నగాయమైనా కాలేదు. పైగా అక్కడున్న వారిని టీ అడిగారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం కొందరు వ్యక్తులు నాగౌర్ నుంచి బికనీర్ వెళ్లేందుకు ఎస్‌యూవీలో ప్రయాణించారు. అయితే హైవేపై వేగంగా వెళ్తున్న ఆ కారు ఒక మలుపు వద్ద అదుపుతప్పింది. డ్రైవర్ స్టీరింగ్‌పై కంట్రోల్ తప్పడంతో ఆ కారు రోడ్డుపై ఎనిమిది సార్లు పల్టీలు కొట్టింది. రహదారి పక్కన ఉన్న కారు షోరూమ్ గేట్‌ను బలంగా ఢీకొట్టి ఆగింది. కాగా, కారు పల్టీలు కొడుతుండగా డ్రైవర్ కిందకు దూకేశాడు. కారులోని మిగతా నలుగురు వ్యక్తులు ప్రమాదం తర్వాత కిందకు దిగారు. అయితే అదృష్టవశాత్తు ఎవరికీ కూడా చిన్న గాయమైనా కాలేదు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 హైదరాబాద్
ఆదివారం
22 । డిసెంబర్ । 2024




## మాదాపూర్ ఐటీ కంపెనీలో భారీ అగ్నిప్రమాదం!



**హైదరాబాద్-నవభూమి:** అనూహ్య రీతిలో చోటు చేసుకున్న అగ్నిప్రమాదం హైదరాబాద్ మహానగరంలోని ఐటీ కారిడార్ లో చోటు చేసుకుంది. శనివారం తెల్లవారుజామున ఒక ఐటీ కంపెనీలో ఎగిసిపడిన మంటలు చుట్టుపక్కల వారిని షాక్ కు గురి చేశాయి. ఐటీ కారిడార్ కు గుండెకాయ లాంటి మాదాపూర్ ఇనార్బిట్ మాల్ ఎదురుగా ఉన్న సత్వా మల్టీస్టోరెడ్ బిల్డింగ్ లో మంటలు చెలరేగాయి. ఈ భారీ భవనంలో పలు ఐటీ కంపెనీలు ఉన్నాయి. ప్రత్యక్ష సాక్ష్యులు ఇస్తున్న ప్రాథమిక సమాచారం ప్రకారం సత్వా భవనంలో ఒక్కసారి మంటలు రేగటంతో భయాందోళనలకు గురైన ఉద్యోగులు పలువురు బయటకు పరుగులు తీసినట్లుగా చెబుతున్నారు. అయితే.. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని చెబుతున్నారు. అయితే.. భారీ ఆస్తినష్టం వాటిల్లినట్లుగా తెలుస్తోంది. అగ్నిప్రమాదానికి సంబంధించిన సమాచారాన్ని అందుకున్నంతనే అగ్నిమాపక శాఖ ఘటనాస్థలానికి చేరుకొని.. మంటల్ని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. దాదాపు గంటన్నరకు మంటలు అదుపులోకి వచ్చినట్లుగా చెబుతున్నారు. అగ్నిప్రమాద ఘటన నేపథ్యంలో మున్సిపల్ తదితర శాఖలు సహాయక చర్యలు చేపట్టారు. ఈ అగ్నిప్రమాదానికి కారణం తెలియాల్సి ఉంది. భారీగా మంటలుచెలరేగటంతో దట్టమైన పొగ ఆ ప్రాంతాన్ని కమ్మేసింది. ఐటీ కారిడార్ లో కీలకమైన ప్రాంతంలో చోటు చేసుకున్న ఈ అగ్నిప్రమాదం కారణంగా పలు ఐటీ సంస్థలకు ఆపరేషన్ ఇబ్బందులు తలెత్తే వీలుందని చెబుతున్నారు.

## చమురు విపణిపై పోరులో సిరియా బలి


ప్రచ్ఛన్న యుద్ధ కాలం నుంచి నేటి ఉక్రెయిన్ వివాదం వరకు రష్యాకు విశ్వసనీయ మిత్రుల జాబితాలో అగ్ర స్థానంలో ఉన్న దేశం సిరియా. వామపక్ష భావజాలం కంటే సిరియా భౌగోళిక స్థానమే వాణిజ్య అవసరాలరీత్యా ఆ అరబ్ దేశానికి రష్యాను అత్యంత సన్నిహితం చేసింది. ప్రపంచవ్యాప్తంగా రష్యా ప్రభావం అంతరించిపోయిందని భావించిన క్రమంలో దశాబ్దం క్రితం సిరియాలో అమెరికా అనుకూల తిరుగుబాటుదారుల కారణాన బషార్ అల్ అస్సాద్ సర్కారు పతనపు అంచుకు చేరింది. రష్యా ఆ కీలక సమయంలో బషార్ ప్రభుత్వానికి సైనికంగా చేయూతనిచ్చి నిలబెట్టింది. తద్వారా తాము ఇంకా అమెరికాకు అడ్డుకట్ట వేయగలుగుతామని ప్రపంచానికి రష్యా సంకేతాలు పంపించింది.
అత్యధికులు అభిప్రాయపడుతున్నట్లుగా సిరియాలో ప్రస్తుత పరిణామాలు షియా%-% సున్నీ తెగల మధ్య అధికార పోరాట పర్యవసానాలు ఎంత మాత్రం కాదు. అవి, మూమ్మాటికీ గ్యాస్ విపణిపై పట్టు కోసం జరుగుతున్న పోరాటం విపరిణామాలే. చమురు, సహజ వాయువు నిల్వలు అపారంగా ఉన్న అరబ్బు నేల నుండి ఐరోపాకు వెళ్లే మార్గంలో భౌగోళికంగా అనువైన ప్రదేశంలో మధ్యధరా సముద్రం తీరంలో సిరియా ఉండడంతో అక్కడ అస్మదీయ పాలకులు అవసరం.
టర్కీ, ఐరోపా ఖండం తమ చమురు, గ్యాస్ అవసరాల కొరకు రష్యాపై ఆధారపడుతున్నాయి. వాటి ఈ అనివార్యతను రష్యా తన వజ్రాయుధంగా వాడుకొంటోంది. అమెరికా, ఐరోపా దేశాలు రష్యా అధిపత్యాన్ని నిర్మూలించి దాని ఆర్థిక మూలాలను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో బెలరూస్, ఉక్రెయిన్ ఉద్రిక్తతలు తెరపైకి వచ్చాయి. రష్యా తరహా భారీ నిక్షేపాలు ఉన్న ఇరాన్, ఖతర్ దేశాలు కూడ గ్యాస్ విపణిపై పట్టుకొరకు ప్రయత్నిస్తున్నాయి. అమెరికా ఆంక్షల కారణాన ఇరాన్ వెనుకంజలో ఉండగా ఖతర్ మాత్రం ముందుకు దూసుకెళ్లుతోంది. ఖతర్ నుండి పైపు లైను ద్వార ఐరోపాకు చమురు, గ్యాస్ సరఫరాలకు సిరియా సహకారం అనివార్యం. అమెరికా, ఐరోపా, టర్కీలు ఖతర్‌కు ఈ విషయమై బాసటగా నిలుస్తున్నా సిరియా అందుకు అంగీకరించడం లేదు. తమకు అన్ని విధాలుగా అండగా ఉంటున్న రష్యా, ఇరాన్‌లను కాదని ఖతర్ ప్రతిపాదనకు సిరియా ఆంగీకరించలేదు, అధ్యక్షుడు బషార్ అల్ అస్సాద్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటుకు ఇది ఒక ప్రధాన కారణమని విశ్లేషకుల అభిప్రాయం.సిరియాలోని మధ్యధరా సముద్రతీర ప్రాంతాలలో నౌకా, వైమానిక దళాల స్థావరాలను నెలకొల్పుకోవడం ద్వారా ఐరోపాకు అవసరమైన చమురు సరఫరా జరుగుతుండే సముద్ర మార్గాలపై తన పట్టును పటిష్ఠపరచుకోవడానికి రష్యా ప్రయత్నిస్తోంది. అలాగే కీలక జలాల్లో నాటో, అమెరికాలను నిలువరించడం, తమపై తిరగబడ్డ ఉక్రెయిన్, బెలరూస్ దేశాల భూభాగాల ద్వారా కాకుండా ప్రత్యామ్నాయంగా తన గ్యాస్, చమురు సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడానికి రష్యా సంకల్పించింది. ఇందుకు మిత్ర దేశమైన సిరియా సముద్ర తీరం రష్యాకు కలిసి వచ్చింది. చమురు ఉత్పాదక దేశమైన రష్యా మధ్యధరా తీరంలోని లిబియాతో సహా అవతలి వైపు ఉన్న చమురు ఉత్పాదక అరబ్బు దేశాలలో కూడ తన పలుకుబడిని పెంచుకున్నది. సిరియాలో బషార్ అల్ అస్సాద్ ప్రభుత్వాన్ని పరిరక్షించడం ద్వారా రష్యా తన సైనిక, ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకున్నది. కీలక ప్రపంచ వ్యవహారాలలో తన పాత్ర, అభీష్టం కూడా ఉంటుందని దౌత్యపరంగా సూచనలు పంపింది.బషార్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దశాబ్దానికి పైగా పోరాడుతున్న తిరుగుబాటుదారులకు అమెరికా, టర్కీ, కొన్ని గల్ఫ్ దేశాలు బాసటగా ఉన్నాయి. అయినా తిరుగుబాటుదారులను రష్యా వైమానిక దళాల సహాయంతో నిర్దాక్షిణ్యంగా అణిచివేయడం ద్వారా తన అధికారాన్ని బషార్ కాపాడుకోగలిగారు. ఇరాన్, దాని అనుకూల సాయుధ షియా బృందాలు కూడా బషార్‌కు పూర్తిగా మద్దతుగా నిలిచాయి. బయటి నుండి ఎంత మద్దతు పొందినా స్థానికంగా తిరుగుబాటుదారులతో సంధికి కాదు కదా కనీసం చర్చలు జరిపేందుకు సైతం సిరియా ప్రభుత్వం ముందుకు రాలేదు. తిరుగుబాటును బషార్ ప్రభుత్వం పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చిందని అత్యధికులు భావించారు, బషార్‌ను గద్దె దించడం వీలుకాదని చాలా మంది విశ్వసించారు. అయితే అనూహ్యంగా గత పక్షం రోజులలో ఎలాంటి ప్రతిఘటన లేకుండా సిరియా సైనిక దళాలు స్వచ్ఛందంగా తిరుగుబాటుదారులకు లొంగిపోవడంతో బషార్ ప్రభుత్వం పతనమయింది. ఇది చాలా ఆశ్చర్యకరమైన పరిణామం.సరే, బషార్ దేశం నుంచి పరారయ్యారు. ఇప్పుడు సిరియాను ఎవరు ఏ విధంగా పాలించనున్నారు? ఇదే అందరినీ వేధిస్తున్న ప్రశ్న. సద్దాం హుస్సేన్ తర్వాత ఒకప్పటి అరబ్బు అగ్రరాజ్యం, విభిన్న సంస్కృతుల సమ్మేళనమైన ఇరాఖ్ విచ్ఛిన్నమై ఉగ్రవాదానికి ఊతమైంది. పొరుగున ఉన్న ఇరాఖ్‌లో వలే సిరియాలో కూడ క్రైస్తవులు, షియా, సున్నీ తెగల ముస్లింలు కలిసి మెలిసి నివసిస్తున్నారు. ఈ రెండు దేశాలలోనూ సిరియా క్రైస్తవుడయిన మైఖెల్ అఫ్లాఖ్ స్థాపించిన (వామపక్ష భావజాల ప్రభావిత) బాత్ పార్టీ సైనిక కమాండర్లు సద్దాం హుస్సేన్, బషార్ అల్ అస్సాద్ తండ్రి హాఫెజ్ అల్ అస్సాద్‌లు ఇరాఖ్, సిరియా దేశాధినేతలుగా సుదీర్ఘకాలం పాలించారు. వర్గ ప్రయోజనాల కంటే జాతీయ ప్రయోజనాలలకు బాత్ పార్టీ భావజాలం ప్రాధాన్యమిస్తుంది.
అరబ్బులలో అభ్యుదయ భావాలు కలిగి లౌకిక వాదం వర్ధిల్లిన ఏకైక దేశం సిరియా కూడా ఎట్టకేలకు ఇస్లామిక్ మతఛాందసవాదుల చేతికి చిక్కిందని చెప్పవచ్చు. అల్‌ఖైదా ఒడిలో పెరిగిన ఉగ్రవాది అబూ మోహమ్మద్ అల్ జ్వాలనీ ఆచూకీ తెలిపితే పది మిలియన్ డాలర్ల పారితోషికాన్ని ఇస్తామని అమెరికా ఒకప్పుడు ప్రకటించింది. మరి అదే జ్వాలనీ నేడు సిరియాను పూర్తిగా తన గుప్పిట్లో పెట్టుకుంటే పరాయి దేశం వ్యవహారంతో తమకు సంబంధం లేదని అమెరికా ప్రక్కకు తప్పుకున్నది! ఇది, ప్రపంచ అగ్రరాజ్య ద్వంద్వ నీతిని ప్రతిబింబిస్తుందనడంలో సందేహం లేదు.

# ‘గణితంలో దిట్ట - సిద్ధాంతాలలో పుట్ట’ మన రామానుజన్ !



డిసెంబర్ 22 జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా....

బ్యాంకు ఏటియం కేంద్రానికి వెళ్లి మనం ఎంత మొత్తంలో డబ్బు కావాలో అంతే పరిమాణంలో వివిధ డినామినేషన్లో ఆ యంత్రం అందిస్తుంది. అలాగే అంతరిక్షంలో ఉపగ్రహాన్ని మనకు కావలిసిన రీతిలో ప్రవేశపెడతాం. ఇటువంటి అనేక రంగాలలో మన దేశానికి చెందిన ప్రముఖ గణిత మేధావి రూపొందించిన సిద్ధాంతాలు ఉన్నాయి. ఆయనే శ్రీనివాస రామానుజన్. ఈయన గణితంలో సాధించిన విజయాలు ప్రపంచ గణిత సమాజంలో మన దేశాన్ని అగ్రపథంలో నిలబెట్టాయి. గణితానికి ఈయన చేసిన సేవలకు గాను 2011లో ఈయన 125వ జయంతిని పురస్కరించుకుని 2012 నుండి ప్రతీ యేడాది డిసెంబర్ 22 వ తేదీన ‘జాతీయ గణిత దినోత్సవం’ గా జరుపుకోవాలని అప్పటి ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రకటించారు. ప్రతి సంవత్సరం జాతీయ గణిత దినోత్సవాన్ని గణితశాస్త్రంలోని వివిధ అంశాలను దాని ప్రాముఖ్యతను నొక్కిచెప్పడానికి ఒక నిర్దిష్ట థీమ్‌తో జరుపుకుంటారు. ఈ యేడాది థీమ్ “ గణితం: ఆవిష్కరణ, పురోగతికి వంతెన”. ఈ థీమ్ విజ్ఞాన సాంకేతిక రంగాలలో నూతన ఆవిష్కరణలో గణితం పాత్రను తెలియజేస్తుంది. 2024 వేడుక కేవలం సంఖ్యలకు సంబంధించినది కాదు. ఇది ఖచ్చితత్వం, ఉత్సుకత, ఆవిష్కరణలకు విలువనిచ్చే మనస్తత్వాన్ని పెంపొందించడం గురించి కూడా. మానవ పురోగతిలో గణితశాస్త్ర కీలక పాత్రను గుర్తించడానికి రామానుజన్ విశేషమైన పనిని గౌరవించడానికి ఈ రోజును జరుపుకుంటారు. విద్యలో గణితాన్ని ప్రోత్సహించడం, యువకులను ప్రేరేపించడం, గణితంపై ఆసక్తిని ప్రోత్సహించడం ఈ రోజు లక్ష్యం. విజ్ఞాన సాంకేతిక రంగాలలో గణితం యొక్క ప్రాముఖ్యతను ఈరోజు తెలియజేస్తుంది. రోజువారీ జీవితంలో గణితశాస్త్రం యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేయడానికి, సంఖ్యలు, సమీకరణాలు, ఆవిష్కరణల ప్రపంచాన్ని పరిశోధించడానికి యువ మనస్సులను ప్రేరేపించడానికి ఈ రోజు అంకితం చేయబడింది. 20వ శతాబ్దం ప్రారంభంలో గణితంలో అసాధారణ విజయాలు సాధించారు.



**గణిత ధిట్ట:** తమిళనాడు రాష్ట్రం కుంభకోణంలో నివాసముంటూ చీరల దుకాణంలో గుమస్తాగా పనిచేసే శ్రీనివాస అయ్యంగార్, గుడిలో పాటలు పాడే కోమలటమ్మాళ్ దంపతులకు 1887 డిసెంబర్ 22వ తేది నాడు శ్రీనివాస రామానుజన్ జన్మించారు. నవంబరు 1897లో 10 ఏళ్లు నిండకముందే ఆంగ్లం, తమిళం, భూగోళ శాస్త్రం, అంకగణితంలో తన ప్రాథమిక పరీక్షలలో జిల్లాలో అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణుడయ్యారు. పదకొండు సంవత్సరాల వయస్సులోనే అధునాతన త్రికోణమితిపై ‘యస్ఎల్ లోనీ’ రాసిన పుస్తకాన్ని అర్థం చేసుకున్నాడు. పదమూడు ఏళ్లకే గణితంలో స్వయంగా అధునాతన సిద్ధాంతాలను కనిపెట్టారు. పద్నాలుగు సంవత్సరాల నాటికి మెరిట్ సర్టిఫికేట్‌లు, అకడమిక్ అవార్డులను అందుకున్నారు. 1903లో రామానుజన్ తన పదహారవ ఏట జియస్ కార్ వ్రాసిన ‘ఏ సినాప్సిస్ రిజల్ట్స్ ఇన్ ప్యూర్ అండ్ అప్లైడ్ మేథమెటిక్స్’ పుస్తకంలోని విషయాలను వివరంగా అధ్యయనం చేశారు. 1904లో టౌన్ హయ్యర్ సెకండరీ స్కూల్ నుండి విద్యాభ్యాసం తరువాత పచ్చయ్యప్ప కళాశాలలో చేరి కేవలం గణిత సబ్జెక్టో మాత్రమే మంచి మార్కులు పొంది మిగతా సబ్జెక్టుల్లో మంచి మార్కులు పొందలేకపోవడం వలన డిసెంబరు 1906లో తన ఫెలో ఆఫ్ ఆర్ట్స్ (ఎఫ్.ఎ) పరీక్షలో ఉత్తీర్ణత పొందలేదు. 14 జూలై 1909న తొమ్మిదేళ్ల జానకి అమ్మాళ్ను వివాహం చేసుకున్న తరువాత ఉద్యోగం కోసం అప్పట్లో కొత్తగా ఒక గణితశాస్త్ర సమాజాన్ని ఏర్పరిచిన డిప్యూటీ కలెక్టర్ రామస్వామిని కలుసుకున్నారు. తాను గణితం మీద రాసుకున్న నోటు పుస్తకాలను చూపి ఆయన పని చేసే ఆఫీసులో ఒక చిన్న ఉద్యోగం కోరారు. అవి చూసి ముగ్ధుడై రామానుజన్‌కు సిఫారసు లేఖలు ఇచ్చి మద్రాసులో తనకు తెలిసిన గణిత శాస్త్రవేత్తల దగ్గరకు పంపించాడు. 1912 వ సంవత్సరంలో నెలకు ముప్పై రూపాయల జీతంతో గుమాస్తా ఉద్యోగం సంపాదించారు. ఉద్యోగానికి సంబంధించిన పనులను కేవలం సగం రోజులోనే పూర్తి చేసి మిగిలిన సమయంలో గణితంపై పరిశోధనలు చేసేవారు. 1913లో మద్రాసు లోని గణిత ప్రముఖులు రామానుజన్ పరిశోధనాపత్రాలను లండన్ కు పంపించడం జరిగింది. 1913లో మద్రాస్ వచ్చిన ప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త డాక్టర్ వాకర్ ఈ పరిశోధనలు చూసి ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశాడు. రామానుజన్ కనుగొన్న 120 పరిశోధన సిద్ధాంతాలను ఆయన కేంబ్రిడ్జి యూనివర్సిటీ ప్రొఫెసర్ హార్డీకి పంపాడు. మహా మేధావులకు మాత్రమే సాధ్యమయ్యే పరిశోధన ఫలితాలను చూసిన హార్డీ రామానుజన్‌ను కేంబ్రిడ్జి యూనివర్సిటీకి ఆహ్వానించారు. 1914 మార్చిలో లండన్‌కు వెళ్లిన రామానుజన్ అక్కడ నిరంతరం గణితంపై పరిశోధనలు చేసి కొత్త సిద్ధాంతాలను కనిపెట్టారు. ‘ ఫెలో ఆఫ్ ద ట్రినిటీ కాలేజ ‘ గౌరవం పొందిన తొలి భారతీయుడిగా ‘, ఫెలో ఆఫ్ ద రాయల్ సొసైటీ ‘ గౌరవం పొందిన రెండవ భారతీయుడిగా చరిత్రకెక్కారు. ఆ కాలంలో సుప్రసిద్దులైన ప్రపంచ గణిత మేధావులయిన ఆయిలర్, గౌస్, జకోబి లాంటి వారితో సమానంగా పోల్చదగినవారు

**రామానుజన్ నంబర్ :**
1729ని రామానుజన్ సంఖ్య అంటారు. ప్రొఫెసర్ హార్డీ ఇంగ్లాండులో ఆసుపత్రిలో ఉన్న రామానుజన్ ను పరామర్శించినప్పుడు అతని కారు నంబర్ 1729 చాలా డల్ సంఖ్యగా అనిపించిందని చెప్పగా వెంటనే రామానుజన్ 1729 అనేది “ రెండు సంఖ్యల ఘనాల మొత్తం రూపంలో రెండు విధాలుగా వ్రాయబడే మొదటి సంఖ్య” అని ఉన్నపళంగా చెప్పాడు.

**సిద్ధాంతాలలో ప్రధానమైనవి :**
అతని రచనలు ప్రపంచవ్యాప్తంగా చాలా మందిని ప్రభావితం చేశాయి. శుద్ధ గణితంలో ఈయనకు శాస్త్రీయమైన శిక్షణ లేకపోయినా గణిత విశ్లేషణ, సంఖ్యా శాస్త్రం, అనంత శ్రేణులు, అవిరామ భిన్నాలు లాంటి గణిత విభాగాలలో విశేషమైన కృషి చేశారు. అప్పట్లో ఇక పరిష్కారం కావు అనుకున్న సమస్యలకు కూడా ఇతను పరిష్కారం కనుగొన్నారు. ఈయనలోని గణిత పరిశోధనా ప్రవృత్తి ఏకాంతంలోనే ఎక్కువగా అభివృద్ధి చెందింది. తన పరిశోధనలతో అప్పట్లో ప్రఖ్యాతి గాంచిన గణిత శాస్త్రవేత్తలకు దగ్గరవ్వాలని ప్రయత్నించారు. కానీ ఆ ప్రయత్నాలు చాలా వరకు విఫలమయ్యాయి. ఎందుకంటే రామానుజన్ కనుగొన్న సూత్రాలు అపూర్వమైనవి. అప్పటి దాకా ఎవరూ పరిచయం చేయనివి. దానికితోడు వాటిని రామానుజన్ సమర్పించిన విధానం కూడా విభిన్నమైనది. అయినా తన పట్టు విడవకుండా తన పరిశోధనను అర్థం చేసుకునే శాస్త్రవేత్తలకోసం వెతుకులాట కొనసాగించారు. సిరీస్ సంఖ్యా పద్ధతులు కంప్యూటర్ అల్గారిథమ్‌లలో ఆచరణాత్మక అనువర్తనాలను కలిగి ఉన్నాయి. హార్డీ రామానుజన్ రాడెమాచర్ అసిమ్ప్టోటిక్ ఫార్ములా, రామానుజన్ కాంగ్రెస్సీస్, రామానుజన్ మాస్టర్ థీరం, తీటా ఫంక్షన్, మాక్ తీటా ఫంక్షన్, రోజర్స్ రామానుజన్ ఐడెంటిటీస్, బెర్ట్రాండ్ పోస్ట్యులేట్ జనరలైజేషన్ మొదలగునవి ఈయన రాసిన సిద్ధాంతాలలో కొన్ని మాత్రమే ! నేటికీ ఆయన రచనలు పరిశోధనలకు ప్రేరణనిస్తూనే ఉండడం గమనార్హం !

**అనువర్తనాలు:**
రామానుజన్ అసాధారణ రచనలు ప్రపంచవ్యాప్తంగా ఔత్సాహికులను ప్రేరేపిస్తూ గణితశాస్త్రంలోని వివిధ రంగాలను ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. పార్టికల్ ఫిజిక్స్, స్టాటిస్టికల్ మెకానిక్స్, కంప్యూటర్ సైన్స్, స్పేస్ సైన్స్, క్రిప్టాలజీ, పాలిమర్ కెమిస్ట్రీ, మెడికల్ సైన్స్, లోహాలను కరిగించడానికి వాడే మెరుగైన బ్లాస్ట్ ఫర్నేస్‌ల రూపకల్పనలో, టెలిఫోన్ కమ్యునికేషన్లో, కంప్యూటర్ అల్గారిథమ్‌లలోను, లోలకాల కదలిక, తీగల కంపనం, విద్యుత్ ప్రవాహాల సమస్యల సాధనలో సిద్ధాంతాలు వినియోగించబడుతున్నాయి. ‘ రామానుజన్ మాస్టర్ థీరం ‘ అనేది క్వాంటం భౌతిశాస్త్రంలో ఉపయోగిస్తున్నారు. విశ్వ బహుళ పరిమాణాలను వివరించుటలోనూ, బ్లాక్ హోల్ గురించి రామానుజన్ మాడ్యులర్ ఫంక్షన్ ఉపయోగపడుతుంది.


**రామానుజన్ మఠం పార్కు:**
2017లో ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా కుప్పంలో రామానుజన్ మఠం పార్కును ప్రారంభించారు. విద్యార్థులకు గణితాన్ని సరళీకృతం చేయడానికి ఆసక్తికరంగా మార్చడానికి ఒక ఇంటరాక్టివ్ ప్లాట్‌ఫారమ్‌గా ఇది పనిచేస్తుంది.

**ఆధ్యాత్మికత:**
తనకు సంక్రమించిన సామర్థ్యం అంతా తమ ఇలవేల్పు దేవత అయిన నామగిరి ప్రసాదించినదేనని రామానుజన్ బలంగా విశ్వసించేవారు. తనకు ఏ కష్టం కలిగినా ఆమె సహాయం కోసం ఎదురు చూసేవాడు. ఆమె కలలో కన్పించి ఎటువంటి సమస్యకైనా పరిష్కారం చూపించగలదని భావించేవారు. భగవంతునిచే ప్రాతినిధ్యం వహించబడని ఏ ఆలోచన కూడా సూత్రం కానేరదు అని అప్పుడప్పుడూ ?అంటుండేవారు. రామానుజన్ అన్ని మతాలు ఒకటిగా నమ్మేవాడని హార్డీ అన్నారు.

**మరణం:**
బ్రిటన్ నుంచి 1919 మార్చిలో భారతదేశానికి తిరిగి వచ్చారు. బ్రిటన్‌లో ఉన్నప్పుడు ఆరోగ్యం గురించి ఏమాత్రం లెక్కచేయకుండా గణిత పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వడంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. దీంతో ఆయన ఇండియాకు వచ్చిన ఏడాదికి 1920 ఏప్రిల్ 26న కేవలం 33 ఏళ్ల వయస్సులోనే అస్తమించారు.


జనక మోహన రావు దుంగ
యం.యస్సీ ( మ్యాథ్స్, ఫిజిక్స్ )
ఫోన్: 8247045230


# బెజవాడ అభివృద్ధికి ఆద్యుడు



ఆనాటి బెజవాడ నగరంలో ఆది వైద్యుడు డా. తెన్నేటి వెంకట శేషాచలపతి రావు. మురికివాడల్లో మెరుగైన వైద్యం, చీకటి గుడిసెల్లో నిండు వెలుగులు, మండు వేసవిలో మంచినీళ్ళు, నగర ప్రజలకు తొలి ఆర్టీసీ బస్సు సౌకర్యం, మురికి వాడల సుందరీకరణ, పారిశుద్ధ్య కార్మికుల పిల్లలకు ఉచిత విద్యాబోధన, నిరుపేద మహిళలకు జీవనోపాధి, ఇంకా అనేకానేక స్వీయ ప్రణాళికా సంస్కరణలతో బెజవాడ ప్రజల ఆత్మబంధువుగా రాజకీయ దురంధరుడుగా, ప్రజాసేవలో తనదైన ముద్ర వేసిన ఉదాత్తుడు డా. టి.వి.ఎస్. చలపతి రావు. పరవళ్ళు తొక్కుతూ బిలబిల పారే కృష్ణమ్మ ఒడ్డున ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ సాక్షిగా ఆయన జీవితం, నాయకత్వం నాటి బెజవాడ, నేటి విజయవాడ నగర చరిత్రలో సుస్థిరంగా లిఖించబడిన ఓ సువర్ణాధ్యాయం. బెజవాడ మునిసిపల్ కౌన్సిలర్‌గా, చైర్మన్‌గా, ఆ పై రెండు పర్యాయాలు ఎం.ఎల్.ఏ.గా ఎన్నో సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి కార్మిక, కర్షక సంఘాలకు, వైద్యుల సంఘాలకు, విద్యుత్తు, పోస్టల్ సంఘాలకు నాయకత్వం వహించిన అజాతశత్రువు, బీదల అప్తుడు డా.టి.వి.ఎస్ చలపతి రావు. కమ్యూనిస్ట్ పార్టీకి కంచుకోటగా ఉన్న బెజవాడలో రెండు పర్యాయాలు అంటే 1962 నుండి 1972 వరకు శాసనసభ్యుడిగా ఎన్నికైన తొలి కాంగ్రెస్ నాయకుడు డా.చలపతి రావు.
కృష్ణా జిల్లా తెన్నేరు గ్రామంలో బ్రాహ్మణ కుటుంబంలో 1911లో ఆయన జన్మించారు. ఆచార వ్యవహారాలతో పాటు నరనరానా దేశభక్తిని అలవర్చుకున్న యువకుడు డా. టి.వి.ఎస్. ఎంతో ఇష్టంగా పట్టుదలతో వైద్యవిద్యను అభ్యసించి అప్పటి మద్రాసు పాలిత ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటిసారిగా 1936 లోనే సొంతంగా రోగనిర్ధారణ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసి నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందించి గొప్ప పేరు గడించారు. ఓ ప్రక్కన వైద్యవృత్తిని చేస్తూనే అనేకానేక సమస్యలతో ఉన్న బెజవాడ ప్రజలకు సేవలందించేందుకు చలపతిరావు నడుం బిగించారు. 1939 లో బ్రిటీష్ వారి పరిపాలనలో బహు బలీయంగా ఉన్న జస్టిస్ పార్టీకి దీటైన పోటీ ఇచ్చి అనూహ్యంగా మునిసిపల్ కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. ప్రణాళికాబద్ధమైన పనితీరుతో తన వార్డు అభివృద్ధికి ఎంతో కృషి చేసి సఫలీకృతులయ్యారు. ప్రజాపాలన పట్ల ఆయనకు ఉన్న విశేష పరిజ్ఞానం, రాజకీయ చతురతను గుర్తించి 1947లో అందరి మద్దతుతో బెజవాడ మున్సిపల్ ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్వతంత్ర భారతావనిలో ఏకగ్రీవంగా ఎన్నికైన తొట్టతొలి మునిసిపల్ చైర్మన్ డా. టి.వి.ఎస్. చలపతిరావు.
పున్నమ్మతోటలో ఆల్ ఇండియా రేడియో కేంద్రం ఏర్పాటు, గన్నవరం విమానాశ్రయానికి శ్రీకారం చుట్టడం ఆయనే ఆధ్వర్యంలోనే జరిగాయి. ఇందిరాగాంధీ మునిసిపల్ మైదానం ఆయన హయాంలోనే ఏర్పాటు చేశారు. మురికివాడల్లో నివసించే నిరుపేదలకు శాశ్వత గృహాలు ఏర్పాటు చేశారు. గాంధీనగర్లో మునిసిపాలిటీ ఉద్యోగులకు ఉచితంగా ఇళ్ల స్థలాన్ని కేటాయించారు. ఫార్మా రంగంలోనే పేరున్న సిరీస్ ఫార్మసూటికెల్స్ సంస్థ విజయవాడలో ఫ్యాక్టరీ పెట్టడానికి ముందుకొచ్చిన జి.ఎస్.రాజుకు అన్ని అనుమతులు ఇచ్చి ప్రోత్సహించారు. 1952%-%53 మధ్య కాలంలో బెజవాడ మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా నగరంలో భూగర్భ మురికినీటి పారుదల సౌకర్యం కావాలని దానికి సంబంధించిన ప్రణాళికను డా. తెన్నేటి తయారు చేసి అప్పటి అవిభక్త మద్రాస్ రాష్ట్ర ముఖ్యమంత్రి సి.రాజగోపాలాచారికి పంపగా, ఆయన వెంటనే ఆమోదించి కావాల్సిన నిధులను మంజూరు చేశారు. ఇదే కాలంలో ఆయన మున్సిపల్ చైర్మన్‌గా, చాంబర్ సెక్రటరీగా చేపట్టిన అభివృద్ధికి, స్థానిక సంస్థల పరిపాలనా దక్షతకు, నగర నిర్మాణానికి అద్భుతమైన ప్రణాళికలను రూపొందించారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ఛాంబర్ ఆఫ్ మున్సిపల్ చైర్మన్ గౌరవ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికై బాధ్యతలు చేపట్టారు. ఆయన అందించిన సేవలకు, స్థానిక సంస్థల స్వపరిపాలన తీరుని గుర్తించిన అమెరికా ప్రభుత్వం డా.టి.వి.ఎస్‌ను అక్కడ స్థానిక సంస్థల స్వపరిపాలన విధానాన్ని అధ్యయనం చేయవలసిందిగా ప్రత్యేకంగా డెట్రాయిట్‌కి ఆహ్వానించింది.వైద్యం, రాజకీయం, ఆధ్యాత్మిక, ధార్మిక, సాహిత్యం, క్రీడలు, రచనావ్యాసంగాలపై ఎంతో మక్కువ ఇలా అన్నింటిని సమపాళ్లలో స్వాగతించేవారు. ఆ అభిరుచితోనే డా. చలపతిరావు ‘ప్రజాసేవ’ అనే రాజకీయ వారపత్రిక, తెలుగులో ‘మున్సిపల్ సమాచార్’ ఇంగ్లీష్‌లో ‘మద్రాస్ మునిసిపాలిటీ’ అనే త్రైమాసిక పత్రికను ప్రారంభించి వాటికి సంపాదకత్వం వహించారు. ఎంతో ఇష్టపడి చదువుకున్న వైద్యవిద్యతో వేలాదిమందికి ఆయన ఉదారంగా మెరుగైన వైద్యసేవలు అందించారు. 1937లో మొట్టమొదటి ప్రైవేటు ఆసుపత్రి డా. టి.వి.ఎస్ క్లినిక్‌ని, ఆధునిక డయాగ్నస్టిక్ లేబరేటరీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తూ ఎక్స్‌రే, డీప్ ఎక్స్‌రే, ఈ.సి.జి, ఐ.సి.సి.యు, టి.ఎం.టి వంటి సదుపాయాలు కల్పించడంతో పాటు క్యాన్సర్‌కి చికిత్స కూడా చేసేవారు చలపతిరావు. ఐ.ఎం.ఏ. విజయవాడ శాఖ ప్రెసిడెంట్‌గా, బెజవాడ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా వైద్యరంగానికి ఎన్నో సేవలందించారు.
1964%-%67 వరకూ శ్రీశైలం ట్రస్ట్ బోర్డు సభ్యులుగా, 1967%-%70 వరకూ తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులుగా స్వామివారి సేవల్లో కొనసాగి, టీటీడీ తలపెట్టిన హిందూ ధర్మ ప్రచార సంస్థ ఏర్పాటుకు విశేష కృషి చేశారు. కంచి పరమాచార్య శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామి వారి దివ్య హస్తాలతో ఆ సంస్థను ప్రారంభించారు. ఆ సమయంలో ఋషీకేశ్‌లో టీటీడీ వారి వసతి గృహాన్ని ప్రారంభించారు. విజయవాడలో అయ్యప్ప స్వామి దేవాలయం, ఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణానికి టీటీడీ నుంచి నిధులు మంజూరు చేయించారు. దాదాపు ఐదు దశాబ్దాల పాటు ప్రజాసేవలో గడిపి లక్షలాది మంది గుండెల్లో గుడికట్టుకుని ఓ దైవంగా ఆరాధించబడిన నిరాడంబర జీవి, బహుముఖ ప్రజ్ఞాశాలి, వైద్యుడు, ప్రజానాయకుడు డా.తెన్నేటి వేంకట శేషాచలపతిరావు.అనేక మంది అగ్రనాయకులు డా. టి.వి.ఎస్ పట్ల అమిత గౌరవాదరాలు చూపేవారు. ఆయన్ను ‘రాజర్షి’గా కొనియాడేవారు. ఆయనకు నివాళులు అర్పించిన వారిలో జ్ఞానీ జైల్ సింగ్, ఆర్. వెంకట్ రామన్, నీలం సంజీవరెడ్డి, పి.వి. నరసింహారావు, మన్మోహన్ సింగ్, కాసు బ్రహ్మానంద రెడ్డి, డా. మర్రి చెన్నారెడ్డి తదితర నాయకమణులు ఉన్నారు. అరవిందో తత్వవేత్త మంగేష్ వి.నాథకర్ణి, బి.కె నెహ్రు, ఎల్.కె. ఝా, శ్రీ వెంకటేశ్వరన్, డా. సూరి భాగవంతం, డా.ఎన్. రామ్, జనరల్ కె.వి కృష్ణారావు, ఎం.వి. కామత్, జి.వి.జి కృష్ణమూర్తి, సి.సుబ్రమణ్యం తదితర ప్రముఖులు చలపతిరావు స్మారకోపన్యాసాలను వెలువరించారు. ఐ.ఎం.ఏ విజయవాడ శాఖ డా. టి.వి.ఎస్. చలపతిరావు పేరిట ఏర్పాటు చేసిన గోల్డ్ మెడల్‌ను అందుకున్నవారిలో, లోకనాయక్ డా. జయప్రకాష్ నారాయణ్, డా. కళ్యాణ్ రామం, డా. ఎం.కె.మణి మున్నగు ప్రముఖులు ఉన్నారు.
ఈ ఆగస్టు 5న డా. చలపతిరావు 45వ సంస్మరణ దినోత్సవం జరుగుతుంది. ఆ రోజున వారి స్మృతివనంలో హిందు, ముస్లిం, క్రీస్తు మత పెద్దల ప్రార్థనలతో పాటు నగర ప్రముఖులు ఆయనకు నివాళులు అర్పిస్తారని డా.చలపతిరావు కుమారుడు ప్రముఖ వైద్యులు డా.టి.వి.ఎస్.శర్మ తెలియజేశారు.



# మానవీయ మహేతిహాసం



రామకథను వాల్మీకి వినిపించి ఎన్ని వేల ఏళ్లు గడిచాయో! అది మొదలు, సీతారాములు భారతీయులకు ఆరాధ్య దంపతులయ్యారు. సర్వ పశు పక్షి జాతుల నుంచి విడివడి విశుద్ధం, విశిష్టం అయిన జీవనపథాన్ని ఏర్పర చుకుంది మానవజా తి. వారికి లభించిన వరం దాంపత్య జీవితం. ఆ జీవన రహస్యాన్ని వాల్మీకి మహర్షి తన రామాయణం నిండా నిక్షేపించాడు.లోక వ్యవహారాన్ని విస్పష్టం గా బోధించిన మహాకావ్యం రామాయ ణం. ఆదికవి వాల్మీకి నుంచి నేటి వరకు రమణీయమైన ఆ రామకథ పలు భాషల్లో, అనేక రీతుల్లో రూపుది ద్దుకొంది. భారతా వనిలోనే కాకుండా, ఈ సంస్క ృతి ప్రసరించిన అన్యదేశాల్లోనూ ప్రశస్తి పొందింది.రామాయణం మానవజాతికి ధర్మ పద్ధతిని ఉపదేశిస్తుంది. అది వేదం వంటిది. పురాణాలు రామాయణాన్ని ‘మిత్ర సమ్మితం’గా చెబుతాయి. కావ్యాలు నెచ్చెలిగా వర్ణిస్తాయి.లోకంలో రామాయణం ఒక ఇక్షు సాగరం. ఎక్కడ దోసిలిపట్టి తాగినా తియ్యదనమే! మానవజాతి తాపత్రయాలను పోగొట్టి, శరణాగతి తత్వానికి ప్రాధాన్యమిచ్చి, ఒక్కొక్క కాండలో ఒక్కో రసావిష్కరణ చేశాడు వాల్మీకి.మానవ విలువల్ని అన్వేషిస్తూ రాముడు పయనం సాగించాడు. తాను మానవుడైనందుకు గర్వించాడు. మనసా వాచా కర్మణా పరిపూర్ణ మానవుడిగా జీవించాడు. ప్రతి దేహంలోనూ రాముడు అంతర్యామి. ప్రతి అంతరంగంలోనూ ఆయన ఆనందధాముడు, ఆత్మారాముడు. ‘రామ’ శబ్దం రామణీయకానికి మారుపేరు.సీతాదేవి ధైర్య, కరుణా సమన్విత. మహోన్నత ప్రేమమూర్తి. కలవరపరచే కష్టాలు, అవరోధాలను జీవితం నిండా దర్శించింది. తన భర్త పట్ల అచంచల విశ్వాసం, అంకిత భావం గల నారీ శిరోమణి. ఆమె అంటే రావణుడికీ గౌరవభావమే. రామచంద్రుడి ఘనతను ఆమె పెంచింది. ఆయనను సంపూర్ణ మానవుణ్ని చేయడానికి తన జీవితాన్నంతా వెచ్చించింది.లక్ష్మణ భరత శత్రుఘ్నులు ఓంకారంలోని అకార ఉకార మకారాలనే బీజాక్షరాలకు రూపాలు. ఆ మూడూ చేరి ‘ఓంకారం’ అనే రామశబ్దం ఏర్పడింది. రాముడు శబ్ద బ్రహ్మం. లక్ష్మణుడు గొప్ప సేవకుడు. భరతుడు సత్యశీలుడు. శత్రుఘ్నుడు గుణవంతుడు. హనుమ శక్తి సంపన్నుడైన రామదూత, నీతివర్తనుడు.విశ్వ సోదరభావానికి, మానవ గౌరవానికి, సామాజిక సమన్వయానికి పునాది కుటుంబం అని రామాయణం గుర్తించింది. భిన్న సంస్కృతుల్ని అది దర్శించింది. వాటి మధ్య సమతూకం సాధించగలిగింది. అయోధ్య, కిష్కింధ, లంక– ఆ మూడు చోట్ల భిన్న పరిస్థితులున్నాయి. అక్కడ సంస్కృతీ సంపన్నులైన రామ సోదరులు, సుగ్రీవుడు, విభీషణుడు– వీరందరి మధ్యనా వాల్మీకి సమతుల్యత సాధించడాన్ని రామాయణం ప్రస్ఫుటీకరిస్తుంది.వేద సంస్క ృతి ఒక్కటే కాదు– క్రూర దానవ సంస్క ృతి, పక్షి సంస్క ృతి వంటివీ రామాయణంలో ప్రతిబింబిస్తాయి. జటాయువు, సంపాతి వంటి విహంగాల్లో నిస్వార్థ సేవ, నిబద్ధత, త్యాగచింతన గోచరిస్తాయి.మానవజాతికి రామాయణం బహుముఖ సందేశమిస్తుంది. నిత్యసత్యాలతో ప్రకాశించే కావ్యమది. శాశ్వత విలువల్ని బోధించే మహేతిహాసంగా అది ఖ్యాతి గడించింది. మానవాళికి ఎప్పటికీ అవసరమైన మహోన్నత కావ్యం రామాయణం. దాన్ని విన్నా, చదివినా, దృశ్యరూపంలో చూసినా జీవితం చరితార్థమవుతుందని భారతీయుల ప్రగాఢ విశ్వాసం!


## చలికాలం.. చర్మం పైలం!



చలికాలంతోపాటే చర్మ సమస్యలూ మొదలవుతాయి. శీతలగాలులకు ఒంట్లో తేమ తగ్గిపోయి.. దురద, చర్మం పగిలిపోవడం లాంటి ఇబ్బందులు ఎదురవుతాయి. వేడివేడి నీళ్లతో స్నానం చేయడం కూడా.. సమస్యను పెంచుతుంది. ముఖ్యంగా శీతకాలంలో పొడి చర్మం.. ప్రతిఒక్కరినీ ఇబ్బంది పెడుతుంది. జీవనశైలిలో కొన్ని మార్పులవల్ల చలికాలంలో పొడి చర్మం సమస్యనుంచి బయటపడొచ్చు. చలికాలంలో చర్మ సంరక్షణకు అందరూ ఆశ్రయించేది.. మాయిశ్చరైజర్లు, క్రీమ్సనే! అయితే, వీటి రక్షణంతా బయటి నుంచే! అదికూడా తాత్కాలికంగానే! పొడిచర్మం సమస్య పూర్తిగా పరిష్కారం కావాలంటే.. చర్మం లోపలి నుంచీ ఆరోగ్యంగా ఉండాలి. ఇందుకోసం ఆహారపు అలవాట్లలో కొన్ని మార్పులు %-% చేర్పులూ చేసుకోవాలి. చర్మం రోజంతా తేమగా ఉండాలంటే.. శరీరానికి తగినంత నీరు అందించాలి. అందుకే, దాహమైనా.. కాకున్నా రోజుకు కనీసం 8 గ్లాసుల మంచినీళ్లు తాగాలి. చలికాలం తీసుకునే ఆహారంలో నెయ్యి, నువ్వుల నూనె ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఇవి చర్మాన్ని లోపలి నుంచి హైడ్రేటెడ్‌గా ఉంచుతాయి. స్నానానికి ముందు గోరువెచ్చని నూనెతో శరీరాన్ని మర్దనా చేసుకోవడం వల్ల చర్మానికి కావాల్సిన పోషణ అందుతుంది. రక్త ప్రసరణ పెరిగి.. చర్మం తేమగా ఉంటుంది. ఇందుకోసం బాదం, నువ్వులు, కొబ్బరి నూనెలు ఎంచుకోవడం మంచిది. రెగ్యులర్‌గా ఉపయోగించే సబ్బులను పక్కన పెట్టండి. ఇవి చర్మంలోని సహజ నూనెలను తొలగిస్తాయి. దాంతో చర్మం పొడిబారుతుంది. కలబంద, పసుపు, వేప లాంటి సహజ పదార్థాలున్న సబ్బులను వాడండి.

# మరుగునపడ్డ తెలుగు రాణి






మహారాణి మంగమ్మ... ఈ పేరు ఎప్పుడైనా విన్నారా? మదురై రాజధానిగా పాలించిన నాయక రాజుల వంశానికి చెందిన ఈ తెలుగు రాణి గురించి మనకు తెలిసింది చాలా తక్కువ. తాజాగా ఆమె గురించి... 'మధుర మహారాణి మంగమ్మ' అనే పరిశోధనాత్మక చారిత్రక నవల వెలువడింది. 'ఇందులో 80 శాతం చారిత్రక సత్యాలే' అంటారు ఆ నవలా రచయిత... డాక్టర్ సగిలి సుధారాణి.

"నేను పుట్టి పెరిగింది తిరుపతిలో. పెళ్లి తర్వాత హైదరాబాద్‌కు వచ్చాను. తెలుగు విశ్వవిద్యాలయంలో 'చిత్తూరు జిల్లా మహిళల సంప్రదాయ గేయాలు' అనే అంశంపై పరిశోధన చేశాను. ఆ తర్వాత చెన్నైకు వెళ్లాను. 'ద్రావిడ విశ్వవిద్యాలయం'లో పీహెచ్‌డీ చేయాలనుకున్నప్పుడు... 'జానపద మౌఖిక సాహిత్యం' అనే అంశంపై పరిశోధన ప్రారంభించాను. చెన్నైలో ఇళ్లలో పని చేసేవారు, ధారాళంగా తెలుగు మాట్లాడేవాళ్లకు కూడా తెలుగు రాయటం రాదు. రెండు మూడు శాతం మందికి, అది కూడా విశ్వవిద్యాయాల్లో చదివేవారికి మాత్రమే రాయటం కూడా వస్తుంది. నేను మౌఖికంగా తరతరాలుగా వస్తున్న జానపద సాహిత్యాన్ని సేకరిస్తున్నప్పుడు... అక్కడ అనేక తెలుగు పదాలు ఉన్నాయని తెలిసింది. ఒక రోజు నేను చెన్నై నుంచి ప్రయాణిస్తుంటే మధ్యలో 'మంగమ్మ సాలై' (మంగమ్మ రోడ్డు) వచ్చింది. ఆ పేరు నన్ను ఆకర్షించింది. రహదారికి 'మంగమ్మ' పేరు ఎందుకు పెట్టారనే ప్రశ్న తలెత్తింది. దానికి సమాధానం వెతికితే... ఆమె నాయకరాజుల సమయంలో ఒక మహారాణి అని, భర్త, కొడుకు, మనవడు రాజ్యాన్ని పాలిస్తున్న సమయంలో ఆమె కీలకమైన పాత్ర పోషించిందనే విషయం తెలిసింది. మరింతగా లోతుకు వెళితే... ఆమె తెలుగు రాణి అని కూడా అర్థమయింది.

**ఎన్నో ప్రశ్నలు...**

నా పరిశోధన పూర్తి అయిన తర్వాత 'తమిళనాట తెలుగు ప్రజల జానపద విజ్ఞానం' అనే గ్రంథం తీసుకువచ్చాను. దీనికి మంచి ప్రశంసలు లభించాయి. ఈ పుస్తకం చూసిన శ్రీ రంగాచారి అనే పరిశోధకుడు- తనవద్ద ఉన్న ఒక పుస్తకాన్ని పంపించారు. అది మహారాణి మంగమ్మకు సంబంధించిన పుస్తకం. దాన్ని రచయిత్రి రూపాబాయి మోతీలాల్ తెలుగులో రాశారు. 'కట్టబొమ్మన నాయకుడు' పేరిట ఆమె ఒక తెలుగు వార పత్రికలో ధారావాహిక రాశారు. కట్టబొమ్మన తెలుగువాడని ఆమె ఈ ధారావాహికలో నిరూపించారు. మహారాణి మంగమ్మపై రూపాబాయి రాసిన పుస్తకం చదివిన తర్వాత నాలో అనేక రకాల ప్రశ్నలు తలెత్తాయి. వాస్తవానికి ఇప్పుడు భౌగోళిక ప్రాంతాల ఆధారంగా వేర్వేరు రాష్ట్రాలుగా ఏర్పాడ్డాం కానీ ఒకప్పుడు తెలుగువారందరూ కలిసే ఉండేవారు. తెలుగువారు అనేక ప్రాంతాలను పాలించారు కూడా! స్థూలంగా ఆ చరిత్రను విశ్లేషించాలనే ఉత్సుకత ఈ మధ్యకాలంలో తగ్గిపోతోంది. దీనివల్ల చరిత్రలో కీలక భూమికను పోషించినవారు కనుమరుగు అవుతున్నారు. దీన్ని భవిష్యత్తు తరాలవారికి అందించాలనే ఉద్దేశంతో ఆ ప్రతిని పరిష్కరించి 'మధుర మహారాణి మంగమ్మ' అనే ఈ పుస్తకాన్ని తీసుకువచ్చాను.

**ఊహల్లో రాణి కాదు...**

ఇక్కడ ఒక విషయాన్ని చెప్పాలి. సాధారణంగా మహారాణి మంగమ్మ అనగానే చాలామంది శత్రువులతో యుద్ధం చేసిన వీరనారి అనుకుంటారు. కానీ మంగమ్మ కండ బలం కన్నా బుద్ధి బలాన్ని ఉపయోగించి రాజ్యాన్ని కొనసాగేలా చేసింది. మంగమ్మ భర్త చొక్కనాథ నాయకుడు. కొన్ని పరిస్థితులవల్ల ఆయన చెరసాలలో ఉండాల్సి వచ్చింది. ఆ సమయంలో భర్తకు సాయం చేసి, రాజ్యాన్ని తిరిగి చేజిక్కించుకుంది మంగమ్మ. ఆయన రాజ్యాధికారానికి వచ్చిన కొద్ది రోజులకే చొక్కనాథ నాయకుడు మరణించాడు. అప్పటికి మంగమ్మ గర్భవతి. ఆ నాటి సంప్రదాయమైన సతీసహగమనం చేయకుండా మంగమ్మ కుమారుడికి జన్మనిచ్చింది. రాజమాతగా తన కొడుకు సింహాసనాన్ని అధిష్టించేలా చేసింది. దురదృష్టమేమిటంటే... కోడలు గర్భవతిగా ఉన్న సమయంలో కొడుకు కూడా చనిపోతాడు. బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత కోడలు చనిపోతుంది. కానీ తన మనవడికి రాజ్యాన్ని అప్పగించి... అతనికి యుక్త వయస్సు వచ్చే దాకా రాజమాతగా పరిపాలిస్తుంది. ఇలా భర్త, కొడుకు, మనమడి రాజ్యాధికార సమయంలో మంగమ్మ కీలకమైన పాత్ర పోషించింది. నాయకరాజుల వారసత్వం కొనసాగేలా చేసింది. అందుకే ఇప్పటికీ మదురై, తిరుచ్చి, శ్రీరంగం ప్రాంతాల్లో మహారాణి మంగమ్మ గురించి కథలుగా చెప్పుకుంటూ ఉంటారు. ఇప్పటికీ మంగమ్మ



రాయించిన తెలుగు శాసనాలు కూడా ఉన్నాయి.

**పేరెందుకు రాలేదు?**

'మహారాణి మంగమ్మకు ఇతర రాజుల స్థాయిలో పేరు ఎందుకు రాలేదు' అనే ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. బహుశా పురుషాధిక్య చరిత్రలో ఆమెకు సముచిత స్థానం లభించలేదేమో. ఆమె వేయించిన రహదారులు ఇప్పటికీ తమిళనాట ప్రజలు వాడుతున్నారు. ఆమె సమాజహితం కోసం చేసిన పనుల గురించి శాసనాలు ఉన్నాయి. కానీ మౌఖిక చరిత్రలో ఆమె గురించి అనేక అవాస్తవాలు ప్రచారంలోకి వచ్చాయి. ఆమె అక్రమ సంబం?ధం పెట్టుకుందని, చేసిన మంచి పనులన్నింటి వెనక వ్యక్తిగత స్వార్థం ఉందనే రీతిలో కథలు ప్రచారంలోకి వచ్చాయి. బహుశా దీనివల్ల ఆమెకు తగినంత ప్రాముఖ్యత లభించి ఉండకపోవచ్చు.

**అందుకే తక్కువ...**

మన దగ్గర పరిశోధనలు చేసే మహిళలు తక్కువ. దీనికి రెండు కారణాలున్నాయి. వివాహం కాకముందు- యువతులకు కుటుంబ సభ్యుల మద్దతు ఉండాలి. వారు భద్రంగా ఉంటారని తల్లిదండ్రులు నమ్మాలి. మన సమాజంలో అమ్మాయిలు స్వేచ్ఛగా దూర ప్రాంతాలకు వెళ్లటానికి అనుమతులు లభించవు. విశ్వవిద్యాలయాల నుంచి ఆర్థిక సాయం చేస్తే, వారు స్వేచ్ఛగా పరిశోధనలు చేసుకోగలుగుతారు. వివాహం అయిన తర్వాత ఇంకొన్ని రకాల సమస్యలు ఎదురవుతాయి. భర్త, పిల్లలు అనేక కుటుంబ బాధ్యతలు ఉంటాయి. అయితే వ్యక్తిగతమైన ఆసక్తి ఉంటే పరిశోధనలు సులభంగానే చేయవచ్చు. దీనికి నేనే నిదర్శనమని చెప్పవచ్చు."

**మంగమ్మ కథ...**

మహారాణి మంగమ్మ 17వ శతాబ్దంలో మధురను పాలించిన తెలుగు రాణి. ఈమె పూర్వీకులు చంద్రగిరికి చెందినవారు. విజయనగర సామ్రాజ్య పతనానంతరం తంజావూరు, మధుర, పుదుక్కోట, సెంజి, మైసూరు పాలకులు స్వతంత్రులయ్యారు. వీరిలో నాయక రాజులు- మధుర, తిరుచ్చి రాజధానులుగా సుమారు 200 సంవత్సరాలు పాలించారు. వీరిలో విశ్వనాథ నాయకుడు, తిరుమలనాయకుడు, చొక్కనాథ నాయకుడు, మహారాణి మంగమ్మ ముఖ్యులు. రాణీ మీనాక్షి కాలంలో నాయకరాజుల పాలన అంతరించిపోయింది. మంగమ్మ గురించి ఆ ప్రాంతాల్లో అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. 'చిక్క దేవరాయులు (మైసూరు పాలకుడు) లాగా కూడబెట్టి పిసినారిలా జీవించేకన్నా... దానధర్మాలు చేసి మంగమ్మలా బతకాలి' అనే నానుడి ఇప్పటికీ ప్రచారంలో ఉంది.

**సేవకులు అనడం సరికాదు...**

తమిళనాడులోని అనేక ప్రాంతాలను తెలుగు రాజులు పాలించారు. వారి సమయంలో రాజభాష తెలుగే. అనేకమంది ప్రజలు తెలుగు మాట్లాడేవారు. ఈ రాజులకు సేవ చేయటానికి తెలుగు ప్రాంతాల నుంచి అనేక మంది తరలి వెళ్లారు. వీరిలో అనేక వృత్తులవారు ఉన్నారు. కాబట్టి తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లి అక్కడి రాజులకు సేవ చేశారనటం సరికాదు. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. మనం కులాంతర, మతాంతర వివాహాలు విన్నాం. కానీ భాషాంతీకరణ జరిగిందనిపిస్తుంది. అంటే అక్కడ నివసించే తెలుగు ఇంటి పేర్లు కనుమరుగైపోతున్నాయి. సాధారణంగా తెలుగువారు తమ ఇంటి పేరును ముందు పెట్టుకుంటారు. వారి కుటుంబ అస్థిత్వం ఆ ఇంటి పేరు నుంచే వస్తుంది. తమిళులు తమ తండ్రి పేరును తమ పేరు చివరన పెట్టుకుంటారు. ఇలా పేరు పెట్టుకుంటే వారికి కొన్ని సదుపాయాలు లభిస్తాయి. దానితో చాలా మంది తెలుగువారు తమ ఇంటి పేరును వదిలేసి చివరలో తండ్రి పేరు పెట్టుకుంటున్నారు. ఈ లెక్కన చూస్తే తమిళనాడులో తెలుగువారు చాలా ఎక్కువ మంది ఉంటారు.

## మదర్ థెరిసా వారసురాలు



ఈ సిస్టర్ నిజంగానే మదర్ థెరిసా వారసురాలు. ఎందుకంటే.. ఓ వ్యక్తి ఆరోగ్యం బాగలేదు, ఆర్థకంగా సాయం చేయండి అని అడిగితే.. ఈమె ఏకంగా కిడ్నీ దానం చేసి తన ప్రేమ గుణాన్ని చాటుకున్నది.

తమిళనాడులో అలప్పుజ ప్రాంతానికి చెందిన సిస్టర్ రోజ్ ఆంటో.. నన్‌గా కథోలిక్ సంఘంలో సేవ చేస్తున్నది. అంతేకాదు తాను సెయింట్ జోసెఫ్ కాలేజ్‌లో హిందీ డిపార్ట్‌మెంట్‌కు హెడ్‌గా కూడా విధులు నిర్వర్తిస్తున్నారు. ఒకరోజు సిస్టర్ రోజ్ దగ్గరకు కొందరు వ్యక్తులు వచ్చి.. ఇరింజలకుడ ప్రాంతానికి చెందిన తిలకన్ అనే వ్యక్తికి కిడ్నీలు పాడయ్యాయి. కుటుంబం కష్టాల్లో ఉన్నది ఆర్థిక సాయం చేయండి అని కోరారు.

అయితే పలు సేవా కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనే సిస్టర్ రోజ్.. భర్త చనిపోయిన మహిళలకు ఆర్థికంగా సాయం చేసేవారు. అప్పుడే తిలకన్ గురించి ఆరా తీశారు. అతని దయనీయ పరిస్థితి, కుటుంబ ఆర్థిక బాధలు తెలుసుకొని తిలకన్‌కు తన కిడ్నీ ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. కొచ్చిలోని వీపీఎస్ దవాఖాన వైద్యులను సంప్రదించి తన కిడ్నీ దానం చేసింది. దీంతో వైద్యులు ఆ కిడ్నీని తిలకన్‌కు అమర్చారు. సిస్టర్ రోజ్ ఆంటో దయార్థ హృదయానికి తిలకన్ కుటుంబం కృతజ్ఞతలు చెబుతున్నది. సిస్టర్ రోజ్ మదర్ థెరిసా వారసురాలని కొనియాడుతున్నారు.

# కిర్రెక్కించే చాట్‌లు



క్రిస్మస్, కొత్త సంవత్సరం వచ్చేస్తున్నాయి. ఇంటికి ఎవరో ఒకరు వస్తూ ఉంటారు. అతిథులు వచ్చిన ప్రతిసారీ ఇడ్లీ, దోశలు మాత్రమే పెడితే ఏంబాగుంటుంది! అందుకే అందరూ ఇష్టంగా తినే ఆరోగ్యకరమైన చాట్‌లను ఎలా తయారుచేయాలో చూద్దాం. ఈ చాట్‌లన్నింటికీ చాట్ మసాలా అవసరమవుతుంది. ప్రస్తుతం మార్కెట్లో రకరకాల బ్రాండ్ల చాట్‌మసాలాలు దుబాటులో ఉన్నాయి. వాటిలో ఏ చాట్ మసాలానైనా వాడుకోవచ్చు.

### చిలకడదుంప చాట్



**కావాల్సిన పదార్థాలు:**

ఉడకబెట్టి వేయించిన చిలకడదుంప ముక్కలు: ఒక కప్పు, చింతపండు రసం: నాలుగు చెంచాలు, నిమ్మరసం- ఒక చెంచా, చాట్ మసాలా- ఒక చెంచా, ఉప్పు- తగినంత, దానిమ్మ గింజలు- నాలుగు స్పూన్లు, తరిగిన కొత్తిమీర- ఒక స్పూను

**తయారీ విధానం**

చిలకడదుంపను బాగా కడిగి తొక్క తీసేయాలి. దానిని ముక్కలుగా తరగాలి. వాటిని కుక్కర్‌లో ఉడకబెట్టవచ్చు. లేదా నెయ్యి వేసి వేయించవచ్చు.

ఒక గిన్నెలో చిలకడదుంప ముక్కలు, చింతపండు రసం, నిమ్మరసం, చాట్‌మసాలా, ఉప్పు వేసి బాగా కలపాలి. ఆ తర్వాత దానిమ్మ గింజలు, కొత్తిమీర పైన చల్లాలి.

**జాగ్రత్తలు**

చిలకడదుంపలను ఎక్కువ ఉడకబెడితే ముద్దగా అయిపోతాయి. అందువల్ల తక్కువగానే ఉడకబెట్టాలి.

కొందరు ఉడకబెట్టిన తర్వాత నెయ్యి వేసి వేయిస్తారు. అలా చేసినా రుచికరంగానే ఉంటుంది.

### పాలకూర పకోడీ చాట్

**కావాల్సిన పదార్థాలు**

తరిగిన పాలకూర: ఒక కప్పు, శనగపిండి- అరకప్పు, నూనె- ఒక కప్పు, ఉప్పు- తగినంత, పెరుగు- ఒక కప్పు, చింతపండు రసం- రెండు చెంచాలు, జీలకర్ర పొడి- ఒక చెంచా

**తయారీ విధానం**

పాలకూరను బాగా కడిగి దానిలో శనగపిండి, ఉప్పు వేసి కలపాలి. ఒక మూకుడులో నూనెను తీసుకొని, పాలకూర మిశ్రమాన్ని పకోడీల మాదిరిగా వేయించాలి. బయటకు తీసి ప్లేటులో ఉంచాలి.

ఒక గిన్నెలో పాలకూర పకోడీలు వేయాలి. దానిపై పెరుగు, చింతపండు రసం, ఉప్పు, జీలకర్ర పొడి వేయాలి.

**జాగ్రత్తలు**

పకోడీలపై పెరుగు, ఇతర పదార్థాలు వేసిన తర్వాత బాగా కలపకూడదు. దీనివల్ల పకోడీలు మెత్తపడిపోతాయి.

పాలకూరలో శనగపిండిని కలపాలి. అవసరమైతే కొద్దిగా నీళ్లు చిలకరించాలి. అంతే తప్ప శనగపిండిలో పాలకూరను వేసి నీళ్లతో కలపకూడదు.

### లూటిక్కీ చాట్



**కావాల్సిన పదార్థాలు :**

బంగాళదుంప ముక్కలు- రెండు కప్పులు, కార్న్‌ఫ్లోర్- ఒక చెంచా, పచ్చి బఠానీలు- పావుకప్పు, పెరుగు- ఒక కప్పు, చింతపండు రసం- రెండు స్పూనులు, గ్రీన్ చట్నీ (కొత్తిమీర, పుదీనా, పుట్నాల పప్పు, నిమ్మరసంల మిశ్రమం)- రెండు చెంచాలు, కారప్పూస- రెండు చెంచాలు, నూనె- పావు కప్పు, చాట్ మసాలా- ఒక చెంచా, ఉప్పు- తగినంత

**తయారీ విధానం**

బంగాళదుంపలను తొక్క తీసి బాగా ఉడికించాలి. పచ్చి బఠానీలను కూడా ఉడికించాలి. ఇవి రెండూ ఉడికి చల్లారిన తర్వాత ఒక గిన్నెలో బంగాళదుంపలు, పచ్చి బఠానీలు, ఉప్పు, కార్న్‌ఫ్లోర్ వేసి ముద్దగా చేయాలి.

బంగాళదుంపల మిశ్రమాన్ని చిన్న ముద్దలుగా చేసి అరచేతిలో గుండ్రంగా ఒత్తాలి. వీటినే టిక్కీలంటారు.

ఒక పెనంపై నూనె వేసి వేడి చేయాలి. టిక్కీలను సన్నని సెగపై కాల్చాలి.

ఇలా కాల్చిన టిక్కీలను ఒక గిన్నెలో తీసుకొని దానిలో చింతపండు రసం, గ్రీన్ చట్నీ, కారపూస, చాట్ మసాలా, ఉప్పులను వేయాలి.

**జాగ్రత్తలు**

టిక్కీల కోసం కార్న్‌ఫ్లోర్ అందుబాటులో లేకపోతే బియ్యపు పిండిని వేయవచ్చు.

టిక్కీలను బాగా కరకరలాడేలా కాల్చకూడదు. కొద్దిగా మెత్తగా ఉంటేనే బావుంటుంది.




## ఆరోగ్య బీమాపై జీఎస్టీ తగ్గింపు నిర్ణయం వాయిదా..!

ముంబై-నవభూమి:జీవిత బీమా, ఆరోగ్య బీమా పాలసీ ప్రీమియంలపై జీఎస్టీ తగ్గించాలన్న నిర్ణయాన్ని జీఎస్టీ కౌన్సిల్ వాయిదా వేసింది. శనివారం జై సల్మేర్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన 55వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరిగింది. బీమా రంగంపై ఏర్పాటైన మంత్రుల బృందానికి సారథ్యం వహిస్తున్న బీహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి మాట్లాడుతూ జీవిత బీమా, ఆరోగ్య బీమా ప్రీమియంలపై జీఎస్టీ తగ్గింపుపై మరింత చర్చ జరపాల్సిన అవసరం ఉందని శనివారం చెప్పారు. జనవరిలో మరోమారు మంత్రుల బృందం సమావేశం అవుతుందన్నారు. జీఎస్టీ కౌన్సిల్‌లో బీమా ప్రీమియంలపై జీఎస్టీ తగ్గింపుపై ప్రతిపాదించడానికి ముందు మరోసారి తమ మంత్రుల బృందం సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. గ్రూప్ ఇన్సూరెన్స్, వ్యక్తిగత బీమా పాలసీ లేదా సీనియర్ సిటిజన్ల బీమా పాలసీ తదితర అంశాలపై మరోసారి చర్చిస్తామన్నారు. ఇంతకుముందు సామ్రాట్ చౌదరి కన్వీనర్‌గా బీమాపై జీఎస్టీ హేతుబద్ధీకరణ మంత్రుల బృందం.. రూ.5 లక్షల వరకూ సీనియర్ సిటిజన్ల ఆరోగ్య బీమా, టర్మ్ జీవిత బీమా పాలసీపై జీఎస్టీ ఐదు శాతానికి తగ్గించాలని సామ్రాట్ చౌదరి బృందం ప్రతిపాదించింది. బీమా పాలసీల ప్రీమియంలపై జీఎస్టీ తగ్గించడం వల్ల తమ ఆదాయం పడిపోతుందని పలు రాష్ట్రాల ఆర్థిక మంత్రులు అభ్యంతరం వ్యక్తం చేశారు. రూ.5 లక్షలు దాటిన ఆరోగ్య బీమాపై 18 శాతం జీఎస్టీ రేటు యథాతథంగా కొనసాగుతుంది.




## నయా చేతక్ ఎలక్ట్రిక్ స్కూటర్.. ప్రత్యేకతలు ఇవే..



**పూణె-నవభూమి::** ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ బజాజ్ ఆటో..చేతక్ బ్రాండ్‌లో మరో ఎలక్ట్రిక్ స్కూటర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. 35 సిరీస్‌లో భాగంగా సంస్థ విడుదల చేసిన స్కూటర్లు మూడు రకాలు 3501, 3502, 3503గా లభించనున్నాయి. తొలి రెండు స్కూటర్ల ధర వరుసగా రూ.1.27 లక్షలు, రూ.1.20 లక్షలుగా నిర్ణయించిన సంస్థ, మూడో మాడల్ ధరను ప్రకటించలేదు.
ఈ ధరలు బెంగళూరు షోరూంనకు సంబంధించినవి. వీటిలో 3501 రకం ఈ నెల చివరి నుంచి, మరో రకం 3502 మాడల్ వచ్చే నెల నుంచి డెలివరీ చేయనున్నట్లు బజాజ్ ఆటో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాకేశ్ శర్మ తెలిపారు. వచ్చే ఏడాది ఈ-స్కూటర్‌ను ఇతర దేశాలకు ఎగుమతి చేసేయోచనలో సంస్థ ఉన్నట్లు చెప్పారు. ఈ-స్కూటర్ విభాగంలో సంస్థకు 27.6 శాతం వాటా ఉన్నది.

**చేతక్ ఈ-స్కూటర్ ప్రత్యేకతలు**
సింగిల్ చార్జింగ్‌తో 153 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.
3.5 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన ఈ స్కూటర్ గంటకు 73 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించనున్నది.
ఈ స్కూటర్ రూ.1.2-1.27 లక్షల ధరల శ్రేణిలో నిర్ణయించింది.
3.25 గంటల్లో బ్యాటరీ 80 శాతం రీచార్జికానున్నది.
పడిపోతున్న కరెన్సీ విలువ.. కరిగిపోతున్న విదేశీ నిల్వలు విదేశీ మారకం నిల్వలు కరిగిపోతున్నాయి. వరుసగా కొన్ని వారాలుగా తగ్గుతూ వచ్చిన ఫారెక్స్ రిజర్వులు గతవారంలోనూ 2 బిలియన్ డాలర్లకు తరిగిపోయాయి.

## 15 గంటల షిఫ్టులో ఏడ్చాను.. సోషల్ మీడియాలో టెక్ ఉద్యోగి పోస్ట్ వైరల్



ముంబై-నవభూమి:ఒక భారతీయ టెక్ ఉద్యోగి కంపెనీ వ్యవస్థాపకుల్లో ఒకరు ఉద్యోగులతో అసభ్యంగా ప్రవర్తించారని, తరచూ మాటలతో దుర్భాషలాడుతున్నారని ఆరోపించారు. ఆ క్రమంలో 15 గంటల షిఫ్టు సమయంలో మానసిక వేధింపులతో ఇబ్బంది పెట్టేవారని పేర్కొన్నారు. ఆ క్రమంలోనే గూగుల్ మీట్‌లో టెక్ లీడ్ ముందు తాను ఏడ్చానని, మానసిక ఒత్తిడికి గురయ్యానని టెక్ ఉద్యోగి వెల్లడించాడు. అందుకు సంబంధించిన విషయాలను భారతీయ టెక్ ఉద్యోగి ఇటీవల రీడిట్‌లో ఉద్వేగభరితమైన పోస్ట్ చేసి పంచుకున్నారు.

**15 గంటల షిఫ్ట్**
ఇప్పుడు దీన్ని ఎలా ఎదుర్కోవాలో తనకు తెలియడం లేదన్నారు. తన కంపెనీకి చెందిన ముగ్గురు సహ వ్యవస్థాపకుల్లో ఒకరు టెక్ లీడ్‌గా పనిచేస్తున్నారని, తరచూ ఉద్యోగులతో అనుచితంగా ప్రవర్తించేవారని ఆయన అన్నారు. ఆ టెక్ లీడ్స్ తనను, ఇతర ఉద్యోగులను 15 గంటల పాటు పని చేయమని బలవంతం చేశారని, పని గురించి స్పష్టమైన మార్గదర్శకాలు ఏమి లేవని ఆరోపించారు. ఈ క్రమంలో తనకు కన్నీళ్లు తెప్పించిన సంఘటనను గుర్తు చేసుకుంటూ.. ప్రాజెక్టుపై ఎలాంటి సూచనలు లేవని ఫిర్యాదు చేయగా.. సాయం చేయకుండా దూషించారని పేర్కొన్నారు.

**మానసికంగా పని చేయలేని స్థితిలో..**
ఆ క్రమంలో తాను భావోద్వేగాలను నియంత్రించుకోలేకపోయానని, చివరకు తాను పని చేయడానికి మానసికంగా సిద్ధంగా లేనన్నారు. దీంతోపాటు కొన్ని గంటల తర్వాత సెలవు తీసుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో చేసిన ఈ పోస్ట్‌కు అనేక మంది నుంచి పెద్ద ఎత్తున కామెంట్లు వచ్చాయి. చాలా మంది వినియోగదారులు ఒత్తిడిని ఎదుర్కోవాలని, ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవాలని కోరారు. మరికొంత మంది మాత్రం కొత్త ఉద్యోగం వెతుక్కోవాలని సలహా ఇచ్చారు.

**ఫిర్యాదు చేయాలి..**
మరొక యూజర్ అయితే మీ భావోద్వేగాలను వ్యక్తీకరించడం ఫర్వాలేదు. కానీ ఆ ప్రాంతం నుంచి మీరు వెంటనే బయటపడటానికి ప్రయత్నించాలని సూచించారు. వారు మిమ్మల్ని ఒక వనరుగా చూస్తున్నారు. వీలైనంత వరకు మిమ్మల్ని ఉపయోగించుకోవాలని మాత్రమే చూస్తున్నారని పేర్కొన్నారు. మరోకరు దీనిపై స్టార్టప్‌లలో ఎక్కువ గంటలు పని చేస్తున్న ఉద్యోగులు, అనారోగ్య వాతావరణంలో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ప్రస్తావించారు.మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు సమయానికి సరైన నిర్ణయాలు తీసుకోవడం కూడా చాలా అవసరమని పేర్కొన్నారు. పని ప్రదేశాల్లో ఉద్యోగుల పట్ల గౌరవప్రదంగా ప్రవర్తించడం, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా అవసరమని వెల్లడించారు. ఇలాంటి వారి విషయంలో పోలీసులకు ఫిర్యాదు చేయాలని మరికొంత మంది సూచనలు జారీ చేస్తున్నారు.

## జీవిత, ఆరోగ్య బీమాపై పన్ను తగ్గింపు నిర్ణయంలో ట్విస్ట్..



**ముంబై-నవభూమి:**జీఎస్టీ 55వ కౌన్సిల్ సమావేశం జైసల్మేర్‌లో జరుగుతోంది. దీనిలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన అనేక రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఆర్థిక మంత్రులు ఈ భేటీకి హాజరయ్యారు. కౌన్సిల్ ఈ సమావేశం ప్రత్యేకంగా పరిగణించబడింది. ఎందుకంటే ఇందులో ప్రభుత్వం టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్, ఆరోగ్య బీమా, సీనియర్ సిటిజన్ల ఆరోగ్య బీమా ప్రీమియంపై GST రేట్లలో సడలింపు ఇస్తారని ఆశించారు. కానీ ప్రస్తుతం ఈ అంశంపై ఈ సమావేశంలో ఎలాంటివి చర్చించలేదు. తర్వాత GST కౌన్సిల్ సమావేశం వాయిదా పడింది.

**తదుపరి చర్చ**
అయితే జీవిత, ఆరోగ్య బీమా పాలసీ ప్రీమియంలపై పన్ను రేటు తగ్గింపు నిర్ణయాన్ని జీఎస్టీ కౌన్సిల్ శనివారం వాయిదా వేసింది. ఈ మేరకు అధికారులు సమాచారం అందించారు. ఇందుకు సంబంధించి మరికొన్ని సాంకేతిక అంశాలను ప్రస్తావించాల్సి ఉందని జీఎస్టీ కౌన్సిల్ 55వ సమావేశంలో నిర్ణయించారు. దీనికి సంబంధించి తదుపరి చర్చ కోసం జీఓఎంకు బాధ్యతలు అప్పగించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్, రాష్ట్రాలకు చెందిన ఆమె సహచరుల సమక్షంలో ఈ నిర్ణయం తీసుకుంది. గ్రూప్, ఇండివిడ్యువల్, సీనియర్ సిటిజన్ పాలసీలపై పన్ను విధింపుపై నిర్ణయం తీసుకునేందుకు బీమాపై జీఓఎం మరోసారి సమావేశం కానుందని బీహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి తెలిపారు.

**జనవరిలో మరోసారి చర్చ**
కొంతమంది సభ్యులు దీనిపై మరింత చర్చ అవసరమని చెప్పారని సామ్రాట్ చౌదరి అన్నారు. ఈ క్రమంలో దీనిపై తాము జనవరిలో మళ్లీ చర్చిస్తామని వెల్లడించారు. కౌన్సిల్ చౌదరి అధ్యక్షతన బీమాపై మంత్రుల బృందాన్ని (%+శీవీ%) ఏర్పాటు చేసింది. నవంబర్‌లో జరిగిన సమావేశంలో టర్మ్ జీవిత బీమా పాలసీల బీమా ప్రీమియంను %+ూ% నుంచి మినహాయించాలని అంగీకరించింది. దీంతోపాటు ఆరోగ్య బీమా రక్షణ కోసం సీనియర్ సిటిజన్లు చెల్లించే ప్రీమియంను పన్ను నుంచి మినహాయించాలని కూడా ప్రతిపాదించబడింది.


**ప్రీమియంలపై 18 శాతం జీఎస్టీ**
సీనియర్ సిటిజన్లు కాకుండా ఇతర వ్యక్తులకు రూ. 5 లక్షల వరకు ఆరోగ్య బీమా కోసం చెల్లించే ప్రీమియాన్ని జీఎస్టీ నుంచి మినహాయించే ప్రతిపాదన ఉంది. అయితే రూ. 5 లక్షల కంటే ఎక్కువ ఆరోగ్య బీమా కవరేజీ ఉన్న పాలసీలకు చెల్లించే ప్రీమియంలపై 18 శాతం జీఎస్టీ కొనసాగుతుంది. ఈ క్రమంలో వచ్చే నెలలో జరిగే భేటీలోనైనా ఈ బీమాలను జీఎస్టీ నుంచి మినహాయిస్తారా లేదా అనేది చూడాలి మరి. ఇప్పటికే అనేక రోజులుగా పలు రకాల బీమాల నుంచి జీఎస్టీ తొలగించాలని డిమాండ్లు వచ్చాయి.

## హెూండా కార్లు ప్రియం



**ముంబై-నవభూమి:** వచ్చే నెల నుంచి వాహన ధరలను 2 శాతం వరకు పెంచబోతున్నట్లు హెూండా కార్స్ ఇండియా ప్రకటించింది.
ఉత్పత్తి వ్యయం పెరగడంతోపాటు లాజిస్టిక్ ఖర్చులు అధికమవడంతో సంస్థపై పడుతున్న భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ వైస్ ప్రెసిడెంట్ కునల్ బెహ్ల తెలిపారు. ప్రస్తుతం సంస్థ అమేజ్, సిటీ, ఎలివేట్ మాడళ్లను దేశీయంగా విక్రయిస్తున్నది.

## పడిపోతున్న కరెన్సీ విలువ.. కరిగిపోతున్న విదేశీ నిల్వలు



**ముంబై-నవభూమి:** విదేశీ మారకం నిల్వలు కరిగిపోతున్నాయి. వరుసగా కొన్ని వారాలుగా తగ్గుతూ వచ్చిన ఫారెక్స్ రిజర్వులు గతవారంలోనూ 2 బిలియన్ డాలర్లకు తరిగిపోయాయి. దీంతో ఈ నెల 13తో ముగిసిన వారాంతానికిగాను విదేశీ మారకం నిల్వలు 1.988 బిలియన్ డాలర్లు తగ్గి 652.869 బిలియన్ డాలర్లకు పడిపోయాయని రిజర్వు బ్యాంక్ వారాంతపు సమీక్షలో వెల్లడించింది. అంతక్రితం వారంలోనూ రిజర్వులు 3.235 బిలియన్ డాలర్లు తగ్గిన విషయం తెలిసిందే.డాలర్‌తో పోలిస్తే ఇతర కరెన్సీలు తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనుకావడంతో విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ 3.047 బిలియన్ డాలర్లు పతనమై 562.576 బిలియన్ డాలర్లకు తగ్గాయని పేర్కొంది. కానీ, పసిడి రిజర్వులు 1.121 బిలియన్ డాలర్లు ఎగబాకి 68.056 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. సెప్టెంబర్‌లో 704.885 బిలియన్ డాలర్లకు చేరుకున్న రిజర్వులు గడిచిన నాలుగు నెలల్లో ఏకంగా 50 బిలియన్ డాలర్లకు పైగా తగ్గాయి.

## బంగారం కొనేందుకు బెస్ట్ టైమ్.. ఈ ఛాన్స్ మళ్లీ రాదు



**ముంబై-నవభూమి:**బంగారం అంటే ఎవరికి ఇష్టం ఉండదు చెప్పండి? అయితే ఇతర దేశాలతో పోలిస్తే మన దగ్గర మాత్రం గోల్డ్‌కు భారీ డిమాండ్ ఉంటుంది. పసిడితో భారతీయులకు విడదీయరాని సంబంధం ఉంది. పెళ్లిళ్ల దగ్గర నుంచి వేడుకలు, శుభకార్యాల వరకు ఏదైనా పసిడి బంగారు ఆభరణాలు లేకుండా అవ్వదు. ముఖ్యంగా మహిళలు వీటిని బాగా ఇష్టపడుతుంటారు. గోల్డ్ అనేది మన దగ్గర స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. అదే సమయంలో దీన్ని ఇన్వెస్ట్‌మెంట్‌గా చూడటం పెరిగింది. అందుకే బంగారానికి డిమాండ్ ఎక్కువవుతోంది. అయితే ధర విషయంలో గోల్డ్ ఊహించని రీతిలో పెరుగుతూ షాక్ ఇస్తోంది. కానీ ఎట్టకేలకు పసిడి దిగొచ్చింది.

**రీజన్ అదే..**
బంగారం ధరలు భారీగా పడిపోయాయి. ఆ మధ్య వరుసగా పెరుగుతూ పోయిన గోల్డ్.. ఈజీగా రూ.80 వేల మార్క్‌ను అందుకుంటుందని అంతా భావించారు. అయితే పలు అంతర్జాతీయ పరిణామాల వల్ల పసిడి దిగొచ్చింది. భారీగా ధరలు పతనమయ్యాయి. యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్లను మరోసారి తగ్గించింది. ఫ్యూచర్‌లో ఇంతలా తగ్గింపులు ఉండకపోవచ్చనే సిగ్నల్స్ ఇచ్చింది. దీంతో గోల్డ్ రేట్స్ వరుసగా పడుతున్నాయి. మూడ్రోజులుగా తగ్గుతూ వస్తున్న పసిడి.. ఇప్పుడు రూ.75 వేల మార్క్‌ను చేరుకునేలా కనిపిస్తోంది. హైదరాబాద్‌లో ఇవాళ 24 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.76,800గా నమోదైంది.

**వెండీ అదే దారిలో..**
డిసెంబర్ 21వ తేదీన భాగ్యనగరంలో 22 క్యారెట్ల పసిడి ధర రూ.70,400కు చేరింది. నిన్నటితో పోలిస్తే బంగారం తాజాగా రూ.300 పతనమైంది. అటు వెండి కూడా భారీగా పతనమైంది. హైదరాబాద్‌లో కిలో వెండి రూ.98 వేల దగ్గర ఉంది. అదే దేశ రాజధాని న్యూఢిల్లీలో కేజీ సిల్వర్ రూ.1,000 మేర తగ్గి రూ.90,500కు చేరింది. ఈ ధరలన్నీ శనివారం ఉదయం 6 గంటల లోపు నమోదైనవి. కాగా, గోల్డ్, సిల్వర్ రేట్స్ ఒక్కోసారి మధ్యాహ్నానికే మారిపోయే అవకాశం ఉంటుంది. కాబట్టి కొనాలనుకుంటే స్థానికంగా ధరలు తెలుసుకొని ముందుకెళ్లడం మంచిది.

## గూగుల్ లేఆఫ్స్.. మరో పది శాతం మంది ఉద్యోగులు ఇక ఇంటికే..!



**ముంబై-నవభూమి:** గ్లోబల్ టెక్ దిగ్గజం 'గూగుల్' తాజాగా సంస్థలో 10 శాతం మంది ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటించింది. ఇందులో మేనేజర్ స్థాయి పోస్టులు, డైరెక్టర్లు, వైస్ ప్రెసిడెంట్లు కూడా ఉంటారని గూగుల్ వర్గాల కథనం. ఇటీవల అన్ని విభాగాల అధిపతులతో జరిగిన సమావేశంలో ఉద్యోగుల ఉద్వాసన నిర్ణయం తీసుకున్నట్లు గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ కూడా ధృవీకరించారు. ఓపెన్‌ఏఐ మాదిరిగా ఏఐ ఫోకస్డ్ సంస్థల నుంచి వస్తున్న పోటీని తట్టుకుని ఆపరేషన్స్ క్రమబద్ధీకరించేందుకు ఉద్యోగులను తొలగిస్తున్నట్లు తెలిపారు.
రెండేండ్లుగా విస్తృత ప్రాతిపదికన సంస్థ పునర్వ్యవస్థీకరణ వ్యూహంలో భాగంగా గూగుల్ ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతున్నది. వ్యక్తిగత కంట్రిబ్యూటర్ రోల్స్ వంటి కొన్ని ఉద్యోగాలను పూర్తిగా తొలగిస్తారని గూగుల్ అధికార ప్రతినిధి తెలిపారు. 2022 సెప్టెంబర్ నెలలో గూగుల్ 20 శాతం మరింత శక్తిమంతంగా మారాలని భావిస్తున్నట్లు అప్పట్లోనే సుందర్ పిచాయ్ చెప్పారు. తదనుగునంగా గతేడాది జనవరిలో 12 వేల మంది ఉద్యోగులను గూగుల్ తొలగించింది. 2024లో 539 టెక్ కంపెనీలు 1,50,034 మంది ఉద్యోగులను తొలగించాయని లేఆఫ్స్ డాట్ కామ్ తెలిపింది. గతేడాది 1,193 కంపెనీలు 2,64,220 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికాయి.

## స్టాక్ మార్కెట్ల నష్టాల పరంపర.. ఆవిరైన 18 లక్షల కోట్లు

### గత ఐదు రోజులో మదుపరుల నష్టపోయిన సంపద

### 4 వేల పాయింట్లకు పైగా నష్టపోయిన సెన్సెక్స్



**ముంబై-నవభూమి:** స్టాక్ మార్కెట్ల నష్టాల పరంపర కొనసాగుతున్నది. వచ్చే ఏడాది రేట్లను ఆశించిన స్థాయిలో కోతలు ఉండకపోవచ్చన్న అమెరికా ఫెడరల్ రిజర్వు సంకేతాలు ఇవ్వడం మదుపరుల్లో సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీంతో వరుసగా అంతర్జాతీయ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవుతుండటం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల భారీగా తమ పెట్టుబడులను తరలించుకుపోతుండటంతో వరుసగా ఐదోరోజూ శుక్రవారం సూచీలు నష్టాలు ఏరులైపారాయి.
ఇంట్రాడేలో 1,300 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 1,176. 46 పాయింట్లు లేదా 1.49 శాతం పతనం చెంది 79 వేల పాయింట్ల దిగువకు 78,041. 59 వద్ద ముగిసింది. మరోసూచీ నిఫ్టీ కూడా 364.20 పాయింట్లు లేదా 1.52 శాతం కోల్పోయి 23,587.50 వద్ద ముగిసింది.
దీంతో వరుసగా ఐదు రోజుల్లో మదుపరులు రూ.18 లక్షల కోట్లకు పైగా సంపదను కోల్పోయారు. దీంతో బీఎస్ఈలో లిట్కస్టైన సంస్థల మార్కెట్ విలువ రూ.18,43,121. 27 కోట్లు కరిగిపోయి రూ.4,40,99,217. 32 కోట్లకు(5.18 ట్రిలియన్ డాలర్లు)కు పడిపోయింది. గత ఐదు సెషన్లలో సెన్సెక్స్ 4,091.53 పాయింట్లు లేదా 4.98 శాతం, నిఫ్టీ 1,180.8 పాయింట్లు లేదా 4.76 శాతం కోల్పోయింది.

## భారత్ మొబిలిటీ ఎక్స్‌పోలో మారుతి ఎలక్ట్రిక్ విటారా ఆవిష్కరణ





న్యూఢిల్లీ: కంపెనీకి చెందిన తొలి ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ ఈ-విటారాను ప్రవేశపెట్టడంతో పాటు సమాంతరంగా చార్జింగ్ స్టేషన్లు, హెూమ్ చార్జింగ్ సొల్యూషన్లు అందుబాటులోకి తెస్తామని దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకీ ప్రకటించింది. త్వరలో ఢిల్లీలో జరగబోయే భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో ఈ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని ఆవిష్కరించనున్నట్టు కంపెనీ తెలిపింది. ఇది ప్రపంచ మార్కెట్ల కోసం భారత్‌లో తయారైన గ్లోబల్ మోడల్ అని పేర్కొంది. ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగాన్ని ప్రోత్సహించాలంటే కస్టమర్లకు బ్యాటరీ విద్యుత్ వాహన యాజమాన్యాన్ని సరళం చేయాలన్నద తమ అభిప్రాయమని కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్, సేల్స్) పార్థో బెనర్జీ చెప్పారు. సరైన చార్జింగ్ మౌలిక వసతులు లేకపోవడమే ఈవీ వినియోగానికి పెద్ద అవరోధమని ఆయన అన్నారు. అధిక శాతం కస్టమర్లకు ఈవీలు అందుబాటులో, సౌకర్యవంతంగా ఉండేలా చూడాలన్నది తమ ఆలోచన అని చెప్పారు.

## రూ.18.43 లక్షల కోట్లు హుష్ కాకి



**ముంబై-నవభూమి:** మార్కెట్లలో అమెరికన్ ఫెడ్ సృష్టించిన కల్లోలం ఆగలేదు. ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన ప్రతికూల సంకేతాల ప్రభావంతో వరుసగా ఐదో రోజు కూడా స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాలు నమోదు చేశాయి. రిస్క్ తీసుకునేందుకు విముఖంగా ఉన్న ఇన్వెస్టర్లు భారీగా అమ్మకాలు సాగించారు. దీనికి తోడు ఎఫ్‌పీఐల నిధుల తరలింపు సైతం యధేచ్ఛగా కొనసాగింది. ఫలితంగా శుక్రవారం సెన్సెక్స్ 1,176.46 పాయింట్లు దిగజారి 78,041.59 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 1343.46 పాయింట్ల నష్టంతో 77,874.59 పాయింట్ల కనిష్ఠ స్థాయిని నమోదు చేసింది. నిఫ్టీ 364.20 పాయింట్ల నష్టంతో 23,587.50 వద్ద క్లోజైంది. రెండేళ్ల కాల పరిమితిలో ఒక వారంలో ఈక్విటీ మార్కెట్‌కు ఏర్పడిన భారీ నష్టం ఇదే. బీఎసఈలో లిస్టయిన షేర్లలో 2,950 షేర్లు నష్టాల్లో ముగియగా 1,045 షేర్లు మాత్రం లాభపడ్డాయి. ఐదు రోజుల వరుస నష్టాల కారణంగా సెన్సెక్స్ 4,091.53 పాయింట్లు నష్టపోగా నిఫ్టీ 1,181 పాయింట్లు నష్టపోయింది. బీఎసఈలో లిస్టయిన కంపెనీల మార్కెట్ సంపద రూ. 18,43,121.27 కోట్లు తుడిచి పెట్టుకుపోయి రూ.4,40,99,217.32 కోట్లకు (5.18 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.సెన్సెక్స్‌లోని 30 షేర్లలో జేఎసడబ్ల్యూ స్టీల్, నెస్లె, టైటాన్ మినహా మిగతా 27 షేర్లు నష్టాల్లోనే ముగిశాయి. బీఎ సఈ మిడ్‌క్యాప్ సూచీ 2.43 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 2.11 శాతం నష్టపోయాయి.అన్ని రంగాల వారీ సూచీలు కూడా నష్టాల్లోనే ముగిశాయి. రియల్టీ ఇండెక్స్ భారీగా 4.07 శాతం నష్టపోయింది. పవర్ (3.55%), యంత్రపరికరాలు (3.02%), ఇండస్ట్రియల్స్ (2.67్న), ఐటీ (2.51%), కన్స్యూమర్ డిస్‌క్రెషనరీ (2.32%), సర్వీసెస్ (2.29%) నష్టపోయాయి. ఫెడ్ చీఫ్ వడ్డీ రేట్లపై ప్రకటించిన కఠిన వైఖరితో పాటు అమెరికా అధ్యక్షుడుగా పగ్గాలు చేపట్టబోతున్న డొనాల్డ్ ట్రంప్ తాను అనుసరించనున్న ఆర్థిక, వాణిజ్య విధానాలపై ప్రకటించిన అభిప్రాయాల ఫలితంగా డాలర్ నిరంతరం బలపడుతూ రావడం కూడా మార్కెట్‌ను కుంగదీస్తోందని విశ్లేషకులంటున్నారు. దీంతో విదేశీ ఇన్వెస్టర్లు స్థానిక మార్కెట్ నుంచి వైదొలగి డాలర్ ఆస్తుల్లో తమ సొమ్ము ఇన్వెస్ట్ చేస్తున్నారు. స్టాక్ ఎక్స్ఛేంజీల వద్ద అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం విదేశీ ఇన్వెస్టర్లు గురువారం రూ.4224.92 కోట్ల విలువ గల షేర్లు విక్రయించారు.

## పాప్‌కార్న్ సహా పలు వస్తువులపై జీఎస్టీ బాదుడు..



**ముంబై-నవభూమి:**రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన నేడు జీఎస్టీ కౌన్సిల్ 55వ సమావేశం కొనసాగుతోంది. ఇందులో పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. వీటిలో బ్లాక్‌లు, ఫోర్టిఫైడ్ రైస్, ఫ్లేవర్డ్ పాప్‌కార్న్‌లపై పన్ను రేట్లపై స్పష్టత వచ్చింది. ఈ నేపథ్యంలో 50% కంటే ఎక్కువ ఫ్లై యాష్ కంటెంట్ ఉన్న ఆటోక్లేవ్డ్ ఎరేటెడ్ కాంక్రీట్ బ్లాక్‌లు కోడ్ 6815 కిందకు వస్తాయని పేర్కొన్నారు. వీటిపై 18 శాతానికి బదులుగా 12 శాతం తక్కువ రేటును వసూలు చేసేందుకు కౌన్సిల్ అంగీకరించింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
7 హైదరాబాద్
ఆదివారం
22 । డిసెంబర్ । 2024



## ట్రుడోకు పదవీ గండం.. ప్రభుత్వాన్ని పడగొడతామన్న జగ్మీత్ సింగ్ ఇంటా

**టొరంటో-నవభూమి:** ఇంటా.. బయటా తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడోకు పదవీగండం పొంచిఉన్నది. ఇప్పటికే ఉప ప్రధాని, ఆర్థిక మంత్రి క్రిస్టియా ఫ్రీలాండ్ తన పదవికి రాజీనామా చేసి ట్రుడోకు షాకివ్వగా.. తాజాగా మిత్రపక్షమైన న్యూ డెమోక్రటిక్ పార్టీ నుంచి గట్టి దెబ్బే తగిలేట్లుంది. ట్రుడో నేతృత్వంలోని లిబరల్ ప్రభుత్వంపై అవిశ్వాసానికి సిద్ధమవుతున్నది. శీతాకాల విరామం ముగిసిన వెంటనే హౌస్ ఆఫ్ కామన్స్‌లో జనవరి 27న అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనుంది. ఈ మేరకు ఖలిస్థానీ మద్దతుదారు, ఎన్‌డీపీ నేత జగ్మీత్ సింగ్ ఎక్స్ వేదికగా ప్రకటించారు. ఆ తీర్మానానికి అన్ని పార్టీలు మద్దతిచ్చినట్లయితే 9 ఏండ్ల ట్రుడో పాలనకు ఎండ్ కార్డ్ పడ్డట్లే.లిబరల్ పార్టీ నాయకుడు ఎవరనేది తమకు ప్రధానం కాదని, ఈ ప్రభుత్వానికి గడువు ముగిసిందని జగ్మీత్ సింగ్ చెప్పారు. తదుపరి సమావేశాల్లో హౌస్ కామన్స్‌లో అవి శ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడుతామని వెల్లడించారు. ప్రధాని పద విని సమర్థవంతంగా నిర్వహించడంలో ట్రుడో విఫలమ య్యారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చలేకపోయారు. ఈ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి ఎన్‌డీపీ ఓటు వేస్తుందని, తమ కోసం పనిచేసే కొత్త సర్కారును ఎన్నుకోవడానికి కెనడా ప్రజ లకు అవకాశం ఇస్తామని తెలిపారు. శీతాకాల విరామం ముగి సిన వెంటనే హౌస్ ఆఫ్ కామన్స్‌లో జనవరి 27న అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతామన్నారు.ట్రూడో తన పదవికి రాజీ నామా చేయాలని ఆయన ఇప్పటికే డిమాండ్ చేశారు. దేశంలో తీవ్రమైన ఆర్థిక సమస్యలు ఉన్నాయని, ఇండ్లు, నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరగడం, ట్రంప్ భారీ టారీఫ్ లు విధిస్తామని హెచ్చరించడంతో దేశ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు.

## జమిలి ఎన్నికలను తీవ్రంగా వ్యతిరేకిస్తాం




**న్యూఢిల్లీ-నవభూమి:**'ఒకే దేశం, ఒకే ఎన్నిక' అనేది రాజ్యాంగ మూల స్వరూపానికి విరుద్ధమని, ఈ ఆలోచనను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామని కాంగ్రెస్ శుక్రవారం స్పష్టం చేసింది. ఒకే దేశం, ఒకే ఎన్నిక ఆలోచన అనేది ప్రజాస్వామ్య వ్యతిరేకమే కాకుండా సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొంది. జమిలి ఎన్నికలు నిర్వహించేలా యంత్రాంగాన్ని ఏర్పాటు చేసే బిల్లులను ప్రవేశపెట్టే సమయంలో 272 మంది ఎంపీలను కూడబెట్టలేకపోయిన ప్రభుత్వం.. రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీని ఎలా సమకూర్చుకుంటుందని జైరామ్ రమేష్ ప్రశ్నించారు. ఇదిలా ఉండగా.. రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌పై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అభిశంసన తీర్మానం నోటీసు కేవలం ట్రైలర్ మాత్రమేనని జైరామ్ రమేష్ అన్నారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో చైర్మన్‌పై మళ్లీ విపక్షాలు అభిశంసన నోటీసు ఇచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

## అమిత్‌షా వ్యాఖ్యలపై కాంగ్రెస్ దేశవ్యాప్త నిరసన 24న



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ పై కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా రాజ్యసభలో చేసిన వ్యాఖ్యల దుమారం ఇప్పట్లో తగ్గేలా కనిపించడం లేదు. అమిత్‌షా వ్యాఖ్యలపై కొనసాగిస్తున్న నిరసనలను మరింత తీవ్రతరం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఇందులో భాగంగా డిసెంబర్ 24న దేశవ్యాప్తంగా ఆ పార్టీ నిరసనలను చేపట్టనుంది. అమిత్‌షా వ్యాఖ్యలపై పార్టీ ఎంపీలు, సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యులు డిసెంబర్ 22, 23 తేదీల్లో మీడియా సమావేశాలు ఏర్పాటు చేయనున్నారు.దేశంలోని అన్ని జిల్లాల్లోనూ 'బాబాసాహెబ్ అంబేడ్కర్ సమ్మాన్ మార్చ్' నిర్వహించాలని కోరుతూ పార్టీ నేతలందరికీ ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) కెసీ వేణుగోపాల్ ఒక సర్క్యులర్ జారీ చేశారు. అంబేడ్కర్ విగ్రహాలకు పుష్పమాలలు వేసి మార్చ్ ప్రారంభించాలని, జిల్లా మెజిస్ట్రేట్లకు మెమొరాండం సమర్పించేంత వరకూ మార్చ్ కొనసాగించాలని ఆయన సూచించారు. ప్రెస్ కాన్ఫరెన్స్‌లలో ఆయా నియోజకవర్గాలకు చెందిన ఎంపీలు, సీడబ్ల్యూసీ సభ్యులు పాల్గొంటారు.

**పార్లమెంటులో రగడ**

ఈనెల 20వ తేదీతో పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో భాగంగా కేంద్ర మంత్రి అమిత్‌షా డిసెంబర్ 18న రాజ్యసభలో చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. అంబేడ్కర్ పేరును పదేపదే ప్రస్తావించడం కాంగ్రెస్‌కు ఒక ఫ్యాషన్‌గా మారిందని షా విమర్శించారు. దేవుడి పేరు పదేపదే వల్లె వేస్తే స్వర్గమైనా దొరుకుతుందని అన్నారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, అంబేడ్కర్‌ను అమమానించినందుకు అమిత్‌షా క్షమాపణ చెప్పాలని, తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. పార్లమెంటు వెలుపల వినూత్న రీతిలో రోజువారీ నిరసనలకు దిగింది. ఈ క్రమంలోనే పార్లమెంటు ఆవరణలో ఎంపీల మధ్య బాహాబాహీ చోటుచేసుకుంది. బీజేపీ ఎంపీలు ప్రతాప్ సారంగి, ముఖేష్ రాజ్‌పుత్‌లు గాయపడ్డారు. పార్లమెంటుకు వెళ్తుండగా తనను కూడా గెంటినట్టు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. ఇరువర్గాల వారు పార్లమెంటు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదులు నమోదు చేశారు.

## బీఎంసీ ఎన్నికల్లో ఉద్ధవ్ శివసేన సోలో ఫైట్



**ముంబై-నవభూమి:** మహారాష్ట్రలోని 'మహా వికాస్ అఘాడి' లో లుకలుకలు మొదలయ్యాయని ప్రచారం జరుగుతున్న క్రమంలో బ్రిహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలపై శివసేన కీలక సంకేతాలు ఇచ్చింది. బీఎంసీ ఎన్నికల్లో తమ పార్టీ ఒంటరిగా పోటీ చేసే అవకాశం ఉందని ఆ పార్టీ నేత సంజయ్ రౌత్ శనివారంనాడు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పొత్తుల్లేకుండా వెళ్లాలని పార్టీ కార్యకర్తలు కోరుతున్నారని, లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో కంటే స్థానిక సంస్థల్లో పోటీకి ఎక్కువ మంది ఆశావహులు ఉన్నారని చెప్పారు. బీజేపీతో అవిభక్త శివసేన పొత్తు ఉన్నప్పుడు కూడా బీఎంసీ, ఇతర మున్సిపల్ కార్పొరేషన్లలో తమ పార్టీ స్వతంత్రంగానే పోటీ చేసిందని గుర్తుచేశారు.

'బీఎంసీ ఎన్నికల కోసం (ఒంటరిగా పోటీకి వెళ్లడంపై) ఉద్ధవ్ థాకరే, ఇతర పార్టీ నేతల మధ్య చర్చలు జరుగుతున్నాయి. సోలోగా ఎన్నికలకు వెళ్లాలని పార్టీ కార్యకర్తలు కోరుతున్నారు" అని సంజయ్ రౌత్ తెలిపారు. ఆర్థికంగా గట్టి సత్తా ఉన్న బీఎంసీ 1997 నుంచి 2022 వరకూ అవిభక్త శివసేన చేతుల్లోనే ఉంది. బీఎంసీకి గతంలో ఎన్నికైన ప్రతినిధుల పదవీకాలం 2022 మార్చితో ముగిసింది. మూడేళ్ల తర్వాత ఇప్పుడు బీఎంసీ ఎన్నికలు జరగనున్నాయి.

**ముంబైలో గెలుపు సాధించాల్సిందే..**ముంబైలో తమ పార్టీకి గట్టి బలం ఉందని, ముంబై నుంచి పార్టీకి అసెంబ్లీ ఎన్నికల్లో మరిన్ని సీట్లు తమకు ఇచ్చుంటే వాటిని గెలిచేవాళ్లమని సంజయ్ రౌత్ అన్నారు. ముంబైలో పార్టీ గెలుపు అనివార్యమని, లేదంటే ముంబై సిటీని మహారాష్ట్ర నుంచి వేరుచేయవచ్చని చెప్పారు. ముంబైలో శివసేన 24 సీట్లలో (అసెంబ్లీ) పోటీ చేయగా 10 స్థానాలు గెలుచుకుంది. కాంగ్రెస్ 10 స్థానాల్లో పోటీ చేసి 4 చోట్ల గెలిచింది. ఎన్‌సీపీ (ఎస్‌పీ) రెండు చోట్ల పోటీ చేసి రెండూ ఓడిపోయింది.

# అమెరికా 'తెరుచుకుంది'.. మళ్లీ ఆ గండం తప్పింది..



**వాషింగ్టన్-నవభూమి:**ఆర్థిక బిల్లుల చెల్లింపు ఆగిపోవడం అంటే ఏ దేశానికైనా అవమానమే.. అందులోనూ అగ్రరాజ్యంలో ఇలా జరిగిందంటే మరింత పరువు తక్కువ.. పైగా ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఆగిపోయే పరిస్థితి వస్తే ఇంకెంత అప్రదిష్ఠ..? అది కూడా ఆరేళ్లలో రెండోసారి ఇలాంటి పరిస్థితి తలెత్తిందంటే ఏమనుకుంటారు..? ఎక్కడో ఆఫ్రికా దేశాల్లో అయితే, ఎవరూ పట్టించుకోరు..? కానీ, అమెరికాలో జరిగితే అందరూ నోరెళ్లబెడతారు.. రెండో గండం తప్పింది.. అమెరికాకు 2016-20 మధ్యన అధ్యక్షుడిగా పనిచేశారు డొనాల్డ్ ట్రంప్. ఆ సమయంలో 2018-19 మధ్య 35 రోజుల పాటు ప్రభుత్వం స్తంభించింది. దీనిని వారి భాషలో షట్ డౌన్ అని పిలుస్తారు. ఇది అమెరికా చరిత్రలోనే సుదీర్ఘ షట్ డౌన్. ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితే వచ్చింది. కానీ, త్రుటిలో గండం తప్పింది. బిల్లు పాస్.. అందరూ రిలాక్స్.. అమెరికాలో షట్ డౌన్ గండం తప్పింది. ప్రభుత్వ కార్యకలాపాలు, జీతాలకు సంబంధించిన కీలక బిల్లుకు ఆ దేశఅ కాంగ్రెస్ ఆమోదం తెలపడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాబోయే అధ్యక్షుడు ట్రంప్ డిమాండ్లతో నిలిచిపోయిన కీలక నిధుల బిల్లును ప్రతినిధుల సభ చివరి నిమిషంలో ఆమోదించింది. దీనికి గడువు అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం అర్ధ రాత్రి. అయితే, తీవ్ర ప్రతిష్ఠంభన నెలకొనడంతో ఆలోగా ఆమోదం దక్కుతుందా? అని అందరూ ఉత్కంఠ ఎదుర్కొన్నారు. షట్ డౌన్ తప్పదని భావించారు. కానీ, ఇదే గడువుకు కొన్ని గంటల ముందు శుక్రవారం సాయంత్రం ప్రతినిధుల సభ స్పీకర్ మైక్ జాన్సన్ ప్రవేశపెట్టిన కొత్త ప్రణాళికకు సభ్యుల ఆమోద ముద్ర పడింది. ట్రంప్ చెప్పినట్లు కాకుండా.. ప్రతినిధుల సభ బిల్లును ఆమోదించినా.. కాబోయే అధ్యక్షుడు ట్రంప్ లేవనెత్తిన డిమాండ్లను మాత్రం ఇందులో నుంచి తొలగించింది. ఇక ప్రతినిధుల సభ నుంచి బిల్లును సెనెట్ కు పంపగా అక్కడా ఆమోదం దక్కింది. తద్వారా అమెరికాకు షట్ డౌన్ ముప్పు తొలగింది. ఇంతకూ ఏమిటీ బిల్లు? ప్రభుత్వ కార్యకలాపాలు, జీతాలకు సంబంధించి ప్రభుత్వానికి నిధులు సమకూర్చేలా బైడెన్ ప్రభుత్వం బిల్లును తేగా.. ట్రంప్ తిరస్కరించారు. సమాఖ్య ప్రభుత్వ కార్యకలాపాలకు నిధులు సమకూర్చడంతోపాటు, వివిధ ఆర్థిక బాధ్యతలు నిర్వర్తించేందుకు ఈ బిల్లులో రెండేళ్ల పాటు రుణాలపై పరిమితి ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. దీంతో ట్రంప్ ప్రతిపాదనను చేరుస్తూ ప్రతినిధుల సభ స్పీకర్ మైక్ జాన్సన్ గురువారం సరికొత్త బిల్లును సభలో పెట్టారు. కానీ, 235-174తో తిరస్కరించింది. ట్రంప్ పార్టీ (రిపబ్లికన్)కి చెందిన 38 మంది సభ్యులు డెమోక్రాట్లతో కలిసి బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయడం గమనార్హం. దీంతో షట్ డౌన్ తప్పదనే అభిప్రాయం వ్యక్తమైంది. కానీ, ట్రంప్ కాస్త వెనక్కి తగ్గారు. బిల్లులో మార్పులు చేశారు. ట్రంప్ డిమాండ్లను తొలగించి సమాఖ్య కార్యకలాపాలకు నిధులు, విపత్తు సహకారం వంటి అంశాలతో 118 పేజీల మరో కొత్త ప్యాకేజీ బిల్లును స్పీకర్ ప్రవేశపెట్టారు. 366-34తో ప్రతినిధుల సభ ఆమోదం తెలిపింది. మెజార్టీ రిపబ్లికన్లు అనుకూలంగా ఓటేశారు. ఇక సెనేట్ లో బైడెన్ పార్టీ అయిన డెమోక్రాట్ల సభ్యులే ఆధిక్యంలో ఉన్నారు. అక్కడ 85-11తో ఆమోదం దక్కింది. ఇప్పుడు అధ్యక్షుడు బైడెన్ వద్దకు చేరింది ఫైలు. ఆయన సంతకం చేయడం

## ఈ ఏడాది 17వ విద్యార్థి సూసైడ్.. కోటాలో ఏం జరుగుతోంది..




**న్యూఢిల్లీ-నవభూమి:**రాజస్థాన్‌లోని కోటాలో ఓ 16 ఏళ్ల ఐఐటీ జేఈఈ విద్యార్థి సూసైడ్ చేసుకున్నారు. శుక్రవారం విద్యార్థి తన హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇది ఆత్మహత్యగా భావిస్తున్నారు. అయితే ఇప్పటివరకు ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదు. విచారణ కొనసాగుతోందని, విద్యార్థి మృతి చెందడానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు పేర్కొన్నారు. అయితే కోటాలో కోచింగ్ తీసుకున్న విద్యార్థుల్లో ఆత్మహత్య చేసుకున్న వాటిలో ఇది 17వ కేసు కావడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. గతేడాది ఇదే నగరంలో కోచింగ్ తీసుకున్న విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్న ఘటనలు 26 నమోదయ్యాయి.

**సీలింగ్ ఫ్యాన్‌కు**

కోటా నగరంలోని విజ్ఞాన్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తన హాస్టల్ గదిలో విద్యార్థి మృతదేహం వేలాడుతూ కనిపించింది. మృతుడు 11వ తరగతి చదువుతున్నాడని, బీహార్‌లోని వైశాలి జిల్లా వాసి అని విజ్ఞాన్ నగర్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ముఖేష్ మీనా మీడియాకు తెలిపారు. గదిలో ఆత్మహత్య నిరోధక పరికరాన్ని అమర్చగా, బాలుడు సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. గత ఏడాది విద్యార్థుల ఆత్మహత్యల కేసుల పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని, జిల్లా యంత్రాంగం అన్ని హాస్టళ్లు, పేయింగ్ గెస్ట్ (పీజీ) నివాసాలకు గదుల్లో స్ప్రింగ్‌లోడెడ్ ఫ్యాన్‌లను ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు కూడా జారీ చేసింది.

**ఈ ఏడాది 17వ ఆత్మహత్య కేసు**

ఈ ఘటనల నేపథ్యంలో కోటా జిల్లా యంత్రాంగం, రాజస్థాన్ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకున్నప్పటికీ, కోటాలో మాత్రం విద్యార్థుల ఆత్మహత్య కేసులు ఆగడం లేదు. తప్పనిసరి స్క్రీనింగ్ పరీక్షలు, ర్యాంకింగ్ ఆధారిత క్రమబద్ధీకరణకు బదులు విద్యార్థులను అక్షర క్రమంలో క్రమబద్ధీకరించడం అంశాలు వెలుగులోకి వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ పరిస్థితిని గుర్తించింది. జనవరిలో కేంద్ర విద్యా మంత్రి కోచింగ్ సెంటర్లకు మార్గదర్శకాలను జారీ చేశారు. వాటిని 16 ఏళ్లు పైబడిన విద్యార్థులను మాత్రమే చేర్చుకోవాలని, ఉల్లంఘనకు పాల్పడితే రూ. 1,00,000 జరిమానా విధిస్తామని ప్రకటించారు.

**కామెంట్లు**

విద్యార్థులు మాత్రం కోచింగ్ సెంటర్లు పెట్టే ర్యాంకుల ఒత్తిడి కారణంగానే మరణిస్తున్నారని పలువురు కామెంట్లు చేస్తున్నారు. రోజువారీ చదువు, హెూంవర్క్ వంటివి తప్పనిసరి చేస్తూ కఠిన రూల్స్ పెట్టడం వల్లనే అనేక మంది విద్యార్థులు తట్టుకోవడం లేదని అంటున్నారు. అయితే ఈ సూసైడ్‌ల విషయంలో మీరు ఏమనుకుంటున్నారో అభిప్రాయం రూపంలో తెలియజేయండి మరి.

## రష్యాలోని ఎత్తైన భవనాలపై డ్రోన్ దాడులు..

**వరల్డ్ ట్రేడ్ సెంటర్ టవర్లపై దాడిని తలపించిన దృశ్యాలు**



**మాస్కో-నవభూమి:** రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధం కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్ ప్రయోగించిన డ్రోన్లు రష్యాలోని ఎత్తైన భవనాలను ఢీకొట్టి పేలాయి. 2001లో న్యూయార్క్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ టవర్లను విమానాలు ఢీకొన్న సంఘటనను ఈ దాడి తలపించింది. ఈ వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. శనివారం ఉదయం రష్యాలోని కజాన్ నగరంపై డ్రోన్లతో ఉక్రెయిన్ దాడి చేసింది. రెండు ఎత్తైన భవనాలను రెండు డ్రోన్లు ఢీకొని పేలిపోయాయి. మంటలు చెలరేగడంతో నల్లటి పొగలు దట్టంగా వ్యాపించాయి.కాగా, ఎత్తైన ఆయా భవనాల్లోని నివాసితులను సురక్షితంగా ఖాళీ చేయించినట్లు రష్యా మీడియా తెలిపింది. అయితే ఉక్రెయిన్ డ్రోన్ల దాడిలో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదని పేర్కొంది. ఈ సంఘటన నేపథ్యంలో కజాన్ విమానాశ్రయంలో విమాన రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు వెల్లడించింది.మరోవైపు 2001 సెప్టెంబర్ 11న అమెరికాలోని న్యూయార్క్‌లో వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లోని ట్విన్ టవర్లపై అల్‌ఖైదా ఉగ్రవాదులు దాడులు చేశారు. హైజాక్ చేసిన విమానాలతో ఎత్తైన టవర్ బిల్డింగ్‌లను ఢీకొట్టారు. దీంతో దట్టంగా మంటలు, పొగలు వ్యాపించాయి. అయితే డిసెంబర్ 21న రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్ల దాడి 9/11 ఉగ్రదాడిని తలపించింది. ఈ వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

# రాహుల్‌పై విచారణ



**న్యూఢిల్లీ-నవభూమి:** పార్లమెంటు ఆవరణలో అధికార, ప్రతిపక్ష ఎంపీల మధ్య చోటుచేసుకున్న బాహాబాహీ ఘటనకు సంబంధించి.. ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని ప్రశ్నించనున్నట్లుగా ఢిల్లీ పోలీసు వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. ఎంపీల మధ్య తోపులాట కారణంగా ఇద్దరు బీజేపీ ఎంపీలు గాయపడటం, రాహుల్‌గాంధీపై పార్లమెంటు స్ట్రీట్‌లోని పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నేతలు ఫిర్యాదు చేయటం తెలిసిన విషయమే. దీనిపై రాహుల్ మీద పోలీసులు ఎఫ్ఐఆర్ కూడా దాఖలు చేశారు. దీంట్లో భాగంగానే ప్రతిపక్షనేతను ప్రశ్నించనున్నట్లు సమాచారం. కాగా, రాహుల్‌పై నమోదైన కేసు ఢిల్లీ క్రైం బ్రాంచ్‌కు బదిలీ అయింది. ఇదే ఘటనలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే గాయపడటంపై ఆ పార్టీ నేతలు బీజేపీ ఎంపీలపై ఆరోపణలు చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తోపులాట ఘటనకు సంబంధించిన సీసీటీవీ రికార్డులను పరిశీలించటానికి అనుమతించాలని పార్లమెంటు సెక్రటేరియట్‌ను పోలీసులు కోరే అవకాశం ఉందని తెలిసింది. కాగా, పార్లమెంటు ఘటన సందర్భంగా రాహుల్ తనతో అనుచితంగా ప్రవర్తించారంటూ బీజేపీ మహిళా ఎంపీ ఫాంగ్‌నాన్ కొన్యాక్ ఆరోపించిన నేపథ్యంలో మహిళా కమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరింది.

రాహుల్ ఎన్నడూ అలా చేయరు

రాహుల్‌పై ఎఫ్ఐఆర్ దాఖలు కావటంపై ఆయన సోదరి, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకగాంధీ స్పందిస్తూ శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. అమిత్‌షా వ్యాఖ్యల వల్ల అంబేడ్కర్‌కు జరిగిన అవమానాన్ని భారతదేశం సహించదన్న విషయం బీజేపీకి తెలుసు కాబట్టే.. ఈ తరహాలో దృష్టి మరల్చే పనులకు పాల్పడుతోందన్నారు. అంబేడ్కర్ పట్ల బీజేపీకి ఉండే అసలు అభిప్రాయాలు ఇప్పుడు బయటపడ్డాయని, దీనివల్లే ఆ పార్టీ భయపడుతోందని విమర్శించారు. కేంద్రానికి చర్చలంటే భయమని, అందుకనే అదానీతోపాటు ఏ అంశంపైనా పార్లమెంటులో చర్చకు ముందుకు రావటం లేదన్నారు. రాహుల్ ఎలాంటివాడో ఆయన సోదరిగా తనకు తెలుసునని ప్రియాంక పేర్కొన్నారు. 'రాహుల్ ఎవరినీ నెట్టివేయరు. అటువంటి పని ఆయన ఎన్నడూ చేయరు. ప్రభుత్వం పూర్తి నిరాశలో కూరుకుపోయింది. అందువల్లే రాహుల్‌పై పలు తప్పుడు కేసులు నమోదు చేస్తోంది' అని ఆరోపించారు.

ప్రియాంకా గాం?ధీకి శుక్రవారం పార్లమెంటులో అనూహ్య పరిణామం ఎదురైంది. బీజేపీ మహిళా ఎంపీ అపరాజిత సారంగి.. ప్రియాంకకు '1984' అని ఎరుపు రంగుతో రాసి ఉన్న బ్యాగును బహుమతిగా ఇచ్చారు. 1984లో ఇందిరా గాంధీ హత్య తర్వాత జరిగిన సిక్కుల ఊచకోతను గుర్తుచేసే విధంగా బ్యాగును రూపొందించారు. అయితే ప్రియాంక మాత్రం తొలుత బ్యాగును తీసుకోవడానికి నిరాకరించినా... కొద్దిసేపటికి తీసుకొని పక్కన పడేసి వెళ్లిపోయారు. ఇందుకు సంబం?ధించిన దృశ్యాలను సోషల్ మీడియాలో బీజేపీ ఎంపీ పోస్టు చేశారు.

## కిరాయి బీఎండబ్ల్యూ.. 400 మీటర్ల బీభత్సం.. సైక్రియాట్రీ డాక్టర్ అరెస్టు..



**బెర్లిన్-నవభూమి:**జర్మనీలోని మాగ్‌డేబర్గ్ సిటీలో.. ఓ డాక్టర్ తన కారుతో బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. క్రిస్టమస్ సందర్భంగా ఏర్పాటు చేసిన మార్కెట్లోకి కారుతో దూసుకెళ్లాడు. ఆ ఘటనలో ఇద్దరు మృతిచెందగా, 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. అయితే కారుతో జనంపై దూసుకెళ్లిన ఆ ఉన్మాదిని ఓ డాక్టర్‌గా గుర్తించారు. అతని పేరు అల్ అబ్దుల్‌మోషెన్. అతని స్వంత దేశం సౌదీ అరేబియా. 2006 నుంచి అతను జర్మనీలో ఉంటున్నాడు.బెర్న్‌బర్గ్‌లో ఉన్న ఓ ఆస్పత్రిలో సైకియాట్రీ డాక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. బీఎండబ్ల్యూ కారును కిరాయి తీసుకున్న అతను.. జనంపైకి డ్రైవ్ చేశాడు. ఆ ఘటనలో 68 మంది గాయపడ్డారు. 50 ఏళ్ల ఆ డాక్టర్‌ను అరెస్టు చేశారు. అతను ఒక్కడే ఆ దాడికి దిగాడా లేక అతనేమైనా ఉగ్ర చర్యకు పాల్పడ్డాడా అన్న కోణంలో విచారణ జరుగుతున్నది.

## ఆయన్ని 'పిచ్చి కుక్క' కరిచింది: ప్రియాంక్ ఖర్గే



**కలబురగి-నవభూమి:**డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యల వివాదం ఇప్పుడిప్పుడే చల్లారేలా కనిపిచడం లేదు. తాజాగా అమిత్‌షాపై కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే సంచలన వ్యాఖ్యలు చేశారు. "ఆయనను పిచ్చికుక్క కరిచినట్టుంది" అని మీడియాతో మాట్లాడుతూ అన్నారు.

"ఏడు జన్మల్లో నేను భగవంతుడి నామజపం చేస్తే స్వర్గం వస్తుందో లేదో నాకు తెలియదు. ఈ జన్మలో అంబేడ్కర్ నామం జపిస్తే మాత్రం మాకు రాజకీయ, సామాజిక, ఆర్థిక సమానత్వం, గౌరవప్రదమైన జీవితం లభిస్తుంది" అని ఖర్గే అన్నారు. అంబేడ్కర్, సమానత్వం అనేవి ఆయన (అమిత్‌షా) ఆలోచనల్లో కూడా లేవని, ఆయన సిద్ధాంతం, భావజాలం నుంచి ఇవి కనుమరుగయ్యాయని విమర్శించారు. అంబేడ్కర్, బసవ ఫిలాసఫీ పెరిగే కొద్దీ ఆర్ఎస్ఎస్ సిద్ధాంత భావజాలం తగ్గుముఖం పడుతుందని ప్రియాంక్ ఖర్గే అన్నారు.

**అమిత్‌షా ఏమన్నారు?**

ఈనెల 20వ తేదీతో పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో భాగంగా కేంద్ర మంత్రి అమిత్‌షా డిసెంబర్ 18న రాజ్యసభలో చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. అంబేడ్కర్ పేరును పదేపదే ప్రస్తావించడం కాంగ్రెస్‌కు ఒక ఫ్యాషన్‌గా మారిందని షా విమర్శించారు. దేవుడి పేరు పదేపదే వల్లె వేస్తే స్వర్గమైనా దొరుకుతుందని అన్నారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, అంబేడ్కర్‌ను అమమానించినందుకు అమిత్‌షా క్షమాపణ చెప్పాలని, తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. పార్లమెంటు వెలుపల వినూత్న రీతిలో రోజువారీ నిరసనలకు దిగింది. అయితే, తన వ్యాఖ్యలను కాంగ్రెస్ వక్రీకరించిందని, ఎడిట్ వెర్షన్లతో తప్పుదారి పట్టించిందని అమిత్‌షా వివరణ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీనే అంబేడ్కర్ వ్యతిరేక, రిజర్వేషన్ వ్యతిరేక పార్టీ అని అన్నారు.

## 1,500 మంది భారతీయులు అమెరికా నుంచి తరలింపు

**వాషింగ్టన్-నవభూమి:** లక్షలాది మంది అక్రమ వలసదారులను దేశం నుంచి పంపించి వేస్తామని దేశాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడానికి ముందే ట్రంప్ ప్రకటించగా గత ఆర్థిక సంవత్సరంలో దాదాపు 2.70 లక్షల మందికిపైగా అక్రమ వలసదారులను భారత్‌తోసహా 192 దేశాలకు పంపించివేసినట్టు అమెరికా అధికారులు వెల్లడించారు. 2024 ఆర్థిక సంవత్సరంలో ఐసీఈ 2,647 మంది భారతీయులను తరలింపు నిమిత్తం నిర్బంధించింది.

వీరిలో 1,500 మందిని భారత్‌కు తరలించి వేసింది. మెక్సికో, హెూండురాస్, గ్వాటెమాలా తర్వాత నాలుగవ స్థానంలో భారత్ అక్రమ వలసదారుల సంఖ్య నిలుస్తుంది. బైడెన్ పాలనలో చివరి వార్షిక నివేదిక ప్రకారం ట్రంప్ గతంలో మొదటిసారి అధ్యక్షుడిగా కొనసాగిన కాలంలో కూడా ఇంత భారీ సంఖ్యలో అక్రమ వలసవాదుల తరలింపు జరగలేదని తెలుస్తోంది. గడచిన దశాబ్ద కాలంలో ఒక్క సంవత్సరంలోనే ఇంత భారీ సంఖ్యలో తరలింపులు జరగడం ఇదే మొదటిసారి. అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టిన అనంతరం ప్రారంభమయ్యే అక్రమ వలసదారుల తరలింపులో ఈ 18వేల మంది భారతీయులు కూడా ఉండనున్నారు.

## మోస్ట్ పాపులర్ ఇండియన్ సెలబ్రిటీలుగా ప్రభాస్, సమంత




ఆర్మాక్స్ అత్యంత ప్రేక్షకాదరణ పొందిన నటీనటుల జాబితాను ప్రకటించింది. ఇందులో టాలీవుడ్ నుంచి ప్రభాస్ మోస్ట్ పాపులర్ నటుడిగా నిలవగా.. హీరోయిన్లలో సమంత టాప్‌లో నిలిచింది.ప్రముఖ మీడియా సంస్థ ఆర్మాక్స్ ప్రతినెల దేశంలోని సెలబ్రిటీల గురించి సర్వే నిర్వహించి.. టాప్ పొజిషన్‌లో ఉన్న సెలబ్రిటీల జాబితాలను విడుదల చేస్తుందన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే నవంబర్ నెలకు సంబంధించిన మోస్ట్ పాపులర్ మేల్, ఫిమేల్ స్టార్స్ సర్వే జాబితాను ఆర్మాక్స్ వెల్లడించింది. ఈ లిస్ట్‌లో ప్రభాస్ టాప్ ప్లేస్‌లో నిలిచాడు. ప్రభాస్ తర్వాత మోస్ట్ పాపులర్ నటులలో తమిళ నటుడు దళపతి విజయ్, అల్లు అర్జున్, షారుక్ ఖాన్, ఎన్టీఆర్, అజిత్ కుమార్, మహేశ్ బాబు, సూర్య, రామ్ చరణ్, అక్షయ్ కుమార్‌లు ఉన్నారు.

నవచిత్ర







త్రిప్తి

## త్రిప్తి.. స్టార్స్‌ని వెనక్కి నెట్టి మరీ..!

ఎన్నాళ్ల నుంచి సినిమాలు చేస్తున్నాం అన్నది కాదు ఎప్పుడు పాపులర్ అయ్యామన్నది లెక్క అని చెప్పినట్టుగా సినిమాల్లోకి వచ్చి ఎన్నేళ్లు అవుతున్నా ఒక్క టర్న్ కోసం కొందరు ఎదురుచూస్తుంటారు. అలాంటి టర్న్ వచ్చినప్పుడు మాత్రం వారి క్రేజ్ అమాంతం పెరుగుతుంది. ప్రస్తుతం అలాంటి దశలో తనకు వచ్చిన ఈ పాపులారిటీని సూపర్ గా ఎంజాయ్ చేస్తుంది త్రిప్తి డిమ్రి. యానిమల్ సినిమాకు ముందు కూడా అమ్మడు సినిమాలు, మ్యూజిక్ వీడియోస్ చేసింది. కానీ ఎందుకో అవేవి వర్క్ అవుట్ కాలేదు. కానీ యానిమల్ తో అమ్మడు సెన్సేషన్ సృష్టించింది. అందులో చేసిన పాత్ర నిడివి తక్కువే అయినా కూడా ఇంపాక్ట్ బాగా కలిగించింది. తద్వారా త్రిప్తి కెరీర్ ఒక రేంజ్ లో దూసుకెళ్తుంది. అంతేనా ఆడియన్స్ లో తన ఇమేజ్ ని డబుల్ చేసుకుంది. త్రిప్తి చేస్తున్న గ్లామర్ షోకి ఆడియన్స్ అంతా అలా పడి ఉంటున్నారన్నది నిజం. కెరీర్ మొదట్లో తనను ఎవరు గుర్తించకపోయినా యానిమల్ తర్వాత తనకు వచ్చిన ఈ ఐడెంటిటీని చూసి సూపర్ హ్యాపీగా ఫీల్ అవుతుంది అమ్మడు. ఇక 2024 లో మరో అచీవ్ మెంట్ సాధించింది త్రిప్తి. సాధారణంగా బాలీవుడ్ లో స్టార్స్ తాకిడి ఎక్కువే. అక్కడ అందరినీ దాటుకుని నమ్బర్ 1 గా నిలవడం చాలా కష్టం. కానీ ఎంతోమంది స్టార్స్ ఉన్నా కూడా గూగుల్ సెర్చ్ లో త్రిప్తి నంబర్ 1 గా నిలిచింది. గూగుల్ సెర్చ్ లో త్రిప్తి మిగతా హీరోయిన్స్ అందరినీ వెనక్కి నెట్టేసింది. ఇదంతా యానిమల్ సినిమా ప్రభావమే అని తెలిసిందే. అయినా కూడా అమ్మడు ఎన్నో ఏళ్లుగా కష్టపడుతున్నా రాని ఇమేజ్ ఒక్క సినిమాతో వచ్చేసింది. త్రిప్తి తెర మీద చూస్తే చాలు బీ టౌన్ ఆడియన్స్ ఊగిపోతున్నారు. ఈమధ్య వచ్చిన రెండు సినిమాలు కూడా ఆమె గ్లామర్ డోస్ ని బాగానే వాడుకున్నట్టు అనిపించింది. ప్రస్తుతం చేతినిండా సినిమాలతో అమ్మడు అదరగొట్టేస్తుంది. సౌత్ సినిమాల నుంచి ఆఫర్లు వస్తున్నా ఎందుకో అమ్మడు ఆలోచిస్తుందని తెలుస్తుంది. ఐతే యానిమల్ పార్క్ లో త్రిప్తి ఉంటుందా.. మళ్లీ తన అంద చందాలతో ఆడియన్స్ ని మెప్పిస్తుందా అంటూ సోషల్ మీడియాలో త్రిప్తి గురించి చర్చిస్తున్నారు. ఏది ఏమైనా యానిమల్ తో అందరితో పాటు త్రిప్తికి కూడా బాగా కలిసి వచ్చిందని చెప్పొచ్చు. ఈ టైంలోనే త్రిప్తి సౌత్ ఎంట్రీ ఇచ్చి ఇక్కడ ఒకటి రెండు హిట్లు సాధిస్తే కెరీర్ పర్ఫెక్ట్ గా సెట్ అయినట్టే అని చెప్పొచ్చు.

## 2024లో బిగ్ స్క్రీన్ మీద కనిపించని హీరోయిన్లు వీరే!

ఏటా తమ అందచందాలతో సినీ ప్రియులను అలరించే పలువురు హీరోయిన్లు.. 2024లో బిగ్ స్క్రీన్ మీద కనిపించలేదు. చేతి నిండా ప్రాజెక్ట్స్ తో ఏడాది పొడవునా బిజీగా ఉన్నప్పటికీ, అనుకున్న విధంగా సినిమాలు విడుదల అవ్వకపోవడంతో ఈ సంవత్సరం సందడి చేయలేకపోయారు. అయితే ఈసారి తెరపై కనిపించకపోయినా, 2025లో మాత్రం అస్సలు తగ్గేదేలే అంటున్నారు. కొత్త ఏడాదిలో అలరించడానికి రెడీ అవుతున్న ఆ హీరోయిన్లు ఎవరో ఇప్పుడు చూద్దాం.గతేడాది చివర్లో 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' సినిమాతో హిట్టు కొట్టిన సౌత్ క్వీన్ అనుష్క శెట్టి.. ఈ ఏడాది 'ఘాటీ' మూవీతో ప్రేక్షకుల ముందుకు రావడానికి ప్రయత్నించింది. కానీ కుదరలేదు. క్రిష్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ డ్రామా వచ్చే సమ్మర్ లో థియేటర్లలోకి రానుంది. ఇప్పటికే సైలెంట్ గా



షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతు న్నాయి. మరోవైపు స్వీటీ మలయాళ డెబ్యూ మూవీ 'కథనార్: ది వైల్డ్ సోర్సెరర్' కూడా రిలీజ్ కు రెడీ అవుతోంది. 'ఖుషి' సినిమాలతో సందడి చేసిన అగ్ర కథానాయిక సమంత రూత్ ప్రభు.. ఈ ఇయర్ లో బిగ్ స్క్రీన్ మీద కనిపించలేదు. కాకపోతే ఇటీవల 'సిటాడెల్: హనీబన్నీ' అనే వెబ్ సిరీస్ తో ఓటీటీలో అలరించింది. ఆ మధ్య తన సొంత ప్రొడక్షన్ లో 'మా ఇంటి బంగారం' అనే సినిమాని ప్రకటించింది. ఆ తర్వాత దీనికి సంబంధించిన ఎలాంటి అప్డేట్ బయటకు రాలేదు. కానీ ఈ మూవీ వచ్చే సంవత్సరం విడుదల అవుతుందని అభిమానులు భావిస్తున్నారు. 'వాల్తేరు వీరయ్య', 'వీర సింహా రెడ్డి', 'సలార్ పార్ట్-1' వంటి మూడు బ్లాక్ బస్టర్ హిట్లు అందుకున్న శృతి హాసన్.. ఈ ఏడాది సైలెంట్ అయిపోయింది. కానీ నెక్స్ట్ ఇయర్ మాత్రం 'కూలీ' సినిమాతో ఆడియన్స్ ముందుకు రాబోతోంది. 'సలార్ 2' కూడా లైనప్ లో ఉంది కానీ, అది ఎప్పుడు సెట్స్ మీదకు వెళ్తుందనేది తెలియడం లేదు. గ్యాప్ లేకుండా సినిమాలు చేసే నయనతారకు కూడా ఈ ఇయర్ లో గ్యాప్ వచ్చింది. కానీ వచ్చే ఏడాది మాత్రం దాదాపు 8 ప్రాజెక్ట్స్ తో రాబోతోంది. కాకపోతే వీటిల్లో ఒక్కటంటే ఒక్క తెలుగు సినిమా లేదు. అందాల భామ నిధి అగర్వాల్ తెలుగు తెరపై కనిపించి మూడేళ్లు దాటింది. ఇప్పుడు 'హరి హర వీరమల్లు', 'ది రాజాసాబ్' వంటి రెండు పాన్ ఇండియా సినిమాల మీద బోలెడన్ని ఆశలు పెట్టుకుంది. ఇవి రెండూ వచ్చే వేసవిలో విడుదల కాబోతున్నాయి. 'ఎఫ్ 3'లో స్పెషల్ సాంగ్ లో మెరిసిన బుట్టబొమ్మ పూజా హెగ్డే.. తెలుగు సినిమా చేసి రెండేళ్లు దాటిపోయింది. ఈ ఏడాది ఆమె నటించిన సినిమా లేకుండానే గడిచిపోయింది. అయితే ప్రస్తుతం అమ్మడు 'సూర్య 44', 'దళపతి 69', 'దేవా'తో సహా నాలుగు చిత్రాలు చేస్తోంది.- బరోజ్ ఫాంటసీ వరల్డ్.. 40 ఏళ్లలో ఇలాంటి సినిమా రాలేదు..! 'భోళా శంకర్' తర్వాత తెలుగు తెరకు దూరమైన మిల్కీ బ్యూటీ తమన్నా.. వచ్చే ఏడాది 'ఓదెల 2' చిత్రంతో పలకరించనుంది. రెండేళ్ల క్రితం ఆడియన్స్ కు 'థ్యాంక్యూ' చెప్పిన రాశీ ఖన్నా.. సమ్మర్ లో 'తెలుసు కదా' అంటూ రాబోతోంది. దీంతో పాటుగా ఆమె చేతిలో రెండు తమిళ, హిందీ చిత్రాలు ఉన్నాయి.

## అదొక యాక్సిడెంట్...



తెలంగాణ అసెంబ్లీలో ఇవాళ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎంఐఎం ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఒవైసీ తదితరులు చేసిన తీవ్ర ఆరోపణల పట్ల టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తీవ్ర మనస్తాపంతో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఆ రోజున జరిగింది అత్యంత దురదృష్టకరమైన సంఘటన అని వెల్లడించారు. ఈ ఘటనలో రేవతి అనే మహిళ మృతి చెందడం తనను కలచివేసిందని, ఆమె కుటుంబానికి, ముఖ్యంగా ఆమె భర్తకు సంతాపం తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వాళ్లబ్బాయి శ్రీతేజ్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నా నని తెలిపారు.

"జరిగిన ఘటనలో ఎవరి తప్పు లేదు... అదొక దురదృష్టకరమైన యాక్సిడెంట్. మేం ఒక మంచి సినిమా అందించాలని శ్రమించాం... థియేటర్ వాళ్లు కూడా ఒక మంచి సినిమా వేయాలని తాపత్రయపడ్డారు... పోలీసులు కూడా శక్తిమేర రక్షణ కల్పించాలని కృషి చేశారు... అయినప్పటికీ కూడా ఆ ఘటన జరిగింది. అందుకు ఎవరూ బాధ్యులు కారు. ఆ ఘటనకు దారి తీసిన పరిస్థితులు ఎవరి నియంత్రణలో లేవు. ఆ కుటుంబానికి జరిగింది తీరని నష్టం. అందుకు వారికి సంతాపం తెలియజేసుకుంటున్నాను.


సినీ రంగానికి చెందిన వ్యక్తిగా నా జీవిత లక్ష్యమే... థియేటర్లకు వచ్చిన ప్రేక్షకులను ఎంటర్టయిన్ చేయడం. థియేటర్ వచ్చిన జనాలను నవ్వుతూ పంపించాలన్నదే నా ఉద్దేశం. ప్రేక్షకుల మనసులను గెలిచి, సంతోషంగా పంపించాలని భావించే వ్యక్తిని. థియేటర్ ను ఒక ఆలయంలా భావించే వ్యక్తిని నేను... అలాంటి థియేటర్ లో ఘటన జరిగిందంటే నాకంటే బాధపడే వ్యక్తి మరొకరు ఉంటారా? చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితిపై ప్రతి గంటకు వివరాలు తెలుసుకుంటూనే ఉన్నాను.

చాలావరకు తప్పుడు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సరైన సమాచారం అందకపోవడం వల్ల కూడా ఇలాంటి పరిస్థితి ఏర్పడుతుంది. ఈ సందర్భంగా నేను ఏ రాజకీయ నేతను, ఏ ప్రభుత్వ విభాగాన్ని, ఇంకెవరినీ కూడా తప్పుబట్టడంలేదు. థియేటర్లలో టికెట్ రేట్లు పెంచుకునేందుకు అవకాశం ఇచ్చారు... బెనిఫిట్ షోలకు అనుమతి ఇచ్చారని ప్రభుత్వ పరంగా కూడా మేం సంతోషంగా ఉన్నాం.

ఇప్పుడు నేను మాట్లాడుతున్నది ఏ వ్యక్తిని ఉద్దేశించి కాదు... నేను ఇలా ప్రవర్తించాను, నేను అలా అన్నాను అని చాలా తప్పుడు ఆరోపణలు వచ్చాయి... వాటిపై వివరణ ఇవ్వాలన్నదే నా ప్రయత్నం. నాపై ఇలాంటి దారుణమైన ఆరోపణలు చేయడం అత్యంత బాధాకరం. 20 ఏళ్లుగా నన్ను చూస్తున్నారు కదా... నేను అలా మాట్లాడగలనా?

నేను నటించిన సినిమా గ్రాండ్ సక్సెస్ అయింది... కానీ ఆ సినిమాకు సంబంధించి సెలబ్రేషన్స్ లోనూ నేను పాల్గొనలేకపోతు న్నాను, కనీసం నా ఆఫీసుకు కూడా వెళ్లలేకపోతున్నాను. ఈ సమయంలో ఎలా ఉండాలి, కానీ పరిస్థితి ఎలా మారిపోయింది అని ఇంట్లోనే కూర్చుని విపరీతంగా బాధపడుతున్నాను. మూడేళ్లు కష్టపడి తీసిన సినిమాను నేను ఇంతవరకు థియేటర్లో చూడలేదన్నారు.

## ఇకపై నో బెనిఫిట్ షోస్..
## గేమ్ ఛేంజర్ పరిస్థితేంటి?




బడా హీరోల సినిమాలకు మేకర్స్ బెనిఫిట్స్ షోస్ వేయడం.. తెలిసిన విషయమే. అందుకు గాను ముందు మేకర్స్.. ప్రభుత్వం నుంచి పర్మిషన్ తీసుకుంటారు. ఆ తర్వాత స్పెషల్ షోస్ ఏర్పాటు చేస్తారు. ఇది కొన్నాళ్లుగా జరుగుతోంది. కానీ ఇకపై తెలంగాణలో బెనిఫిట్ షోస్ ఉండవు. ఈ మేరకు రాష్ట్ర సర్కార్ ప్రకటించింది. తెలంగాణలో ఇకపై బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వబోమని రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అసెంబ్లీలో శుక్రవారం మధ్యాహ్నం ప్రకటించారు. టికెట్ల రేట్లను పెంచేందుకు కూడా అనుమతి ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. సంధ్య థియేటర్ ఘటనలో చనిపోయిన రేవతి కుటుంబాన్ని తమ ప్రభుత్వం ఆదుకుంటుందని వెల్లడించారు. ౦వంత్ రెడ్డి మాట్లాడుతూ పలు వ్యాఖ్యలు చేశారు. సెలబ్రిటీలంతా సినిమాలు తీసుకోండని, బిజినెస్ చేసుకోండని అన్నారు. ప్రభుత్వం నుంచి రాయితీలు, ప్రోత్సాహకాలు కూడా తీసుకోండని తెలిపారు. షూటింగ్లకు ప్రత్యేక అనుమతులు కూడా తీసుకోండని అన్నారు. కానీ ప్రజల ప్రాణాలు పోతుంటే తమ ప్రభుత్వం మాత్రం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ప్రజల ప్రాణాలు పోయే ఘటనలు జరిగితే మాత్రం ఇకపై ప్రత్యేక మినహాయింపులు ఉండవని క్లారిటీ ఇచ్చారు. ఆ తర్వాత కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. రాష్ట్రంలో ఎలాంటి బెనిఫిట్ షోలు, టికెట్ల రేట్ల పెంపునకు అనుమతివ్వబోమని తేల్చి చెప్పేశారు. దీంతో సినీ ఇండస్ట్రీలో ఈ విషయం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. అప్ కమింగ్ బడా చిత్రాల పరిస్థితేంటని అంతా మాట్లాడుకుంటున్నారు. ముఖ్యంగా పాన్ ఇండియా లెవెల్ లో తెరకెక్కిన గేమ్ ఛేంజర్ మూవీ త్వరలో విడుదల కానుంది. కోలీవుడ్ ప్రముఖ డైరెక్టర్ శంకర్ దర్శకత్వం వహించగా, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై భారీ బడ్జెట్ తో దిల్ రాజు రూపొందించిన ఆ సినిమా జనవరి 10వ తేదీన విడుదల కానుంది. ఇప్పటికే ప్రమోషన్స్ ను జోరుగా నిర్వహిస్తూ ఆడియన్స్ లో మూవీపై భారీ హైప్ క్రియేట్ చేస్తున్నారు మేకర్స్. రీసెంట్ గా రిలీజ్ అయ్యి బ్లాక్ బస్టర్ హిట్ అయిన పుష్ప-2 సినిమాకు అందినట్లే తెలంగాణలో అన్ని అనుమతులు గేమ్ ఛేంజర్ కు దక్కుతాయని అంతా అంచనా వేశారు. స్పెషల్ షోస్ పడతాయని కూడా ఫిక్స్ అయిపోయారు ఫ్యాన్స్. కానీ ఇప్పుడు మంత్రి ప్రకటనతో ఏం జరగనుందోనని డిస్కస్ చేసుకుంటున్నారు. మరి గేమ్ ఛేంజర్ విషయంలో ఏమవుతుందో తెలియాలంటే వేచి చూడాలి.

## బీసీసీఐకి శ్రేయాస్ అయ్యర్ క్లియర్ మెసేజ్.. 50 బంతుల్లో 10 సిక్సర్‌లతో సెంచరీ



**న్యూఢిల్లీ-నవభూమి:** ఈ ఏడాది ప్రారంభంలో సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితా నుంచి తనను తొలగించిన బీసీసీఐ కి శ్రేయాస్ అయ్యర్ ఓ క్లియర్ మెసేజ్ ఇచ్చాడు. విజయ్ హజారే ట్రోఫీలో అద్భుత సెంచరీ ద్వారా ఈ మెసేజ్ పంపాడు. ముంబై జట్టు కెప్టెన్‌గా వ్యవహరించిన అయ్యర్.. కేవలం 50 బంతుల్లో సెంచరీ బాది తన జట్టును పటిష్ఠ స్థితిలో నిలిపాడు. గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియం లో కర్ణాటక జట్టుతో జరిగిన మ్యాచ్‌లో అయ్యర్ ఈ ఘనత సాధించాడు. కర్ణాటకతో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ముంబైకి ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఏడు పరుగుల వద్ద వికెట్ పడింది. అయితే రెండో వికెట్‌కు ఆయుష్ మాత్రే (78), హార్దిక్ తమోర్ (84) 141 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పి ముంబైకి బలమైన పునాది వేశారు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన శ్రేయాస్ అయ్యర్ (114).. శివమ్ దూబె (63) తో కలిసి 148 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పాడు. దూబె 36 బంతుల్లో ఐదు సిక్సులు, ఐదు ఫోర్‌లతో 63 పరుగులు చేయగా, అయ్యర్ 55 బంతుల్లో 10 సిక్సర్‌లతో 114 పరుగుల రాబట్టాడు. 50 బంతులకే సెంచరీ పూర్తిచేశాడు. చాంపియన్స్ ట్రోఫీకి ముందు అయ్యర్ అద్భుత ప్రదర్శన బీసీసీఐకి క్లియర్ మెసేజ్‌గా చెప్పవచ్చు. సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాలో తనకు చోటు కల్పించాలని బీసీసీఐకి అయ్యర్ స్పష్టంగా సందేశం పంపినట్లయ్యింది. ఇదిలావుంటే ఇటీవల జరిగిన ఐపీఎల్ వేలంలో పంజాబ్ కింగ్స్ ఎలెవన్ ఫ్రాంచైజీ శ్రేయాస్ అయ్యర్‌ను రూ. 26.75 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది.

## కోహ్లీ వన్ 8 కమ్యూన్ పబ్‌కు నోటీసులు.. 7 రోజుల్లో స్పందన లేకపోతే చట్టపరమైన చర్యలు



**న్యూఢిల్లీ-నవభూమి:** టీమ్ ఇండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ కి చెందిన ఓ పబ్‌కు అధికారులు నోటీసులు జారీ చేశారు. బెంగళూరు లోని ఎమ్‌జీ రోడ్డులో ఉన్న కోహ్లీకి చెందిన వన్ 8 కమ్యూన్ పబ్ నిర్వాహకులు ఫైర్ సేఫ్టీ ఉల్లంఘనకు పాల్పడినట్లు బెంగళూరు బృహత్ మహానగర పాలిక అధికారులు గుర్తించారు. ఈ మేరకు నోటీసులు జారీ చేశారు.

బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం సమీపంలోని ఎమ్‌జీ రోడ్డులో గల రత్నం కాంప్లెక్స్‌లో ఆరవ అంతస్తులో ఉన్న ఈ రెస్టారెంట్ అగ్నిమాపక శాఖ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ సహా ఎలాంటి అనుమతులూ లేకుండానే నిర్వహిస్తున్నారని సామాజిక కార్యకర్త వెంటకేష్ బెంగళూరు సివిల్ బాడీ కి ఫిర్యాదు చేశారు. ఫైర్ సేఫ్టీ చర్యలు లేకపోవడం వల్ల ప్రమాదం పొంచి ఉందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై విచారణ జరిపిన బీబీఎంపీ అధికారులు.. ఆ ఫిర్యాదు నిజమేనని తేల్చారు. ఈ మేరకు నవంబర్ 29న కోహ్లీకి చెందిన ఆ పబ్‌కు నోటీసులు జారీ చేశారు.అయితే, పబ్ యాజమాన్యం నోటీసులకు స్పందించకపోగా దిద్దుబాటు చర్యలు చేపట్టడంలో విఫలమైంది. దీంతో అధికారులు కోహ్లీ పబ్‌పై మరోసారి చర్యలకు పూనుకున్నారు.

నవక్రీడ

## పీఎఫ్ మోసం కేసులో.. మాజీ క్రికెటర్ ఊతప్పకు అరెస్టు వారెంట్ జారీ



**బెంగుళూరు: -నవభూమి:** మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్పకు అరెస్టు వారెంట్ జారీ చేశారు. ఉద్యోగులకు పీఎఫ్ ఇచ్చే అంశంలో అతను మోసానికి పాల్పడినట్లు తేలింది. అతనికి చెందిన బట్టల కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగుల ఖాతాల్లోకి పీఎఫ్ జమ చేయలేదు. అయితే 27వ తేదీ వరకు అతని టైం కల్పించారు. ఒకవేళ 24 లక్షల బకాయి చెల్లించకుంటే అతన్ని అరెస్టు చేసే అవకాశాలు ఉన్నాయి.బెంగుళూరుకు చెందిన సెంటొరస్ లైఫ్ స్టయిల్ బ్రాండ్స్ కంపెనీలో డైరెక్టర్‌గా ఉన్నాడు. ఆ కంపెనీ సుమారు 24 లక్షలు చెల్లించాల్సి ఉంది. కానీ ఆ డబ్బులు అతను చెల్లించలేదని ప్రాంతీయ పీఎఫ్ కమీషనర్ సదాక్షరి గోపాల్ రెడ్డి తన అరెస్టు వారెంట్‌లో పేర్కొన్నారు. డిసెంబర్ నాలుగవ తేదీన ఆ వారెంట్ జారీ చేశారు. ఉద్యోగులకు చెందిన పీఎఫ్ అమౌంట్‌ను విత్‌డ్రా చేసినట్లు ఊతప్పపై ఆరోపణలు ఉన్నాయి. అయితే అతను ఉద్యోగుల అకౌంట్లలోకి నిధులను డిపాజిట్ చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. పేద కార్మికుల పీఎఫ్ అకౌంట్లను సెటిల్ చేయని ఊతప్పను అరెస్టు చేయాలని లేఖలో కోరారు. భారత జట్టు తరపున 59 అంతర్జాతీయ మ్యాచ్‌లను ఆడాడు. ఐపీఎల్‌లో అతను పాపులర్ ప్లేయర్. ఇంటర్నేషనల్ కెరీర్‌లో ఊతప్ప 1183 రన్స్ చేశాడు. దాంట్లో ఏడు హాఫ్ సెంచరీలు ఉన్నాయి.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**